thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. No. TELTEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

Published From Jagital, Hyderabad, Adilabad, Warangal

| సంపుటి : 21 | సంచిక : 141 | జగిత్యాల | ఆదివారం | 23 ఆగస్టు, 2026 | ఎడిటర్ : మొహ్మద్ ఇమ్రాన్ | పేజీలు 12 + 8 జిల్లా అనుబంధం | వెల : 1.00 |

## భారత్ అఫ్గాన్ షెడ్యూల్ విడుదల



11

## న్యాయసేతు అనేది ఒక వారధి

- సీజేఐ జస్టిస్ సూర్యకాంత్
- వేగవంతమైన ఆర్థిక పురోగతికి పటిష్టమైన న్యాయ వ్యవస్థలే వెన్నెముక
- ఢిల్లీలో జరిగిన 11వ బ్రిక్స్ ప్లస్ లీగల్ ఫోరంలో పాల్గొన్న సీజేఐ జస్టిస్ సూర్యకాంత్
- అక్కడ న్యాయనామిక్స్, న్యాయ సేతు అనే పదాలను పరిచయం చేసిన ప్రధాన న్యాయమూర్తి



## విమాన ప్రయాణికులకు బిగ్ రిలీఫ్

- ఇకపై 'ఈ-బోర్డింగ్ పాస్' ఉంటే చాలు!
- ఎయిర్‌పోర్టుల వద్ద బోర్డింగ్ పాస్‌పై కేంద్రం కీలక నిర్ణయం
- అంతర్జాతీయ విమాన ప్రయాణికులు ఇకపై ఫిజికల్ బోర్డింగ్ పాస్‌ను తీసుకురావాల్సిన అవసరం లేదని వెల్లడి





## వందేమాతరంపై దేశవ్యాప్తంగా కార్యక్రమాలు

- కాంగ్రెస్ నిర్ణయాన్ని ఖండిస్తూ బీజేపీ తీర్మానం
- జాతీయ గేయం చరిత్ర, వారసత్వంపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పిస్తామని పార్టీ వెల్లడి
- వందేమాతరం రెండు చరణాలే పాడుతామంటూ కాంగ్రెస్ చేసిన ప్రకటనను ఖండిస్తూ మరో తీర్మానానికి పార్టీ ఆమోదం



## మెట్రో రెండో దశలో సరికొత్త హంగులు

- ఓచోట 'డబుల్ డెక్', మరోచోట భూగర్భ మార్గం
- మెట్రో రైలు ప్రాజెక్టు రెండో దశలో పలు ప్రత్యేకతలు, సవాళ్లు
- హకీంపేట విమానాశ్రయం సమీపంలో భూగర్భ మెట్రో మార్గం
- మదీనాగూడ, చందానగర్ మధ్య 1.2 కి.మీ పొడవైన డబుల్ డెక్

హైదరాబాద్

మెట్రో రైలు ప్రాజెక్టు రెండో దశ ప్రత్యేకతలు, సవాళ్లతో కూడుకున్నది. ఈ మార్గం సంక్లిష్టమైన రైల్వే క్రాసింగ్‌లు, ఫ్లైఓవర్లు, హైటెన్షన్ విద్యుత్ లైన్లు, విమానాశ్రయ ప్రాంగణాల గుండా వెళ్లాల్సి ఉంటుంది. జేబీఎస్? నుంచి శామీర్‌పేట కారిడార్‌లో హకీంపేట విమానాశ్రయం రన్‌వే కార్యకలాపాలకు అంతరాయం కలగకుండా ఉండేందుకు హెచ్‌ఎండీఏ ప్రణాళిక చేసిన హైవే టన్నెల్ వెంబడి 1.65 కి.మీ మేర భూగర్భ మెట్రో మార్గాన్ని ప్రతిపాదించారు. అదేవిధంగా నాగోల్ - మిగతా3లో

## కేంబ్రిడ్జ్‌తో తెలంగాణ కొత్త బంధం

- విద్య, పరిశోధన, స్టార్టప్‌లపై భారీ ప్లాన్!
- సీఎం రేవంత్ కీలక చర్చలు!
- లండన్ కేంబ్రిడ్జ్ వర్సిటీని సందర్శించిన సీఎం రేవంత్‌రెడ్డి బృందం
- విద్య, పరిశోధన రంగాల్లో భాగస్వామ్యంపై కేంబ్రిడ్జ్ ప్రతినిధులతో చర్చ
- హైదరాబాద్‌లో ఎడ్యుకేషన్, రీసెర్చ్ ప్రోగ్రామ్‌లు పెట్టాలని కోరిన సీఎం బృందం



హైదరాబాద్

లండన్‌లోని ప్రఖ్యాత కేంబ్రిడ్జ్ వర్సిటీని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బృందం సందర్శించింది. విద్య, పరిశోధన రంగాల్లో భాగస్వామ్యంపై కేంబ్రిడ్జ్ ప్రతినిధులతో సీఎం చర్చించారు. హైదరాబాద్‌లో ఎడ్యుకేషన్, రీసెర్చ్ ప్రోగ్రామ్‌లు పెట్టాలని కోరారు. యువపారిశ్రామికవేత్తలకు ఇంక్యుబేషన్, స్టార్టప్‌ల అభివృద్ధిలో భాగస్వామ్యం చేయాలని విజ్ఞప్తి చేశారు. స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికను రూపొందించుకోవాలని ఇరువర్గాలు నిర్ణయం తీసుకున్నారు. ఈ కార్యక్రమానికి మంత్రి శ్రీధర్ బాబు, సీఎం సలహాదారు రామకృష్ణారావు, ప్రత్యేక సీఎస్ జయేశ్ రంజన్‌లు హాజరయ్యారు. మరోవైపు సీఎం రేవంత్ పర్యటనకు కేంద్రం నో - మిగతా3లో



## న్యాయమూర్తులు దేవుళ్లు కాదు

- ప్రతి తీర్పు సరైనదిగా ఉండకపోవచ్చు
- జస్టిస్ సంజయ్ కరోల్
- వీడ్కోలు ప్రసంగంలో జస్టిస్ సంజయ్ కరోల్ కీలక వ్యాఖ్యలు
- న్యాయమూర్తులు దేవుళ్లు కాదన్న జస్టిస్ సంజయ్
- చట్టాన్ని మాత్రమే కాదని, న్యాయాన్ని కూడా దృష్టిలో పెట్టుకోవాలన్న జస్టిస్ కరోల్

## 'ఇది ఎలాంటి 'ఆత్మనిర్భర్ భారత్'

- పండగ ముందు ప్రజలపై భారం'
- కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు ఖర్గే ఫైర్
- చక్కెర ధరలను పెంపుపై ప్రభుత్వంపై మండిపడ్డ కాంగ్రెస్
- పండుగల సీజన్‌కు ముందే సామాన్య ప్రజలపై ఆర్థిక భారం పడుతుందని ఆరోపణ




## కాంగ్రెస్‌లో పాత రోజులు

- కాంగ్రెస్‌లో పతాక స్థాయికి చేరిన కుమ్ములాటలు
- "అంతర్గత ప్రజాస్వామ్యం" అనే ముసుగులో నేతలు హద్దులు దాటి బహిరంగ విమర్శలకు దిగడం ఇప్పుడు గాంధీభవన్‌ను కుదిపేస్తోంది
- సీఎం రేవంత్ రెడ్డికి కాంగ్రెస్ సిద్ధాంతాలు ఒంటబట్టలేదు
- కాంగ్రెస్‌లో ఎప్పటినుంచో రగులుతున్న 'వలస నేతలు వర్సెస్ ఒరిజినల్ కాంగ్రెస్' వివాదానికి ఇది పరాకాష్ఠ
- ఇతర పార్టీల నుంచి వచ్చిన నాయకులకు ప్రాధాన్యం దక్కుతోందని, ఉద్యమ కాలం నుంచి పార్టీని మోసిన పాత తరం నేతలు, ముఖ్యంగా బీసీ నాయకత్వం క్రమంగా పక్కకు నెట్టివేయబడుతోందనే అసహనం
- సీఎం రేవంత్ రెడ్డికి కాంగ్రెస్ సిద్ధాంతాలు ఒంటబట్టలేదని, పార్టీ క్రమంగా 'టీడీపీ కాంగ్రెస్'గా మారుతోందంటూ వ్యాఖ్యలు

హైదరాబాద్

కాంగ్రెస్‌లో అంతర్గత ప్రజాస్వామ్యం ఎక్కువ అని చెప్పుకుంటూ ఉంటారు. అసంతృప్తి ప్రకటనలు చేసే వారికి ఈ పేరు పెట్టుకున్నారు. ఇప్పుడీ కాంగ్రెస్ మార్క్ అంతర్గత ప్రజాస్వామ్యం హద్దులు దాటి పోతోంది. రాజగోపాల్ రెడ్డి నిరంతరం వివాదాస్పద ప్రకటనలు చేస్తున్నారు. అనిరుధ్ రెడ్డితో పాటు ఇటీవల చిన్నారెడ్డి కూడా అదే చేశారు. తాజాగా సుస్మితా పటేల్ సంచలనం సృష్టించారు. రాష్ట్ర మంత్రి కొండా సురేఖ కుమార్తె కొండా సుస్మిత నేరుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని లక్ష్యంగా చేసుకుని చేసిన ఘాటు వ్యాఖ్యలు పార్టీ వర్గాల్లో తీవ్ర రాజకీయ కలకలాన్ని రేపాయి. సీఎం రేవంత్‌కు పార్టీ సిద్ధాంతాలు ఇంకా వంటబట్టలేదని, కాంగ్రెస్ క్రమంగా టీడీపీ కాంగ్రెస్ గా మారుతోందని ఆరోపిస్తూ ఆమె నేరుగా తీవ్రస్థాయిలో విమర్శలు చేయడం కాంగ్రెస్ కేడర్‌ను షాక్‌కు గురిచేసింది. వరంగల్ జిల్లా ఙ సుకొండలో జరిగిన ఒక కార్యక్రమంలో కొండా సుస్మిత మాట్లాడుతూ, రాబోయే ఎన్నికల్లో పరకాల అసెంబ్లీ టికెట్ విషయంపై సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయం ప్రకటించడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. - మిగతా3లో



## గచ్చిబౌలిలో ఘోర ప్రమాదం



- ఏడంతస్తుల భవనం కూలి ఇద్దరు మృతి
- అలాంటి నిర్మాణాలన్నీ కూల్చేస్తామన్న హైడ్రా కమిషనర్ రంగనాథ్
- గచ్చిబౌలి అంజయ్యనగర్‌లో కూలిన భవనం
- ఏడంతస్తుల భవనం కూలి పక్కనున్న అపార్ట్‌మెంట్‌పై పడిన శిథిలాలు
- శిథిలాల కింద నుంచి రెండు మృతదేహాలను వెలికితీసిన రెస్క్యూ సిబ్బంది
- పరిశీలించిన హైడ్రా కమిషనర్

# న్యాయసేతు అనేది ఒక వారధి

స్థిరమైన ఆర్థిక వృద్ధి కేవలం భౌగోళిక లేదా ముడి సహజ వనరులపై మాత్రమే కాకుండా సంస్థాగత స్థిరత్వం, విశ్వాసం, సామర్థ్యంపై ఎక్కువగా ఆధారపడి ఉంటుందని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ తెలిపారు. బ్రిక్స్ ప్లస్ దేశాలు మానవాళిలో 40శాతానికి పైగా, ప్రపంచ పీపీపీ ఉత్పత్తిలో దాదాపు 40శాతం వాటాను కలిగి ఉన్నాయని చెప్పారు. వేగవంతమైన ఆర్థిక పురోగతికి పటిష్ఠమైన న్యాయ వ్యవస్థలే వెన్నెముక అని పేర్కొన్నారు. ఈ క్రమంలో చట్టబద్ధమైన పాలనకు సంబంధించిన 'న్యాయనామిక్స్', 'న్యాయసేతు' అనే పదాలను పరిచయం చేశారు. సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ శనివారం దిల్లీలో జరిగిన 11వ బ్రిక్స్ ప్లస్ లీగల్ ఫోరంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో 'న్యాయ సేతు' (న్యాయ వారధి), 'న్యాయఆర్థిక శాస్త్రం' (న్యాయనామిక్స్) అనే కాన్సెప్ట్‌లను పరిచయం చేశారు. బ్రిక్స్ ప్లస్ దేశాలలో చట్టపరమైన, ఆర్థిక శక్తిని ఏకీకృతం చేసేందుకు 'న్యాయనామిక్స్', 'న్యాయ సేతు' దార్శనికత గురించి వివరించారు. 'బహుధ్రువ ప్రపంచంలో చట్టబద్ధ పాలన' అనే అంశంపై జరిగిన ప్రారంభ ప్లీనరీలో సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ ఈ మేరకు వ్యాఖ్యానించారు. "చట్టబద్ధమైన పాలన గురించి నేను ఒక పదాన్ని ఉదహరిస్తున్నాను. అదే న్యాయనమిక్స్. మరింత సరళంగా చెప్పాలంటే న్యాయ ఆర్థిక శాస్త్రం. ఈ న్యాయనామిక్స్ బ్రిక్స్ ప్లస్ దేశాలన్నింటికీ వర్తిస్తుంది. కేసులను డిజిటలైజ్ చేయడంలో భారతదేశానికి ఉన్న అనుభవాన్ని ఆధారంగా చేసుకుని, న్యాయశాస్త్రానికి సంబంధించిన ఒక ఉమ్మడి భాండాగారాన్ని ఏర్పాటు చేయాలి. తద్వారా బ్రిక్స్ ప్లస్ దేశాల అధికార పరిధిలో



వెలువడిన తీర్పు, అదే విధమైన చట్టపరమైన ప్రశ్నలతో వ్యవహరించే ఇతర ప్రాంతాలలోని న్యాయస్థానాలకు మార్గదర్శకంగా ఉపయోగపడుతుంది. తద్వారా దిల్లీ, బ్రసీలియాలో రాసిన తీర్పు అదే ప్రశ్నను ఎదుర్కొంటున్న మరోచోట ఉన్న ధర్మాసనానికి తెలియజేయడానికి సంవత్సరాల తరబడి వేచి ఉండాల్సిన అవసరం లేదు. 'న్యాయ సేతు' అనేది 11 న్యాయ సంప్రదాయాలను అనుసంధానించే ఒక వారధి."

**'బ్రిక్స్ పరస్పర సహకారం కోసం మరింత విస్తృతమైన వేదికగా ఎదిగింది'**

బ్రిక్స్ దేశాల మధ్య బలమైన న్యాయ సహకారం అవసరాన్ని బార్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఉపాధ్యక్షుడు ఎస్.ఎస్. నాగానంద్ కూడా నొక్కి చెప్పారు. బ్రిక్స్ ఏర్పడినప్పుడు దాని ప్రధాన దృష్టి సభ్య దేశాల మధ్య ఆర్థిక, ద్రవ్య సహకారాన్ని బలోపేతం చేయడంపైనే ఉందని పేర్కొన్నారు. సంవత్సరాలుగా బ్రిక్స్ పరస్పర సహకారం, భాగస్వామ్యం కోసం మరింత విస్తృతమైన వేదికగా ఎదిగిందని గుర్తు చేసుకున్నారు. దీంతో ఆర్థిక సంబంధాలతో పాటు చట్టపరమైన సంబంధాలు కూడా అనివార్యంగా బలపడతాయని తెలిపారు. "బ్రిక్స్ న్యాయ వేదికను స్థాపించడం, అభివృద్ధి చేయడం చాలా అవసరం. ఇలా చేస్తే సమస్యలను సమష్టిగా పరిశీలించడానికి, ఒకరి న్యాయ వ్యవస్థలను మరొకరు అర్థం చేసుకోవడానికి, ఒకరి అనుభవాల నుంచి మరొకరు నేర్చుకోవడానికి, అలాగే మన దేశాల మధ్య ఉన్న వివాదాలకు పరిష్కారాన్ని ఎలా సరళంగా, మరింత ప్రభావవంతంగా కనుక్కోవచ్చో అన్వేషించడానికి ఒక అద్భుతమైన అవకాశం లభిస్తుంది. ఈ మారుతున్న అవసరాలను దృష్టిలో ఉంచుకుని దిల్లీలో ఒక బ్రిక్స్ మధ్యవర్తిత్వ కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి బార్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా చొరవ తీసుకుంది."

**భారత్ అధ్యక్షతన బ్రిక్స్ సదస్సు**

2012, 2016, 2021లలో భారత్ బ్రిక్స్ సదస్సుకు అధ్యక్షత వహించింది. 2026లో నాలుగోసారి ఈ శిఖరాగ్ర సదస్సుకు అధ్యక్షత వహించనుంది. ఈ నేపథ్యంలో ప్రముఖ న్యాయ ప్రముఖుల నుంచి ఈ వ్యాఖ్యలు వెలువడ్డాయి. 'స్థితిస్థాపకత, ఆవిష్కరణ, సహకారం, సుస్థిరత కోసం నిర్మాణం' అనే ఇతివృత్తంతో ఇండియా బ్రిక్స్ సదస్సుకు అధ్యక్షత వహించనుంది. కాగా, బ్రిక్స్ కూటమిలో 2024లో ఇరాన్‌తోపాటు ఈజిప్టు, ఇథియోపియా, యూఏఈ దేశాలు చేరాయి. 2025లో ఇండోనేసియా కూడా బ్రిక్స్ కూటమిలో భాగమైంది. దీంతో ప్రస్తుతం పూర్తిస్థాయి బ్రిక్స్ సభ్యదేశాల సంఖ్య 11కు చేరుకుంది.

# విమాన ప్రయాణికులకు బిగ్ రిలీఫ్

సెప్టెంబర్ 1 నుంచి భారత విమానాశ్రయాల నుంచి బయలుదేరే అంతర్జాతీయ ప్రయాణికులు తమ బోర్డింగ్ పాస్‌లపై ఇమ్మిగ్రేషన్ అధికారులతో భౌతికంగా స్టాంప్ వేయించుకోవాల్సిన అవసరం లేదని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. స్టాంపింగ్‌కు బదులుగా విదేశాలకు ప్రయాణించే ప్రయాణికులు ఇమ్మిగ్రేషన్ క్లియరెన్స్ కోసం తమ స్మార్ట్‌ఫోన్‌లోని ఈ-బోర్డింగ్ పాస్‌ను చూపించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. అయితే ప్రయాణికులు ఫిజికల్ బోర్డింగ్ పాస్‌లను తీసుకురావొచ్చని, కానీ ఇమ్మిగ్రేషన్ అధికారులు వాటిపై స్టాంప్ వేయరని పేర్కొంది. ఈ మేరకు సంబంధిత అధికారులు వెల్లడించారు.



**ప్రయాణికుల అసౌకర్యాన్ని దృష్టిలో పెట్టుకుని!**

ఫిజికల్ బోర్డింగ్ పాస్‌లు సమర్పించే విషయంలో ప్రయాణికులకు అసౌకర్యం కలుగుతోందని, ఒక్కోసారి స్టాంపింగ్ తప్పిదాల వల్ల ఇబ్బందులు కలుగుతున్నాయని బ్యూరో ఆఫ్ ఇమిగ్రేషన్ తెలియజేయడంతో కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని అధికారులు తెలిపారు. దేశంలోని అన్ని అంతర్జాతీయ విమానాశ్రయాలలో భౌతిక బోర్డింగ్ పాస్‌ల తప్పనిసరి అవసరాన్ని, ఇమ్మిగ్రేషన్ కౌంటర్ల వద్ద బోర్డింగ్ పాస్‌లపై స్టాంపింగ్‌ను తొలగించాలని కేంద్రం తాజాగా నిర్ణయించిందని పేర్కొన్నారు. ప్రయాణికుల తనిఖీ సమయంలో సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సీఐఎస్ఎఫ్) కూడా బోర్డింగ్ పాస్‌లపై స్టాంపులు వేయదని స్పష్టం చేశారు. వాటిని కేవలం ఇమిగ్రేషన్ అధికారుల క్లియరెన్స్ కోసం మాత్రమే చూపించాల్సి ఉంటుందని వెల్లడించారు. భారత పాస్‌పోర్ట్ ఉన్న పౌరులకు కూడా బోర్డింగ్ పాస్‌లపై స్టాంపింగ్ తొలగింపు విషయంలో పైలట్ ప్రాజెక్ట్ చేపట్టినట్లు వివరించారు.

**కేంద్ర సర్కార్ కొత్త రూల్స్ ప్రకారం**

భారత్ నుంచి బయలుదేరే ప్రయాణికులు ఇమ్మిగ్రేషన్ క్లియరెన్స్ సమయంలో తమ స్మార్ట్‌ఫోన్‌లో ఉన్న ఈ-బోర్డింగ్ పాస్‌లను చూపించవచ్చు. అలా అని ఫిజికల్ బోర్డింగ్ పాస్‌లను కలిగి ఉన్న ప్రయాణికులకు బోర్డింగ్ క్లియరెన్స్‌ను ఇస్తారు. అయితే సెప్టెంబర్ 1 నుంచి ఇమ్మిగ్రేషన్ అధికారులు ఫిజికల్ బోర్డింగ్ పాస్‌లపై స్టాంపులు వేయరు. కాగా, సీఐఎస్ఎఫ్ కొన్నేళ్ల క్రితమే దేశీయ, అంతర్జాతీయ ప్రయాణికుల బోర్డింగ్ పాస్‌లపై స్టాంపులు వేయడాన్ని ఆపేసింది.

**మరో కీలక చర్యకు సిద్ధమవుతోందా?**

అలాగే అంతర్జాతీయ ప్రయాణికులకు మరింత సౌకర్యం కల్పించే దిశగా బ్యూరో ఆఫ్ ఇమ్మిగ్రేషన్ మరో కీలక చర్యకు రెడీ అవుతోంది. భారతీయ పాస్‌పోర్ట్ కలిగిన ప్రయాణికుల రాకపోకల సమయంలో పాస్‌పోర్ట్‌లపై స్టాంపింగ్ వేసే విధానాన్ని కూడా పూర్తిగా తొలగించేందుకు సిద్ధమవుతోంది. దీనికి సంబంధించి త్వరలోనే ఒక పైలట్ ప్రాజెక్ట్‌ను ప్రారంభించి, ఆ తర్వాత దేశంలోని అన్ని అంతర్జాతీయ విమానాశ్రయాల్లో అమలు చేయనుంది.

**పాస్‌పోర్టు ఫీజుల పెంపు**

కాగా, పాస్‌పోర్ట్ ఫీజులను కేంద్ర ప్రభుత్వం ఇటీవల సవరించింది. 36 పేజీలతో కూడిన పాస్‌పోర్ట్ రుసుమును రూ.1500 నుంచి రూ.2,500 పెంపు చేసింది. తత్కాల్ ఫీజును రూ.3,500 నుంచి రూ.5 వేలకు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. 60 పేజీల పాస్‌పోర్ట్‌కు ప్రస్తుతం రూ.2వేల ఫీజు కాగా, ఇక నుంచి రూ.3500 వసూలు చేయనుంది. అదే తత్కాల్ ఫీజును రూ.6వేలుగా నిర్ణయించింది. 18 ఏళ్ల కన్నా తక్కువ వయసున్న దరఖాస్తుదారులకు కొత్త పాస్‌పోర్ట్ రుసుము ప్రస్తుతం రూ.1000 ఉండగా, అది రూ.1750కి పెరిగింది. దాదాపు 14 ఏళ్ల తర్వాత పాస్‌పోర్ట్ ఫీజులు పెరిగాయి.

**ఇండియా పాస్‌పోర్ట్ ప్రయాణ పత్రం మాత్రమే : కేంద్ర విదేశాంగ శాఖ స్పష్టం**

భారత పాస్‌పోర్ట్ ప్రధానంగా ప్రయాణ పత్రం మాత్రమేనని, అది పౌరసత్వానికి తుది ఆధారం కాదని కేంద్ర విదేశాంగ శాఖ ఇటీవలే స్పష్టం చేసింది. గత 12 ఏళ్లలో పాస్‌పోర్ట్‌ను పౌరసత్వ ధ్రువీకరణ పత్రంగా ఎప్పుడూ ప్రకటించలేదని పేర్కొంది. దీనికి ఆధారంగా పాస్‌పోర్ట్ చట్టం-1967లోని సెక్షన్-20ను ప్రస్తావించింది. ప్రజా ప్రయోజనాల దృష్ట్యా అవసరమైతే భారత పౌరుడు కాని వ్యక్తికీ కూడా కేంద్ర ప్రభుత్వం పాస్‌పోర్ట్ లేదా ప్రయాణ పత్రాన్ని జారీ చేయవచ్చని ఆ సెక్షన్‌లో స్పష్టంగా పేర్కొన్నట్లు తెలిపింది. ఈ నిర్ణయంపై అప్పట్లో మోదీ ప్రభుత్వంపై విపక్షాలు భగ్గుమన్నాయి.

# వందేమాతరంపై దేశవ్యాప్తంగా కార్యక్రమాలు

వందేమాతరం విషయంలో కాంగ్రెస్ "బుజ్జగింపు రాజకీయాలకు" పాల్పడుతోందని బీజేపీ శనివారం ఆరోపించింది. రాజ్యాంగం, పార్లమెంట్ చేసిన చట్టాల కంటే ఏ పార్టీ లేదా వ్యక్తి గొప్పవారు కాదని స్పష్టం చేసింది. వందేమాతరం గేయంలోని కేవలం రెండు చరణాలను మాత్రమే పాడాలన్న కాంగ్రెస్ నిర్ణయాన్ని తీవ్రంగా ఖండిస్తూ బీజేపీ ఓ తీర్మానాన్ని ఆమోదించింది. రాజకీయ ప్రయోజనాల కోసం లేదా బుజ్జగింపుల కోసం జాతీయ గేయం గౌరవం విషయంలో ఎలాంటి రాజీని అంగీకరించబోమని స్పష్టం చేసింది. దిల్లీలో బీజేపీ అధ్యక్షుడు నితిన్ నబిన్ అధ్యక్షతన జరిగిన పార్టీ నూతన పదాధికారుల సమావేశంలో ఈ మేరకు తీర్మానం ఆమోదించారు. వందేమాతరం ఘనమైన వారసత్వాన్ని దేశం నలుమూలలా వ్యాప్తి చేయడానికి ఒక భారీ ప్రచారాన్ని ప్రారంభిస్తామని బీజేపీ పేర్కొంది.

ఈ తీర్మానానికి సంబంధించిన వివరాలను నితిన్ నబీన్ ఎక్స్ వేదికగా పంచుకున్నారు. వందేమాతరాన్ని "స్వచ్ఛమైన జాతీయ భావానికి, సామ్రాజ్యవాద వ్యతిరేక నినాదంగా అభివర్ణించిన మహాత్మా గాంధీ ప్రకటనను పెద్దఎత్తున ప్రజల్లోకి తీసుకువెళ్తామని ఆయన పేర్కొన్నారు. ఆరు చరణాలతో కూడిన సంపూర్ణ జాతీయ గేయాన్ని, వందేమాతరంతో ముడిపడిన దేశ స్వాతంత్ర్య పోరాట జ్ఞాపకాలను యువత అర్థం చేసుకునేలా అవగాహన కార్యక్రమాలు చేపడతామని నబీన్ వివరించారు.

"2026 ఆగస్టు 22న వందేమాతరం పట్ల గౌరవం, దాని చారిత్రక వారసత్వ పరిరక్షణకు సంబంధించి ఒక ముఖ్యమైన తీర్మానాన్ని భారతీయ జనతా పార్టీ ఆమోదించింది. కాంగ్రెస్ కార్యక్రమాల్లో వందేమాతరం గానాన్ని మొదటి రెండు చరణాలకే పరిమితం చేస్తూ 1937లో తీసుకున్న నిర్ణయాన్ని పునరుద్ఘాటిస్తూ, కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ఆగస్టు 19, 2026న తీసుకున్న నిర్ణయాన్ని బీజేపీ తీవ్రంగా ఖండిస్తోంది. రాజకీయ ప్రయోజనాలు లేదా బుజ్జగింపుల కోసం వందేమాతరం గౌరవం, వారసత్వం విషయంలో ఎటువంటి రాజీని అంగీకరించబోము. వందేమాతరం సంపూర్ణ గేయ గౌరవం, హుందాతనం, వారసత్వం, జాతీయ స్ఫూర్తిని బీజేపీ కాపాడుతుంది. అలాగే, వందేమాతరాన్ని అత్యంత స్వచ్ఛమైన జాతీయ భావనతో ముడిపడి ఉన్న "సామ్రాజ్యవాద వ్యతిరేక నినాదం"గా అభివర్ణిస్తూ మహాత్మా గాంధీ చేసిన వ్యాఖ్యలను కూడా బీజేపీ ప్రజల్లోకి తీసుకెళ్తుంది. వందేమాతరం చరిత్ర, అర్థం, జాతీయ ప్రాముఖ్యత, వారసత్వాన్ని భారతదేశంలోని ప్రతి మూలకు చేరవేసేందుకు బీజేపీ ఒక ప్రచారాన్ని ప్రారంభిస్తుంది. అంతేకాకుండా, వందేమాతరం ఆలపించడంపై ఆంక్షలు విధించిన చారిత్రక, రాజకీయ పరిస్థితులను అంటే ముస్లిం లీగ్ అభ్యంతరాలు, తదనంతరం పెరిగిన మతపరమైన, వేర్పాటువాద డిమాండ్ల రాజకీయాలను ప్రజలకు వివరించాలని పార్టీ నిర్ణయించింది. 1947లో భారతదేశ స్వాతంత్ర్య విజయ నినాదం 'వందేమాతరం'.



ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో 2047 నాటి 'అభివృద్ధి చెందిన భారతదేశం' (వికసిత్ భారత్) గొప్ప ప్రకటనకు కూడా 'వందేమాతరం' నినాదమే కానుంది."

కాంగ్రెస్ పార్టీ లేదా దాని వర్కింగ్ కమిటీ గానీ తమను తాము పార్లమెంట్ కంటే గొప్పగా భావించకూడదని బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి, ఎంపీ సంబిత్ పాత్ర అన్నారు. "ఈ రోజు నేను దేశాన్ని అడగదలుచుకున్నాను. పార్లమెంట్ గొప్పదా లేక జఔజ గొప్పదా? దేశం పార్లమెంట్‌లో తీసుకున్న నిర్ణయాల ఆధారంగా నడుస్తుందా లేక జఔజ ఆమోదించిన నిర్ణయాలు, తీర్మానాల ఆధారంగా నడుస్తుందా? ఏ కుటుంబం, ఏ రాజకీయ పార్టీ, ఏ వ్యక్తి కూడా దేశ చట్టం, దేశ రాజ్యాంగం, పార్లమెంట్ చేసిన చట్టాల కంటే తాము గొప్పవారమని భావించకూడదు. జఔజ తన కార్యాలయంలో కూర్చుని, తమను తాము పార్లమెంట్ కంటే గొప్పగా భావించకూడదు. పార్లమెంట్ ప్రజాస్వామ్యానికి అత్యున్నత దేవాలయం. పార్లమెంట్‌లో తీసుకున్న నిర్ణయమే దేశ నిర్ణయం. వందేమాతరం దేశ గేయం. అది దేశ మంత్రం. హిందువులు, ముస్లింల మధ్య విభజన సృష్టించడానికి ఇది ఒక సాధనం కాదు. కాంగ్రెస్ విభజన బీజాలు నాటడానికి ప్రయత్నిస్తోంది. దీన్ని మేము జరగనివ్వము." అని సంబిత్ పాత్ర అన్నారు.

## న్యాయమూర్తులు దేవుళ్లు కాదు

'న్యాయమూర్తులు దేవుళ్లు కాదు. ప్రతి తీర్పునూ కచ్చితంగా సరైనదిగా ఇవ్వలేం' అని సుప్రీంకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ సంజయ్ కరోల్ అన్నారు. న్యాయవ్యవస్థలో వినయం, బాధ్యత, మానవీయ కోణం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. శనివారం సుప్రీంకోర్టులో తన చివరి పని రోజున ఆయనకు ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా భావోద్వేగంతో కీలక వ్యాఖ్యలు చేశారు. 'రాజ్యాంగం, న్యాయమూర్తులు కేవలం చట్టాన్ని సరిగ్గా వర్తింపజేయాలని మాత్రమే కోరడం లేదు. చట్టాన్ని న్యాయబద్ధంగా అమలు చేయడం కూడా అంతే ముఖ్యం. కోర్టుకు వచ్చే ప్రతి వ్యక్తిని కేవలం పిటిషనర్‌గా కాకుండా ఒక మనిషిగా చూడాల్సిన అవసరం ఉంది. ఒక పిటిషన్ కేసుకు సంబంధించిన వాస్తవాలను మాత్రమే చెబుతుంది. కానీ కోర్టును ఆశ్రయించిన వ్యక్తి ఇప్పటికే ఏం కోల్పోయాడు? తనకు కోర్టు నుంచి ఏం ఆశిస్తున్నాడు? వంటి విషయాలను అది చెప్పదు. అందుకే న్యాయమూర్తికి వినయం అవసరం' అని జస్టిస్ కరోల్ తెలిపారు.

**'కోర్టులో మాటలే కాదు, మౌనం కూడా ముఖ్యం'**

దాదాపు నాలుగు దశాబ్దాల తన న్యాయ ప్రస్థానాన్ని గుర్తుచేసుకున్నారు జస్టిస్ కరోల్. సుమారు 40 ఏళ్లపాటు కోర్టు గదుల్లో గడిపినట్లు తెలిపారు. తొలుత న్యాయవాదిగా, ఆ తర్వాత 19 ఏళ్లపాటు న్యాయమూర్తిగా సేవలందించానని చెప్పారు. కోర్టులో వినిపించే వాదనలతో పాటు మౌనంలో దాగి ఉన్న మాటలను కూడా న్యాయమూర్తులు అర్థం చేసుకోవాలని అన్నారు. న్యాయ ప్రక్రియలో న్యాయవాదులు చేసే వాదనలే కాకుండా, మాటల మధ్యలో బాధితులు కోరుకునేది ఏమిటో గుర్తించడం కూడా ముఖ్యమని పేర్కొన్నారు. 1996లో తొలిసారి సుప్రీంకోర్టు మొదటి నంబర్ కోర్టులోకి వెళ్లిన గుర్తు చేస్తూ, అప్పట్లో న్యాయమూర్తుల బెంచ్ దాదాపు ఆరు అడుగుల ఎత్తులో ఉన్నట్లు తనకు అనిపించిందన్నారు. కింద నుంచి చూస్తే ఆ ఎత్తు అధికారానికి ప్రతీకగా కనిపించవచ్చని, కానీ న్యాయమూర్తిగా ఆ స్థానంలో కూర్చున్నప్పుడు అది గౌరవం, నిజాయితీతో కూడిన బాధ్యతకు ప్రతీక అని అర్థమైందన్నారు.

**సాధారణ పౌరుడి విశ్వాసమే సుప్రీంకోర్టు బలం**

సుప్రీంకోర్టు గొప్పతనం కేవలం కీలకమైన కేసుల్లో వెలువడే తీర్పుల్లో లేదని జస్టిస్ కరోల్ అన్నారు. న్యాయం జరుగుతుందనే నమ్మకంతో కోర్టు గడప తొక్కే సాధారణ పౌరుడి విశ్వాసమే దాని అసలైన బలమని పేర్కొన్నారు. అయితే న్యాయం చాలా దూరంగా ఉందని, ఖరీదైనదని లేదా భయపెట్టేదిగా భావించి కోర్టుల గడప తొక్కలేని వారిని కూడా గుర్తుంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. చట్టం, న్యాయ ప్రక్రియ, రాజ్యాంగబద్ధత వంటి భావనలను అర్థం చేసుకోవడానికి ధర్మం అనే భావనను ఉదాహరణగా తీసుకోవచ్చని జస్టిస్ కరోల్ అన్నారు. ఇక్కడ ధర్మం అంటే ఆచారం కాదని, విధి, బాధ్యత అని వివరించారు. కోర్టు ముందు నిలబడే వ్యక్తి ఎంత చిన్నవాడైనా, ఎంత దుర్భర పరిస్థితుల్లో ఉన్నా అతడి మాటను న్యాయమూర్తి వినాలని చెప్పారు. న్యాయం పట్ల నిబద్ధతతో వ్యవహరించడమే న్యాయమూర్తి ప్రధాన కర్తవ్యమని పేర్కొన్నారు.

**'ప్రతి ఒక్కరూ తమ నిర్ణయాలకు న్యాయమూర్తులే'**

న్యాయవ్యవస్థలోని బాధ్యతలు కేవలం కోర్టు గదులకే పరిమితం కావని జస్టిస్ కరోల్ అన్నారు. ప్రతి వ్యక్తి తన నిర్ణయాలు, ప్రవర్తన, అధికార వినియోగంపై తానే న్యాయమూర్తిగా వ్యవహరించాల్సి ఉంటుందని సూచించారు. 'న్యాయమూర్తి వస్త్రాలు ధరించే ముందు కూడా న్యాయమూర్తే. వాటిని తొలగించిన తర్వాత కూడా న్యాయమూర్తే' అని ఆయన వ్యాఖ్యానించారు. భారత్?కు కేవలం ఒక రాజ్యాంగం ఉండటమే కాదు, దానిని మన జీవితాల్లో ఆచరించాల్సిన అవసరం ఉందని జస్టిస్ కరోల్ అన్నారు. రాజ్యాంగం గొప్పతనం పెద్ద పెద్ద కేసుల్లోనే పరీక్షకు గురికాదని, సాధారణ పౌర జీవితంలోని ప్రతి చర్యలోనూ అది ప్రతిబింబించాలని పేర్కొన్నారు.

## 'ఇది ఎలాంటి 'ఆత్మనిర్భర్ భారత్'




దేశీయ మార్కెట్లో చక్కెర ధరల పెరుగుదల, కొరత నేపథ్యంలో కేంద్రం తీరుపై కాంగ్రెస్ తీవ్ర విమర్శలు గుప్పించింది. మోదీ ప్రభుత్వం విధానాల వల్ల పండుగల సీజన్‌కు ముందే సామాన్య ప్రజలపై ఆర్థిక భారం పడుతుందని ఆరోపించింది. 'మోదీ ప్రభుత్వ విధానాల్లోని చేదు, చక్కెరలోని మాధుర్యానికి పాకింది' అని కాంగ్రెస్? జాతీయ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే ఎద్దేవా చేశారు. కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శిస్తూ, ఆయన శనివారం చేసిన ఎక్స్‌లో ఒక పోస్టు పలు ప్రశ్నలు సంధించారు. "మోదీ ప్రభుత్వానికి నేను సూటిగా మూడు ప్రశ్నలు అడుగుతున్నా. ప్రపంచంలోనే అతిపెద్ద చక్కెర ఉత్పత్తిదారు, ఎగుమతిదారు అయిన భారతదేశంలో, చక్కెర నిల్వలు గత 9 ఏళ్లలో ఎన్నడూ లేనంత కనిష్ట స్థాయికి ఎందుకు పడిపోయాయి? ఎగుమతులను నిలిపివేసి, 10 లక్షల టన్నుల చక్కెరను సుంకం లేకుండా దిగుమతి చేసుకునే స్థాయికి మనం ఎలా చేరుకున్నాం?. ఇక రెండోది, మూడు నెలల్లో చక్కెర ధర దాదాపు 40 శాతం పెరిగింది. పండుగలకు ముందు ప్రజలపై ఇంత భారం మోపుతున్న ఈ ధరల పెరుగుదలకు ఎవరు బాధ్యులు? మూడోది, దేశంలో చక్కెర కొరత ఉన్నప్పుడు, ప్రభుత్వం విదేశాల నుంచి చక్కెరను దిగుమతి చేసుకుంటున్నప్పుడు, జు20 కోసం ఇథనాల్ ఉత్పత్తి చేయడానికి చెరకు, ధాన్యాన్ని మళ్లించే విధానాన్ని ఎందుకు సమీక్షించడం లేదు? ఇది ఎలాంటి 'ఆత్మనిర్భర్ భారత్'?"

**'ధరలు పెరగడానికి ఇథనాల్ కారణం కాదు'**

కాగా, దేశంలో చక్కెర ధరలు పెరగడానికి ఇథనాల్ కారణమని వస్తున్న ఆరోపణలను వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం, ప్రజా పంపిణీ మంత్రిత్వ శాఖ ఖండించింది. జులై 20న కిలోకు రూ. 48గా ఉన్న చక్కెర ధరలు ఆగస్టు 20 నాటికి కిలోకు రూ. 55కి పెరగడానికి అనేక కారణాలు ఉన్నాయని, ఇథనాల్ మళ్లింపు కాదని స్పష్టం చేసింది. ఇథనాల్ కోసం మళ్లించిన చక్కెర వాటా 2022-23లో సుమారు 12 శాతం నుంచి 2025-26 నాటికి సుమారు 9 శాతానికి తగ్గిందని తెలిపింది. అదే సమయంలో దేశంలోని మొత్తం ఇథనాల్ ఉత్పత్తిలో దాదాపు ముప్పావు వంతు ధాన్యాల నుంచి, ముఖ్యంగా మొక్కజొన్న నుంచి వస్తోందని వివరించింది. ఊహించిన దానికంటే తక్కువ దేశీయ ఉత్పత్తి, పండుగ సీజన్‌కు ముందు పెరిగిన డిమాండ్, వాతావరణ సంబంధిత కారణాల వల్ల ధరలు పెరిగాయని ప్రభుత్వం పేర్కొంది. అదే సమయంలో దేశీయ వినియోగానికి సరిపడా చక్కెర నిల్వలు అందుబాటులో ఉన్నా, కృత్రిమ కొరత సృష్టిస్తూ మిల్లర్లు, వ్యాపారులు ధరలను అడ్డగోలుగా పెంచారని కేంద్రం ఆగ్రహం వ్యక్తం చేసింది. నిల్వదారులు, బ్లాక్ మార్కెటర్లు, స్పెక్యులేటర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్రాలకు ఆదేశాలు జారీ చేసింది. మార్కెట్‌లో చక్కెర కొరతను నివారించేందుకు కేంద్రం ఇటీవల కీలక నిర్ణయం తీసుకుంది. చక్కెర సరఫరా పెంచడం, కృత్రిమ కొరతను నివారించడం, ధరల పెరుగుదలకు అడ్డుకట్ట వేసేందుకు వీలుగా నిల్వలపై ఆంక్షలు విధిస్తూ నిర్ణయం తీసుకుంది. నెలకు 10 మెట్రిక్ టన్నుల కంటే ఎక్కువ విక్రయించే, వినియోగించే పెద్ద వ్యాపారులు, పరిశ్రమలు తమ వద్ద 15 రోజులకు సరిపడా నిల్వలనే ఉంచుకోవాలని ఆదేశించింది. మిఠాయిలు, ఇతర పదార్థాలు, శీతల పానీయాల తయారీదారులు, ఆహారశుద్ధి యూనిట్లు, అమ్మకం దారులు, ఇతర సంస్థాగత కొనుగోలుదారులపై ఈ ఆంక్షలు విధించింది. నవంబరు 30 వరకు ఈ ఆంక్షలు అమల్లో ఉంటాయని కేంద్రం తెలిపింది. చక్కెర కొరత రాకుండా ముడి పంచదారను 10 లక్షల టన్నుల మేర అక్టోబరు 31 లోపు దిగుమతి చేసుకునేందుకు అవకాశం ఇచ్చింది. గతేడాది ఇదే సమయంలో టన్ను 3 వేల 900 రూపాయులగా ఉన్న పంచదార ధర ఇప్పుడు 5,400 - 5,500 స్థాయికి చేరిన నేపథ్యంలో కేంద్రం ఈ చర్యలు తీసుకుంది. దాదాపు పదేళ్ల తర్వాత విదేశాల నుంచి చక్కెర దిగుమతులకు కేంద్రం అవకాశం కల్పించడం గమనార్హం.

# గచ్చిబౌలిలో ఘోర ప్రమాదం



హైదరాబాద్ నగరంలోని గచ్చిబౌలి అంజయ్యనగర్‌లో నిర్మాణంలో ఉన్న ఏడంతస్తుల భవనం ఒక్కసారిగా కుప్పకూలింది. ఆ భవనంలో ప్లంబింగ్ పనులు చేస్తున్న ఇద్దరు శిథిలాల కింద చిక్కుకుని ప్రాణాలు కోల్పోయారు. ప్రమాద సమాచారం అందుకున్న ఫైర్, డీఆర్ఎఫ్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు.
శిథిలాల కింద నుంచి రెండు మృతదేహాలను వెలికి తీశారు. నాలా పక్కనే 50 గజాల స్థలంలో నిర్మాణం చేపట్టిన ఈ బిల్డింగ్ ఒక్కసారిగా కుప్పకూలడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. ఈ ప్రమాదంలో మృతులను ఉమేశ్? కారె, మోపత్?గా పోలీసులు గుర్తించారు. మధ్యప్రదేశ్?కు చెందిన వీరు టైల్స్? పనులు చేస్తూ కొండాపూర్?లో నివాసం ఉంటున్నట్లుగా గుర్తించారు. శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీతోపాటు సీఎంసీ, హైడ్రా కమిషనర్లు సృజన, రంగనాథ్ ఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలు ఆరా తీశారు. కూలిపోయిన భవన యజమానిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

**కొద్ది రోజుల్లో ఈ భవనాలన్నీ కూల్చేస్తాం**

ఘటనాస్థలాన్ని హైడ్రా కమిషనర్ రంగనాథ్ పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. 50 గజాల్లో ఏడంతస్తులు కట్టారని, దానిపైన పెంట్?హౌస్? కూడా వేస్తున్నారన్నారు. భవనం కూలి ఇద్దరు చనిపోయారని వివరించారు. అంజయ్యనగర్‌లో ఇలాంటి భవనాలు చాలా ఉన్నాయన్నారు. ఇక్కడి భవనాల్లో చాలావాటికి సెట్‌బ్యాక్‌లు లేవని రంగనాథ్ తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న భవనాలను కూల్చేస్తామని ఆయన స్పష్టం చేశారు. ఇక్కడి భవనాలు హాస్టల్స్ కోసం వాడుతున్నారన్నారు. బిల్డర్ సాజిద్ కట్టే భవనాలన్నీ ఇలాగే ఉన్నాయని స్థానికులు చెప్తున్నారన్నారు. కొద్ది రోజుల్లో ఈ భవనాలన్నీ కూల్చేస్తామని తెలిపారు. ఈ భవనాలన్నీ ఖాళీ చేయాలని యజమానులకు సూచిస్తున్నామని చెప్పారు. నాలాను ఆక్రమించి భవనాలను ఇష్టానుసారంగా కట్టారని రంగనాథ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అంజయ్యనగర్‌లో ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తామన్నారు.

**అక్రమ నిర్మాణాలన్నీ కూల్చేస్తామన్న హైడ్రా కమిషనర్? (జూం దీష్ణుతీఫ్)**

ఘటనా స్థలాన్ని పరిశీలించిన సీఎంసీ కమిషనర్ సృజన : భవనం కూలి ఆ శిథిలాలు పక్కనే ఉన్న మరో అపార్ట్?మెంట్?పై పడటంతో ఇద్దరు వృద్ధులు గాయపడ్డారు. అపార్ట్?మెంట్ గోడలు సైతం ధ్వంసమయ్యాయి. పక్కనే ఉన్న ఓ హాస్టల్? విద్యార్థులు భయంతో కేకలు వేస్తూ బయటకు పరుగులు తీశారు. మరోవైపు ఘటనా స్థలాన్ని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, సీఎంసీ కమిషనర్ సృజన పరిశీలించారు. ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. సహాయక చర్యలు వేగవంతం చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఇంకా శిథిలాల కింద ఎవరైనా చిక్కుకొని ఉన్నారేమోనన్న అనుమానంతో ముమ్మరంగా సహాయక చర్యలు కొనసాగిస్తున్నారు. ఒకవేళ సాయంత్రం సమయంలో ఈ ప్రమాదం జరిగి ఉంటే ప్రాణనష్టం అధికంగా ఉండేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఎన్డీఆర్?ఎఫ్, ఫైర్?, పోలీసులు భవన శిథిలాలను తొలగిస్తున్నారు.
ప్రమాద ఘటనపై గవర్నర్ శివప్రతాప్ శుక్లా దిగ్భ్రాంతి : గచ్చిబౌలిలో భవనం కూలి ఇద్దరు మృతిచెందిన ఘటనపై గవర్నర్ శివప్రతాప్ శుక్లా దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యచికిత్స అందించాలని సూచించారు. ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

**సీజ్ చేశాం, చర్యలు తీసుకొనే లోపే**

4 నెలల ముందే భవన యజమానికి నోటీసులిచ్చామని సీఎంసీ కమిషనర్ సృజన వెల్లడించారు. భవనాన్ని సీజ్ కూడా చేశామన్నారు. భవన యజమాని ఈ మధ్యే పనులు మొదలుపెట్టినట్లు గుర్తించామని, చర్యలు తీసుకునే క్రమంలో భవనం కూలిపోయిందని కమిషనర్ సృజన వెల్లడించారు.
"మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో పెద్ద శబ్దం వినిపించింది. ఏమైందని భయటకు వచ్చి చూస్తే భవనం కూలినట్లుగా తెలిసింది. బిల్డింగ్?లోని నాలుగో ఫ్లోర్?లో ఉన్న ఓ వ్యక్తిపై భవన శిథిలాలు పడి గాయాలయ్యాయి. దీంతో ఆయనను ఆస్పత్రిలో చేర్పించాం. ఈ ప్రమాదం సాయంత్రం సమయంలో జరిగి ఉంటే పెద్ద ఎత్తున నష్టం జరిగి ఉండేది. కూలిన బిల్డింగ్ శ్లాబ్? ప్రమాదకర పరిస్థితిలో వేలాడుతోంది. ఆ శిథిలాలను వేగంగా తొలగించేలా అధికారులు చర్యలు చేపట్టాలి" – స్థానికుడు

**బిల్డర్ కోసం గాలింపు!**

అనుమతి లేకుండా బిల్డింగ్? నిర్మించారని, నాణ్యతకు తిలోదకాలు ఇచ్చారని స్థానికులు ఆరోపిస్తున్నారు. సరైన ప్రమాణాలు లేకుండా తక్కువ వ్యవధిలోనే నిర్మించడం వల్లనే పేకమేడలా కూలిపోయిందని స్థానికులు పేర్కొంటున్నారు. మరోవైపు, ఈ భవనం నిర్మాణం చేస్తున్న బిల్డర్ సాజిద్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రస్తుతం అతడు పరారీలో ఉన్నాడని తెలిసింది. పోలీసులు అతడికోసం గాలిస్తున్నట్లు సమాచారం.

# కాంగ్రెస్‌లో పాత రోజులు

-మొదటిపేజీ తరువాయి

మాకు టికెట్ నిరాకరించడానికి అసలు రేవంత్ రెడ్డి ఎవరు? టికెట్ల కేటాయింపు అధిష్టానం పరిధిలోని అంశం అని వ్యాఖ్యానించారు. రాబోయే ఎన్నికల్లో పరకాల నుంచి తాను స్వతంత్రంగానైనా పోటీ చేసి గెలిచి తీరుతానని సవాల్ విసిరారు. ఆనాడు రేవంత్ రెడ్డి పిసిసి అధ్యక్షుడు కావాలని మొదట కోరింది కొండా దంపతులేనని గుర్తుచేస్తూ, కొడంగుల్‌లో ఓడిపోయిన విషయాన్ని సీఎం మరిచి పోవద్దంటూ అత్యంత ఘాటైన స్వరంతో విమర్శలు గుప్పించారు. ఈ పరిణామాలు కాంగ్రెస్ పార్టీలో అసమ్మతి ఏ స్థాయికి చేరిందో స్పష్టంచేస్తున్నాయి. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, అనిరుధ్ రెడ్డి, చిన్నారెడ్డి, మల్ రెడ్డి రంగారెడ్డి వంటి కీలక నేతలు ఇదివరకే వేర్వేరు సందర్భాల్లో తమ అసంతృప్తిని వెళ్లగక్కగా, ఇప్పుడు కొండా సురేఖ కుటుంబం నేరుగా సీఎంపైనే విమర్శల బాణాలు విసరడం శాసనసభా పక్షంలో సంచలనంగా మారింది. పార్టీలోని పాత కాంగ్రెస్ నేతలు, బీసీ నాయకులను పక్కనబెట్టి, వలస నేతలకే ప్రాధాన్యత ఇస్తున్నారనే భావన ఈ వరుస తిరుగుబాట్లకు ప్రధాన కారణంగా కనిపిస్తోంది. మరోవైపు పీసీసీ క్రమశిక్షణా కమిటీ , పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ నిస్సహాయంగా మారిపోయారు. బహిరంగంగా పార్టీ సిద్ధాంతాలను, ముఖ్యమంత్రి నిర్ణయాలను ప్రశ్నిస్తున్న నేతలపై ఎలాంటి కఠిన చర్యలు తీసుకోలేకపోవడం పార్టీలో క్రమశిక్షణా రాహిత్యాన్ని ప్రతిబింబిస్తోంది. రాబోయే రోజుల్లో క్రమశిక్షణ తప్పితే చర్యలు ఉంటాయని ఎంపీ మల్లు రవి వంటి నేతలు ప్రకటనలు ఇస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో అసమ్మతి నేతలను అదుపు చేయడంలో గాంధీ భవన్ నాయకత్వం పూర్తిగా వెనుకబడి ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనాపరమైన పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై దృష్టి పెడుతున్నప్పటికీ, సొంత కేబినెట్ సహచరుల కుటుంబాల నుంచే వస్తున్న ఈ రకమైన తీవ్రమైన విమర్శలు ప్రభుత్వ ఇమేజ్‌ను దెబ్బతీస్తున్నాయి. అంతర్గత ప్రజాస్వామ్యం పేరిట సాగుతున్న ఈ ఘర్షణ వాతావరణం, ప్రతిపక్షాలైన బిఆర్ఎస్, బిజెపిలకు రాజకీయ ఆయుధంగా మారుతోంది. అధిష్టానం తక్షణమే జోక్యం చేసుకుని పార్టీలోని అంతర్గత పోరుకు చెక్ పెట్టకపోతే, ఇది కాంగ్రెస్ ప్రభుత్వ స్థిరత్వానికి మరియు క్రెడిబిలిటీకి పెద్ద సవాలుగా మారే ప్రమాదం ఉంది.

**రేవంత్ ఫెయిలవ్వుతున్నారా**

తెలంగాణలో కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకురావడంలో కీలక పాత్ర పోషించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఇప్పుడు పరిపాలన కంటే పార్టీలోని అంతర్గత కుమ్ములాటలే పెను సవాలుగా మారుతున్నాయి. అధికారం చేపట్టిన తొలినాళ్లలో దూకుడు ప్రదర్శించిన నాయకత్వం.. సొంత పార్టీలోని సీనియర్లు, వలస నేతల అసంతృప్తిని దారికి తేవడంలో మాత్రం తడబడుతోందనే వాదన రాజకీయ వర్గాల్లో బలంగా వినిపిస్తోంది. అధిష్టానాన్ని నేరుగా టార్గెట్ చేయకుండా, కేవలం సీఎం రేవంత్‌ను మాత్రమే కేంద్రబిందువుగా చేసుకుని నేతలు సాగిస్తున్న స్వరం రోజురోజుకూ శృతిమించుతోంది. ఎన్నికల సమయంలో తన అనుకూల వర్గానికి టికెట్లు ఇప్పించుకుని, వారిని గెలిపించుకున్నారనే ఆరోపణలు మొదటి నుంచీ రేవంత్‌పై ఉన్నాయి. ఆ సమయంలో అధికారమే లక్ష్యంగా అంతా సర్దుకుపోయినా, ప్రభుత్వం ఏర్పడ్డాక సీనియర్లను విస్మరిస్తున్నారనే భావన పాత కాంగ్రెస్ నేతల్లో అసహనాన్ని పెంచింది. కేబినెట్ విస్తరణలో చోటు దక్కకపోవడం, నామినేటెడ్ పదవుల జాప్యం, పార్టీలో ప్రాధాన్యం తగ్గడం వంటి అంశాలు అంతర్గత అసంతృప్తిని రాజేస్తున్నాయి. కేబినెట్ పదవి ఆశించి భంగపడ్డ కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మొదటి ఏడాది నుంచే సీఎంను లక్ష్యంగా చేసుకుని గళమెత్తుతున్నారు. సీఎం మార్పు ప్రస్తావన తెస్తూ, ప్రత్యామ్నాయ పార్టీల వైపు చూస్తున్నామనే సంకేతాలు ఇవ్వడం ప్రభుత్వ స్థిరత్వంపై చర్చకు దారితీస్తోంది. బీఆర్ఎస్ నుంచి వచ్చిన పోచారం శ్రీనివాస్ రెడ్డి వంటి సీనియర్లు నిధుల కొరత, నిర్లక్ష్యంపై బహిరంగంగానే పెదవి విరుస్తున్నారు. దానం నాగేందర్ లాంటి నేతలు గత పాలనను ప్రస్తావిస్తూ ఒత్తిడి తెచ్చే ప్రయత్నాలు చేస్తున్నారు. సీనియర్ నేత చిన్నారెడ్డి టికెట్ల కేటాయింపు వ్యవహారాలపై విమర్శలు గుప్పించగా, పార్టీ వీడిన జీవన్ రెడ్డి తరచూ సీఎం శైలిపై విమర్శనాస్త్రాలు సంధిస్తూనే ఉన్నారు. విజయశాంతి ప్రభుత్వ విధానాలపై పెదవి విప్పగా, తాజాగా మంత్రి కొండా సురేఖ కుమార్తె కొండా సుష్మిత ఏకంగా పరకాల టికెట్ కేటాయింపు, కుటుంబానికి ఎమ్మెల్సీ నిరాకరణ వంటి అంశాలపై సీఎం కుటుంబ సభ్యులను సైతం టార్గెట్ చేస్తూ స్వతంత్ర పోరుకు సిద్ధమవడం ప్రకంపనలు సృష్టిస్తోంది. అసమ్మతి స్వరాలు పెల్లుబుకుతున్నప్పుడు వాటిని బుజ్జగించడం లేదా సమన్వయ కమిటీల ద్వారా పరిష్కరించడంలో అధిష్టానం, సీఎం స్థాయి సంప్రదింపులు కొరవడుతున్నాయనే విమర్శలు ఉన్నాయి. ఒకవైపు ప్రతిపక్షమైన బీఆర్ఎస్, బీజేపీలను రాజకీయంగా ఎదుర్కొంటున్న రేవంత్‌కు.. సొంత పార్టీ నేతల అసంతృప్తి వ్యాఖ్యలే ప్రతిపక్షాలకు ప్రధాన ఆయుధాలుగా మారుతున్నాయి. కేటీఆర్, హరీశ్ రావు వంటి విపక్ష నాయకులు కాంగ్రెస్ అసమ్మతి నేతల వ్యాఖ్యలనే కోట్ చేస్తూ ప్రభుత్వాన్ని ఇరుకున పెడుతున్నారు. ముఖ్యమంత్రిగా పరిపాలనపై పట్టు సాధిస్తున్నప్పటికీ, సొంత గూటిలోని అసమ్మతిని ఒకే తాటిపైకి తీసుకురావడంలో రేవంత్ రెడ్డి రాజకీయ వ్యూహం ఆశించిన స్థాయిలో ప్రభావం చూపడం లేదన్నది స్పష్టమవుతోంది. తక్షణమే సమన్వయ యంత్రాంగాన్ని బలోపేతం చేసి, అంతర్గత కుమ్ములాటలకు తెరదించకపోతే.. ఈ అంతర్గత అసంతృప్తే ప్రభుత్వ ఉనికికి రాజకీయంగా గొడ్డలిపెట్టుగా మారే ప్రమాదం ఉంది.

# రాయదుర్గంలోని భూములు రికార్డు ధర

**హైదరాబాద్ :** రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం రాయదుర్గంలోని భూములు రికార్డు ధర పలికాయి. తాజాగా నిర్వహించిన ఆన్‌లైన్ వేలంలో ఎకరా భూమి రూ.264 కోట్ల భారీ ధర పలికింది. ఓూఔ రియాలిటీ సంస్థ అంత ధర పలికి భూములు దక్కించుకుంది. అధిక ధర పలికి మొత్తం 5.25 ఎకరాలను అదే సంస్థ వేలంలో సొంతం చేసుకుంది. దాదాపు 3 నెలల కిందట జరిగిన వేలంలో ఇదే సర్వే నెంబర్‌లో ఎకరా భూమి ఏకంగా రూ.237 కోట్లు పలికిన విషయం తెలిసిందే. తాజాగా ఈ రికార్డు బద్ధలుకొట్టి హైదరాబాద్ రియల్ ఎస్టేట్ కొత్త పుంతలు తొక్కుతోంది. భూముల వేలానికి సుప్రీంకోర్టు లైన్ క్లియర్ చేయడంతో సర్వే నంబర్ 83/1లోని 5.25 ఎకరాలను ఆన్‌లైన్లో వేలం వేశారు. రంగారెడ్డి జిల్లాలోని రాయదుర్గం పాన్‌మక్తాలో 11 ఎకరాల టీజీఐఐసీ భూముల వేలం ప్రక్రియను నిలిపివేసుందుకు దేశ సర్వోన్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు శుక్రవారం నాడు నిరాకరించింది. సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ ధర్మాసనం ఇందులో జోక్యం చేసుకోబోమని స్పష్టం చేసింది. గతంలో స్టే ఇచ్చిన కంచ గచ్చిబౌలి భూములకు, వేలం వేసే ప్రాంతానికి 5 కి.మిా దూరం ఉందని, రెండింటికీ సంబంధం లేదని తెలంగాణ ప్రభుత్వం తరఫున అభిషేక్ మను సింఘ్వీ స్పష్టం చేయడంతో జువ్వాడి ప్రణయ్ సింహారావు దాఖలు చేసిన పిటిషన్‌ను సీజేఐ ధర్మాసనం తిరస్కరించింది. ఇంకా ఈ విషయంపై ఏమైనా వివాదాలుంటే తెలంగాణ హైకోర్టులోనే తేల్చుకోవా లని పిటిషనర్లకు సుప్రీంకోర్టు సూచించింది. ఇప్పటికే ఈ వేలంపై మధ్యంతర స్టే ఇచ్చేందుకు తెలంగాణ హైకోర్టు సింగిల్ జడ్జీలు కూడా ఇదివరకే నిరాకరించారు. ల్యాండ్ రిఫార్మ్స్ ట్రిబ్యునల్



(ఎల్ఆర్‌టీ)ను ఆశ్రయించినట్లు లేదా విచారణ పెండింగ్‌లో ఉన్నట్లు ఆధారాలు లేవని జస్టిస్ ఎన్వీ శ్రవణ్‌కుమార్ పేర్కొనగా, ఎస్. రవీంద్రనాథ్ దాఖలు చేసిన మరొక పిటిషన్‌పై జస్టిస్ నగేష్ భీమపాక ప్రభుత్వం, హెచ్ఎండీఏలను కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశించింది. ఈ కేసు తదుపరి విచారణను సెప్టెంబరు 19కి వాయిదా వేయడం తెలిసిందే. దీంతో ఎకరాకు రూ.175 కోట్ల కనీస ధరతో టీజీఐఐసీ చేపట్టిన ఆన్‌లైన్ వేలానికి మార్గం సుగమమైంది. అయితే టీజీఐఐసీ ఆన్‌లైన్లో భూమల వేలం నిర్వహించగా రికార్డు స్థాయిలో ఎకరా 264 కోట్లు పలికింది. దాదాపు మూడు నెలల కిందట నిర్వహించిన వేలంలో ఇక్కడి భూమి ఎకరా రూ. 237 కోట్లు పలికిన విషయం తెలిసిందే.

## కేంబ్రిడ్జ్‌తో తెలంగాణ కొత్త బంధం

-మొదటిపేజీ తరువాయి

చెప్పడాన్ని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్రంగా తప్పుపట్టారు.

**ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు లివర్ ఫుల్ ఆసక్తి**

లైఫ్ సైన్సెస్, టెక్నాలజీ, క్రీడలు, సృజనాత్మక ఆర్థిక వ్యవస్థకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు లండన్‌లోని లివర్‌పూల్ సిటీ డెవలప్‌మెంట్ విభాగం ఆసక్తి చూపింది. భాగస్వామ్య ఒప్పందం చేసుకునేందుకు లివర్‌పూల్ ప్రతినిధి బృందం అక్టోబర్‌లో హైదరాబాద్ రానుంది. లండన్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఇవాళ లివర్‌పూల్ సిటీ డెవలప్‌మెంట్ విభాగానికి చెందిన సుసాన్ ఫిన్నెగాన్, నూలా గల్లాఘర్, లివర్‌పూల్ ఫుట్‌బాల్ క్లబ్‌కు చెందిన పలువురు మర్యాదపూర్వకంగా కలిశారు.

**తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు రండి**

లండన్‌లోని ప్రఖ్యాత ఇంపీరియల్ కాలేజీని సీఎం సలహాదారు రామకృష్ణారావు సందర్శించారు. ఇంపీరియల్ కాలేజీ చీఫ్ ఆఫ్ స్టాఫ్, అమాండా వోల్తుయిజెన్, దక్షిణాసియా సీనియర్ ఇంటర్నేషనల్ రిలేషన్స్ మేనేజర్ రొసాన్నా గిల్లెస్పీతో రామకృష్ణారావు సమావేశమయ్యారు. హైదరాబాద్‌లో షార్ట్ టర్మ్ కోర్సులు, ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ కార్యక్రమాలు నిర్వహించే అవకాశాలను పరిశీలిస్తామని అమాండా తెలిపారు. పరిశోధన రంగంలో భాగస్వామ్యం విద్యార్థులు, అధ్యాపకుల మార్పిడి కార్యక్రమాలపై కూడా తెలంగాణతో కలిసి పనిచేసేందుకు ఆసక్తి చూపారు. డిసెంబరులో జరగనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్?కు రావాలని ఇంపీరియల్ కాలేజీ ప్రతినిధులను రామకృష్ణారావు ఆహ్వానించారు.

**కేంద్రం ఉద్దేశపూర్వకంగానే అడ్డుకుంటోంది**

సీఎం రేవంత్ రెడ్డి లండన్ పర్యటన రేపటితో పూర్తవ్వనుంది. ఆయన అమెరికా పర్యటనకు కేంద్రం నో చెప్పడంతో లండన్ పర్యటన ముగించుకుని హైదరాబాద్‌కు చేరుకోనున్నారు. సీఎం రేవంత్ రెడ్డి అమెరికా పర్యటనకు కేంద్రం అనుమతి నిరాకరించడాన్ని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్రంగా తప్పుపట్టారు. పెట్టుబడుల కోసం వెళ్లే పర్యాటనలను అడ్డుకోవడం ముమ్మాటికీ అన్యాయమేనని ఆయన అభిప్రాయపడ్డారు. బీజేపీ పెద్దలు తమకు కావాల్సిన వారికి అనుమతి ఇస్తారని, తెలంగాణ సీఎంకు మాత్రం విదేశీ పర్యటనకు అనుమతి ఇవ్వలేదని ఆరోపించారు. అమెరికాలో తెలుగు రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు పెద్ద సంఖ్యలో ఉన్నారని, పెట్టుబడులు వస్తే తెలంగాణతో పాటు దేశానికి కూడా లాభమేనన్నారు. కేంద్రం ఉద్దేశపూర్వకంగానే ఇలాంటి పర్యటనలను అడ్డుకుంటోందని ఖర్గే ఆరోపించారు. ముఖ్యమంత్రులు వెళ్లి పెట్టుబడులు తెస్తారనే భయం వారిలో ఉందన్నారు. అన్నీ తమ ద్వారా జరగాలనేది కేంద్రం సంకుచిత ఆలోచన అని ఖర్గే విమర్శించారు.

## మెట్రో రెండో దశలో సరికొత్త హంగులు

-మొదటిపేజీ తరువాయి

టూ శంషాబాద్ మార్గంలో విమానాశ్రయం సమీపంలో 1.6 కి.మీ భూగర్భ మెట్రో విభాగాన్ని ప్రతిపాదించారు. మదీనాగూడ, చందానగర్ మధ్య 1.2 కి.మీ పొడవైన డబుల్ డెక్?లో ఫ్లైఓవర్, రెండో ఎలివేటెడ్ మెట్రో వెళ్లేలా డిజైన్ చేశారు. శంషాబాద్ విమానాశ్రయానికి సంబంధించి కార్గో విమానాశ్రయ స్టేషన్లతో పాటు విమానాశ్రయ ప్రాంగణంలోనే మెట్రో డిపో ఏర్పాటు ప్రతిపాదనలు ఉన్నాయి. దీనికి ఆమోదం తెలపాలని మెట్రో అధికారులు పౌర విమానయాన శాఖను కోరారు. బేగంపేట విమానాశ్రయ రన్‌వే చుట్టూ ఉన్న 'ఫన్నెల్ జోన్?'లో ఎత్తుకు సంబంధించిన పరిమితులు ఉన్నాయి. అందువల్ల శామీర్?పేట, మేడ్చల్ మెట్రో కారిడార్లను తక్కువ ఎత్తులో నిర్మించేలా ప్రణాళిక చేశారు. ఈ మార్గాలకు అనుమతి కావాలని కోరారు.

**రైల్వే క్రాసింగ్‌లు**

మెట్రో మార్గం ఫలక్‌నుమా, ఆరాంఘర్, శంషాబాద్, గుండ్లపోచంపల్లి, లోతుకుంట, అల్వాల్ వద్ద రైల్వే ట్రాక్‌లను దాటాల్సి ఉంటుంది. దీనికి సంబంధించి దక్షిణ మధ్య రైల్వే నుంచి ఇప్పటికే సూత్రప్రాయ ఆమోదం లభించింది. అయితే సుచిత్ర ప్రాంతానికి సంబంధించిన అనుమతి ఇంకా పెండింగ్‌లో ఉంది.

**జాతీయ రహదారి మార్గాలు**

చీ౦-65 (మదీనాగూడ నుంచి పటాన్‌చెరు వరకు, చింతలకుంట నుంచి హయత్ నగర్ వరకు) చీ౦-44 (ఆరాంఘర్ నుంచి శంషాబాద్ వరకు, బోయిన్‌పల్లి నుంచి మేడ్చల్ వరకు) వెంబడి మెట్రో పిల్లర్ల నిర్మాణానికి సంబంధిత అధికారులు 'రైట్ ఆఫ్ వే' అనుమతులను మంజూరు చేయాల్సి ఉంది.

కేంద్రం వాటా : రూ.6,666 కోట్లు (17%)
రాష్ట్రం వాటా : రూ.11,933 కోట్లు (31%)
రుణాలు : రూ.19,996 కోట్లు (52%)

**వివిధ కార్పొరేషన్ల పరిధిలో విస్తరణ :** ప్రతిపాదిత రెండో దశ మార్గం జీహెచ్?ఎంసీ పరిధిలో 36.5 కి.మీ, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 24.9 కి.మీ, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 41.3 కి.మీ మేర విస్తరించి ఉంది. ఇంకా 'రైట్ ఆఫ్ వే' అనుమతులను వేగవంతం చేయాలని మెట్రో రైలు అధికారులు హెచ్?ఎండీఏ కంటోన్మెంట్ బోర్డును కోరారు.

ప్రతిపాదన వివరాలు : కారిడార్లు: 7 దూరం: 122.9 కి.మీ స్టేషన్లు: 86 ప్రాజెక్ట్ వ్యయం: రూ.38,595 కోట్లు ప్రయాణికులు: 12.42 లక్షలు

## కొండాకు పదవీ గండం...



**వరంగల్ :** కొండా సురేఖ మంత్రి పదవి తొలగింపుపై రాజకీయ వర్గాలలో చర్చ జరుగుతోంది. కొండా సురేఖ కుటుంబానికి వ్యతిరేకంగా అందరూ ఒక్కటయ్యారు. కొండా సురేఖను మంత్రి పదవి నుంచి బర్త్ రఫ్ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. కొండా సురేఖ కుటుంబ వ్యవహార శైలిపై పార్టీ హైకమాండ్ కూడా సీరియస్ గా ఉన్నట్లు తెలిసింది. అయితే కొండా సురేఖ మీద చర్యలు తీసుకుంటే కట్టుబాటు తప్పిన మిగిలిన ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, అనిరుధ్ రెడ్డిపై కూడా చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. లేకుంటే బీసీ కార్డుతో కొండా సురేఖ పార్టీని ఇరకాటంలోకి పెట్టే అవకాశముంది. అందుకే కొండా సురేఖ వ్యవహారాన్ని పరిశీలిస్తున్న నాయకత్వం ఏదో ఒక చర్య మాత్రం తీసుకోవాలని చూస్తుంది.. మంత్రి కొండా సురేఖ కుమార్తె కొండా సుస్మిత పరకాల సభలో సీఎం రేవంత్ రెడ్డిపై చేసిన విమర్శలు వివాదానికి దారితీశాయి. ఈ వ్యాఖ్యలపై స్పందించిన కాంగ్రెస్ పార్టీ క్రమశిక్షణా సంఘం సురేఖకు వివరణ కోరుతూ నోటీసులు జారీ చేసింది. కొండా సురేఖను మంత్రివర్గం నుండి బర్తరఫ్ చేయాలని కొంతమంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, నాయకులు బహిరంగంగానే డిమాండ్ చేస్తున్నారు ఆ వ్యాఖ్యలు తన కుమార్తె వ్యక్తిగతమని, తనకూ వాటికి సంబంధం లేదని కొండా సురేఖ స్పష్టం చేస్తూ క్రమశిక్షణా సంఘానికి లేఖ రాశారు. మంత్రి పదవి నుంచి తొలగిస్తారా లేదా అనే అంశంపై పార్టీ హైకమాండ్ మరియు సీఎం రేవంత్ రెడ్డి తీసుకునే నిర్ణయంపై స్పష్టత రావాల్సి ఉంది. దళిత ఎమ్మెల్యేను అవమానపర్చిన సమయంలోనూ, ఇతర సామాజికవర్గం నేతలను కించపర్చినప్పుడు ఒక్కటవ్వని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కొండా సురేఖ విషయంలో ఒక్కటవ్వడంపై కొంత వ్యతిరేకత వ్యక్తమయ్యే అవకాశముంది కానీ కొండా సురేఖపై చర్యలు తీసుకోవాలంటే అందుకు కొంత పార్టీ సాహసం చేయాల్సి ఉంటుంది. మిగిలిన క్రమశిక్షణ తప్పిన రెడ్డి సామాజికవర్గం ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, అనిరుధ్ రెడ్డితో పాటు ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డిపై చర్యలు తీసుకోకుండా కొండా సురేఖపై చర్యలు తీసుకుంటే అవి తప్పుడు సంకేతాలు వెళతాయి. తెలంగాణలో బలమైన బీసీ సామాజికవర్గంలో వ్యతిరేకత వస్తే అది రాజకీయంగా ఇబ్బందిగా మారుతుంది. అందుకే కొండా సురేఖ పై చర్యలు అంత సులువు కాదు. కాకుంటే ఇకపై ఎలాంటి దూకుడు గా వ్యవహరించకుండా కొంత కళ్లెం వేయవచ్చున్న అభిప్రాయం ఎక్కువ మందిలో ఉంది. కొండా సురేఖకు వ్యతిరేకంగా పదహారు మంది ఎమ్మెల్యేలు సీఎల్పీలో సమావేశమయ్యారు. కొందరు లోపాయికారీగా కొండాసురేఖకు మద్దతు తెలుపుతున్నట్లు తెలుస్తోంది. మరి కొండా వ్యవహారం ఏ మలుపు తిరుగుతుందన్నది చూడాలి.

## సంపాదకీయం

# బీజేపీ ఉచ్చులోనే కాంగ్రెస్

రాజకీయాలలో అత్యంత ప్రమాదకరమైన విషయం ప్రత్యర్థి చూపించే దారిలో ప్రయాణించడం. శత్రువు విసిరిన వ్యూహంలో చిక్కుకుని, అతను నిర్దేశించిన మైదానంలోనే పోరాడటానికి సిద్ధపడటం ఆత్మహత్యాసదృశం!"కాంగ్రెస్ పార్టీ గత పన్నెండేళ్లుగా ఇదే చేస్తోంది. ఇప్పటికీ తెలుసుకోలేకపోతోంది. రాజకీయం అనేది ఎవరూ ప్రత్యేకంగా నేర్పే విద్య కాదు. మారుతున్న పరిణామాలను గ్రహించి, ప్రత్యర్థి వేసే ఎత్తులకు పైఎత్తులు వేస్తూ సమాజంలోని అన్ని వర్గాలను తమవైపు తిప్పుకోవడమే ప్రజాస్వామ్యంలో ఏ రాజకీయ పార్టీకైనా ప్రాణాధారం. కానీ, దేశాన్ని దశాబ్దాల పాటు ఏలిన భారత జాతీయ కాంగ్రెస్ పార్టీకి నేడు ఆ ప్రాథమిక రాజకీయం కూడా చేతకావడం లేదనేది బహిరంగ రహస్యంగా మారింది. ఒకవైపు స్పష్టమైన హిందూత్వ పోలరైజేషన్‌తో ముందుకు వెళ్తున్న భారతీయ జనతా పార్టీ , మరోవైపు కాంగ్రెస్‌ను కేవలం ముస్లింల పార్టీ గా చిత్రించే వ్యూహాన్ని అత్యంత ప్రతిభావంతంగా అమలు చేస్తోంది. ఈ విషయం తెలిసి కూడా కాంగ్రెస్ నాయకత్వం ప్రతిసారీ బీజేపీ వేస్తున్న ఆ రాజకీయ ట్రాప్‌లోనే పడిపోతూ తన ఓటు బ్యాంకును, ఉనికిని కోల్పోతోంది.పోటీ ప్రపంచంలో ప్రత్యర్థి వేసే ముల్లును అదే ముల్లుతో తీయాలి తప్ప, ఆ ముల్లుపైనే అడుగులేస్తూ వెళ్లడం వివేకం అనిపించుకోదు. బీజేపీ తనపై వేస్తున్న ముస్లిం లీగ్ తరహా భావజాల ముద్రను సమర్థవంతంగా తిప్పి కొట్టలేకపోతే, రాబోయే రోజుల్లో మిగిలిన కొద్దిపాటి ప్రాతినిధ్యాన్ని కూడా కోల్పోయే ప్రమాదం స్పష్టంగా కనిపిస్తోంది. కేవలం మేధోపరమైన వ్యూహాల పేరుతో సాధారణ ప్రజల ప్రాథమిక ఆకాంక్షలకు, జాతీయ భావనలకు దూరంగా జరిగే కొద్దీ కాంగ్రెస్ తన సాంప్రదాయ ఓటు బ్యాంకును మరింత వేగంగా కోల్పోతూనే ఉంటుంది.ఇటీవలి ఎన్నికల విశ్లేషణల ప్రకారం కాంగ్రెస్ సాధిస్తున్న మెజారిటీ విజయాలు, ఓట్లు ఎక్కువగా వచ్చే ప్రాంతాలు మైనారిటీ జనాభా ఉన్నవే. బీజేపీ చేస్తున్న పోలరైజేషన్ ట్రాప్‌లో కాంగ్రెస్ నేరుగా వెళ్లి చిక్కుకోవడానికి నిదర్శనంగా వందేమాతరం' జాతీయ గేయం చుట్టూ జరుగుతున్న వివాదం నిలిచింది. రవీంద్రనాథ్ ఠాగూర్, మహాత్మా గాంధీలు నాటి రోజుల్లో సూచించిన అంశాలను సరికొత్త రాజకీయ పరిస్థితులకు అనుగుణంగా రీ-ఫ్రేమ్ చేసుకోవడంలో కాంగ్రెస్ విఫలం అయింది. ప్రత్యర్థి విసిరిన భావజాల ఎరలో పడి, తన సార్వజనీన జాతీయ ప్రతిష్ఠను కోల్పోతూ మైనారిటీల తుది శరణాలయంగా మాత్రమే మిగిలిపోయేలా కాంగ్రెస్ స్వయంకృత అపరాధం చేస్తోంది. గతం నుంచి పాఠాలు నేర్చుకోకుండా ఆనాటి పొరపాట్లనే మళ్లీ పునరావృతం చేయడం వల్ల, కాంగ్రెస్ పార్టీ భారతీయ ప్రజాస్వామ్యంలో తన ప్రధాన ప్రత్యామ్నాయ శక్తిననే హోదాను మరింత వేగంగా కోల్పోతోంది. భారత రాజకీయాల్లో నరేంద్ర మోదీ, అమిత్ షాల నాయకత్వంలో బీజేపీ అమలు చేసిన సామాజిక సమీకరణాల వ్యూహం అపూర్వమైన విజయాన్ని సాధించింది. దేశాన్ని దశాబ్దాల పాటు ఏకఛత్రాధిపత్యంగా ఏలిన కాంగ్రెస్ నిర్మించుకున్న సామాజిక పునాదిని ఈ వ్యూహం క్రమంగా, శాశ్వతంగా ధ్వంసం చేసింది. ఒకప్పుడు సమాజంలోని అన్ని వర్గాలను తన గొడుగు కిందకు తెచ్చుకున్న కాంగ్రెస్, నేడు తన సాంప్రదాయ ఓటు బ్యాంకులను ఒకటొకటిగా కోల్పోతూ తీవ్ర రాజకీయ సంక్షోభంలో కూరుకుపోయింది. చారిత్రకంగా కాంగ్రెస్‌కు వెన్నుదన్నుగా నిలిచిన ఉన్నత వర్గాలు, పట్టణ మధ్యతరగతి ప్రజలను బీజేపీ అత్యంత చతురతతో తనవైపు తిప్పుకుంది. బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య సామాజిక వర్గాలతో పాటు వేగంగా ఎదుగుతున్న ఉపాధి ఆధారిత పట్టణ సమాజంలో సుపారిపాలన, ఆర్థిక వృద్ధి, సాంస్కృతిక జాతీయవాదం అనే నినాదాలతో బీజేపీ గట్టి నమ్మకాన్ని నింపింది. కాంగ్రెస్ ప్రతిపాదించే సెక్యులరిజం కేవలం కొన్ని వర్గాలను సంతృప్తి పరచడానికే పరిమితమైందనే భావనను బలంగా ప్రచారం చేయడంలో అధికార పక్షం విజయం సాధించగా, ఈ నిర్ణయాత్మక ఓటు బ్యాంకు కాంగ్రెస్ చేజారి బీజేపీకి శాశ్వత బలగంగా మారింది.కాంగ్రెస్ విధానాల పట్ల తీవ్ర అసంతృప్తితో ఉన్న ఓబీసీలు, అత్యంత వెనుకబడిన వర్గాలను చేరదీయడం బీజేపీ వేసిన అతిపెద్ద వ్యూహాత్మక ఎత్తుగడ. ప్రాంతీయ పార్టీల ఆధిపత్యం, కాంగ్రెస్ ఆత్మరక్షణ వైఖరి వల్ల నిర్లక్ష్యానికి గురైన నాన్-యాదవ్ ూఃఅలు, చిన్న చిన్న వెనుకబడిన కులాలకు రాజకీయ ప్రాతినిధ్యంతో పాటు సంక్షేమ పథకాల్లో ప్రాధాన్యం కల్పించారు. సంస్థాగత పదవుల నుంచి చట్టసభల టిక్కెట్ల వరకు ఈ వర్గాలకు తగిన స్థానం ఇవ్వడం ద్వారా, కాంగ్రెస్ కేవలం కొన్ని కుటుంబాలు లేదా నాయకులకే పరిమితమైందనే విమర్శను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లగలిగారు. సాంప్రదాయకంగా కాంగ్రెస్ శాశ్వత ఓటు బ్యాంకుగా పరిగణించే దళిత , గిరిజన వర్గాల్లోనూ బీజేపీ పట్టు సాధిస్తోంది. సాంస్కృతిక జాతీయవాదం, స్థానిక గిరిజన పోరాట యోధులకు గుర్తింపు ఇవ్వడం , పిఎం ఆవాస్, ఉజ్వల వంటి సంక్షేమ పథకాల లబ్ధిదారుల నమూనా ద్వారా ఈ వర్గాల జీవన ప్రమాణాల్లో మార్పు తెచ్చింది. ఇటీవలి సార్వత్రిక ఎన్నికల ఫలితాలు, పలు రాష్ట్రాల అసెంబ్లీ ఫలితాలను నిశితంగా విశ్లేషిస్తే ఒక రకమైన మైనారిటీ క్లస్టర్ పార్టీగా పరిమితమవుతోందనే వాదన బలపడుతోంది. కాంగ్రెస్ తరఫున విజయం సాధిస్తున్న పార్లమెంటు, అసెంబ్లీ ప్రజాప్రతినిధుల్లో అత్యధికులు ముస్లిం లేదా క్రైస్తవ జనాభా గణనీయంగా ఉండే ప్రాంతాల నుంచే వస్తున్నారని స్పష్టమవుతోంది. ఉత్తర భారతదేశంతో పాటు దక్షిణాదిలోని కొన్ని పాకెట్లలో ముస్లిం సాంద్రత ఎక్కువగా ఉన్న స్థానాల్లోనే కాంగ్రెస్ మెరుగైన ఓటు షేర్‌ను, సీట్లను సాధించగలుగుతోంది. దీనికి భిన్నంగా, మెజారిటీ సామాజిక వర్గాలు , ఇతర వెనుకబడిన తరగతులు ఎక్కువగా ఉండే నియోజకవర్గాల్లో కాంగ్రెస్ రోజురోజుకూ తన పట్టును కోల్పోతోంది. అనేక ప్రాంతాల్లో ఆ పార్టీ మూడో స్థానానికి పడిపోవడం లేదా ప్రాంతీయ పార్టీలు, బిజెపిలతో పోలిస్తే ఉనికికే పరిమితమైన పరిస్థితి కనిపిస్తోంది. ఇది కేవలం ఎన్నికల ఓటములతో ఆగిపోకుండా, కాంగ్రెస్ అంటే కేవలం మైనారిటీల ప్రయోజనాలనే పరిరక్షించే పార్టీ అనే రాజకీయ నిందకు బలం చేకూరుస్తోంది. బిజెపి తన సార్వత్రిక ప్రచారాల్లో ఈ అంశాన్ని వ్యూహాత్మకంగా ఉపయోగించుకుంటూ, కాంగ్రెస్‌పై ముస్లింల పార్టీ ముద్ర వేసి మెజారిటీ వర్గాలను తనవైపు సమీకరించుకోవడంలో సఫలమవుతోంది. ఒక వైపు తన సాంప్రదాయక హిందూ ఓటు బ్యాంకును పునర్నిర్మించుకోవడంలో విఫలమవడం, మరోవైపు మైనారిటీ ఏకీకరణపైనే పూర్తి స్థాయిలో ఆధారపడాల్సి రావడం వల్ల పార్టీ జాతీయ ప్రతిష్ఠ దెబ్బతింటోంది.ఒకప్పుడు రాజకీయం అంటే తాము నిర్దేశించిన ్ణ తే అనే ధీమా కాంగ్రెస్‌లో బలంగా ఉండేది. ప్రత్యర్థుల ఉనికి నామమాత్రంగా ఉన్న నాటి వాతావరణంలో వరుస విజయాలు ఆ పార్టీకి నల్లపూసలా మారాయి. కానీ ఆరెస్సెస్ అందించే క్షేత్రస్థాయి శ్రేణుల బలం, బీజేపీ సమకూర్చుకున్న ఆధునిక సాంకేతిక, వ్యూహాత్మక బలగాలు ఏకం కావడంతో భారత రాజకీయ చదరంగం రూపురేఖలే మారిపోయాయి. తమ ఓటు బ్యాంకు ఒక్కొక్కటిగా కరిగిపోతున్నా, మార్పును గుర్తించి సరైన ఆత్మపరిశీలన చేసుకోకుండా కాంగ్రెస్ భావజాలపరంగా వరుస స్వయంకృత అపరాధాలు చేస్తూనే ఉంది. సమాజంలో హిందూత్వ వర్సెస్ సెక్యులరిజం భావజాల చర్చ ముందుకు వచ్చిన ప్రతీసారీ, సాధారణ ప్రజామోదం పొందే రీతిలో సమర్థవంతమైన సమాధానం చెప్పడంలో కాంగ్రెస్ తీవ్రంగా తడబడుతోంది ప్రత్యర్థులు లేని హాయిగా గడిచిన గతం ముగిసిపోయిందనే వాస్తవాన్ని కాంగ్రెస్ నాయకత్వం ఇప్పటికైనా గ్రహించాల్సి ఉంది. కేవలం పాత జ్ఞాపకాలనో, దశాబ్దాల నాటి తీర్మానాలనో పట్టుకుని వేలాడటం వల్ల మారుతున్న నేటి యువ భారత్ ఆకాంక్షలను అందుకోవడం అసాధ్యం. బీజేపీ విసురుతున్న రాజకీయ, భావజాల సవాళ్లను తిప్పికొట్టాలంటే కాంగ్రెస్‌కు డిఫెన్సివ్ వైఖరి కాదు, స్పష్టమైన భావజాల పునర్నిర్మాణం , సమగ్రమైన క్షేత్రస్థాయి ఆత్మపరిశీలన అవసరం. కానీ ఆ దిశగా కాంగ్రెస్ ఇప్పటికీ మేలుకోలేదు.

# కొత్త సీసాలో పక్వతలేని పాకం!



బండి నారాయణస్వామి రాసిన 'దళిత బహుజన వాదానికి కొత్త పిలుపు' అనే వ్యాసం (ఆంధ్రజ్యోతి, 18.07.2026) దళిత బహుజనుల మతపరమైన అస్తిత్వాన్ని, సామాజిక న్యాయాన్ని ఒకేసారి కాపాడగల ప్రత్యామ్నాయంగా 'హిందూ దళిత బహుజనవాదం' అనే భావనను ప్రతిపాదిస్తోంది. అయితే, ఈ వ్యాసంలో అనేక తార్కిక లోపాలు, భావనాత్మక అస్పష్టతలు, చారిత్రక సరళీకరణలు, ఆధార రహిత సాధారణీకరణలు ఉన్నాయి. వ్యాసకర్త ఒకవైపు ఆరెస్సెస్--బీజేపీ భావజాలాన్ని, మరోవైపు నాస్తిక--మార్క్సిస్టు లౌకికవాదాన్ని ఉంచి, ఈ రెండు ధ్రువాల మధ్య హిందూ దళిత బహుజనులు చిక్కుకున్నారని వాదించారు. భారతదేశంలోని సామాజిక--రాజకీయ ఆలోచనా ప్రపంచం కేవలం ఈ రెండు ధ్రువాలకే పరిమితం కాలేదు. అంబేద్కరిజం, జ్యోతిరావు ఫూలే భావజాలం, పెరియార్ ఉద్యమం, బౌద్ధ దళిత ఉద్యమం, గాంధేయ సామాజిక సంస్కరణ, రాజ్యాంగవాదం, వివిధ సోషలిస్టు సంప్రదాయాలు వంటి అనేక ప్రత్యామ్నాయ భావజాలాలు కూడా ఉన్నాయి. అదేవిధంగా, మొత్తం నాస్తికవాదాన్ని ఆయన చిత్రీకరించిన తీరు కూడా ఆధార రహిత సాధారణీకరణ. నాస్తికులు మతాన్ని అధ్యయనం చేయరన్న వాదనను సమర్థించే ఉదాహరణలు సైతం వ్యాసంలో లేవు. మతాన్ని విశ్లేషించిన ప్రముఖ సామాజిక సిద్ధాంతకర్తలూ లేకపోలేదు. ఉదాహరణకు, డి.డి. కోశాంబి, రొమిలా థాపర్, ఇర్ఫాన్ హబీబ్ వంటి అనేకమంది మతాన్ని లోతుగా అధ్యయనం చేశారు. మతాన్ని విమర్శించడం, మతాన్ని అధ్యయనం చేయకపోవడం రెండూ వేర్వేరు విషయాలు. అలాగే, 'మతం తెలియనివారికి సంస్కృతి తెలియదు' అనే వాదన సైతం తార్కికంగా నిలబడదు. సంస్కృతి అనేది కేవలం మతం కాదు. భాష, సాహిత్యం, కళలు, సఙ్ణ తం, జానపద సంప్రదాయాలు, చరిత్ర, వంటకాలు, కుటుంబ నిర్మాణం, సామాజిక సంబంధాలు, స్థానిక ఆచారాలు, జీవన విధానాలు... ఇవన్నీ కలిపే సంస్కృతి అవుతుంది. మతం సంస్కృతిలో ఒక భాగం; సంస్కృతి మొత్తాన్ని మతంతో సమానంగా చూడలేం. ఈ రెండింటిని ఒకే అర్థంలో చూడటం భావనాత్మక పొరపాటు వ్యాసంలో ఆరెస్సెస్ పట్ల ఆయన తీసుకున్న వైఖరిలోనూ స్పష్టత లేదు. ఒకచోట దళిత బహుజనుల సామాజిక న్యాయాన్ని ఆరెస్సెస్ నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు, వెంటనే అదే సంస్థ దేశభక్తికి పునాదులు వేసిందని ప్రశంసిస్తారు, ఆ తర్వాత మళ్లీ.. అది హిందూ దళిత బహుజనులకు ప్రమాదమని చెబుతారు. ఇంతకూ ఏ అంశాన్ని అఙ్ణ కరిస్తున్నారు? ఏ అంశాన్ని తిరస్కరిస్తున్నారు? ఈ రెండింటి మధ్యఙ్ణ త ఎక్కడ? అట్లాగే ఆరెస్సెస్ మధ్యయుగాల వారసత్వ వృత్తులను సమర్థిస్తోందన్న ఆరోపణ తీవ్రమైనది. ఈ ఆరోపణకు తగిన కారణాలు చూపకపోవడంతో అది నిర్ధారిత అంశంగా కాక కేవలం అభిప్రాయంగానే మిగిలిపోతుంది. 'హిందూ దళిత బహుజనుడు' అనే భావనను ప్రతిపాదించినప్పుడు కూడా బండి నారాయణస్వామి ఒక ముఖ్యమైన చారిత్రక ప్రశ్నను పక్కనపెట్టారు. హిందుత్వానికి భిన్నంగా హిందూ దళిత బహుజన అస్తిత్వం అవసరమని చెబుతున్నప్పటికీ, డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ ఎందుకు బౌద్ధమతాన్ని స్వీకరించారు? ఎందుకు లక్షలాది మంది దళితులు హిందూమతాన్ని విడిచారు? ఆయన ప్రతిపాదిస్తున్న ఈ కొత్త సిద్ధాంతం, అంబేడ్కర్ చేపట్టిన హిందూమత విమర్శతో ఏకీభవిస్తుందా? విభేదిస్తుందా? లేక దాన్ని అధిగమించాలనుకుంటుందా? అనే ఏ ప్రశ్నకూ వ్యాసం సమాధానం ఇవ్వదు. ఇదే తరహా సాధారణీకరణ క్రిస్టియన్ మేధావుల విషయంలోనూ కనిపిస్తుంది. అలాగే, ముస్లింల రాజకీయ--సామాజిక ప్రతిస్పందనను కేవలం మతగ్రంథాలకు మాత్రమే ఆపాదించడం అతి సరళీకరణ "హిందూ మతాన్ని ప్రజాస్వామీకరించాలి" అనే ప్రతిపాదన కూడా ఒక నినాదంగా మాత్రమే మిగిలిపోయింది. కానీ దాన్ని ఎలా సాధించాలి? ఆలయాల నిర్వహణలో మార్పులా? పూజారి వ్యవస్థలో సంస్కరణలా? వర్ణ వ్యవస్థ నిర్మూలనా? ఒకవైపు బ్రాహ్మణాధిపత్యాన్ని నిర్మాణాత్మక సమస్యగా పేర్కొంటూనే, మరోవైపు అదే వర్గం మతపరమైన వారసత్వాన్ని సంరక్షించిన పాత్రను ప్రశంసిస్తున్నప్పుడు ఈ రెండు మూల్యాంకనాలను ఏ ప్రమాణం ఆధారంగా సమన్వయిస్తున్నారో కూడా వివరించాలి. వ్యాసంలో "దేశం ముందు మతం" అనే స్థానం స్పష్టంగా కనిపిస్తుంది. అయితే ఇక్కడ కూడా "దేశం" అనే పదాన్ని ఏ అర్థంలో తీసుకున్నారో సరైన నిర్వచనం లేదు. దేశం అంటే రాజ్యమా? జాతియా? నాగరికతా? లేక రాజ్యాంగ ప్రజాస్వామ్యంలోని పౌరసమాజమా? అలాగే "హిందూ దళిత బహుజనవాదం" అనే భావన ఒక మతపరమైన ఉద్యమమా? రాజకీయ సిద్ధాంతమా? సామాజిక ఉద్యమమా? సాంస్కృతిక వేదికా? అంబేద్కరిజానికి విస్తరణా? హిందుత్వానికి ప్రత్యామ్నాయమా? అనే ప్రశ్నలకు వ్యాసం చివరివరకూ స్పష్టమైన సమాధానం ఇవ్వదు. 'హిందూ దళిత బహుజనవాదం' అనే భావనకు స్పష్టమైన నిర్వచనం, తార్కిక సమగ్రత, చారిత్రక ప్రాతిపదిక, ఆచరణాత్మక రూపకల్పన నారాయణస్వామి వ్యాసంలో కనిపించవు. అందువల్ల ఆయన వ్యాసం చర్చకు ఆహ్వానించే ప్రతిపాదనగా నిలిచినా, సిద్ధాంత నిర్మాణంగా మాత్రం నిలబడదు.

# ఆధునిక భారతానికి అతనే సర్కార్ !!

'భారతీయ చరిత్రకారులమైన మేము, ఏ ఇతర అజెండాను అనుసరించకుండా సొంత అజెండా ప్రకారమే రాయాలనుకున్న చరిత్రలనే రాశాము. అయితే ఇది గతించిన విషయం. ఆ మేధా స్వేచ్ఛ ఇప్పుడు లభించడం లేదు. అది వేగంగా కనుమరుగవుతున్నట్లు కనిపిస్తోంది'-- దశాబ్దాల తన మేధా కృషిని సింహావలోకనం చేసుకుంటూ ఆధునిక భారత దేశ చరిత్రకారుడు సుమిత్ సర్కార్ విచారగ్రస్తంగా చేసిన వ్యాఖ్యలవి. ప్రతిభావంతమైన, సూత్రబద్ధమైన భారతీయ మార్క్సిస్ట్ చరిత్రకారులలో అగ్రగణ్యుడిగా సుదీర్ఘమైన, మేధో సంపద్వంతమైన జీవితాన్ని గడిపిన సుమిత్ సర్కార్ ఇతరులు రుద్దిన మూడు చారిత్రక అజెండాలను ఎదుర్కోవలసివచ్చింది. మొదటిది-- గతాన్ని ఆర్థిక నియతి దృక్కోణంలో అధ్యయనం చేసే పిడివాద మార్క్సిజం; రెండోది-- పోస్ట్ మోడర్నిజం, పోస్ట్ కలోనియలిజంల అంతస్సంబంధ ధోరణి. మానవ సామాజిక ప్రవర్తన అధ్యయనంలో అత్యంత ప్రభావశీలమైన ఈ మేధో ధోరణి అమెరికాలో స్థిరపడిన లేదా ఆ దేశంలో ఉన్నత విద్యాభ్యాసం చేసిన భారతీయులను మరీ ముఖ్యంగా బెంగాలీ విద్యాధికులను విశేషంగా ఆకర్షించింది. మూడోది--సంఘ్ పరివార్ మతపరమైన మెజారిటేరియనిజం. పోస్ట్ మోడర్నిజం, పోస్ట్ కలోనియలిజం ఆలోచనా స్రవంతుల ప్రభావ పరిధిలోనే ఉండిపోయేందుకు సుమిత్ సర్కార్ నిరాకరించారు. ఈ రెండు అత్యాధునిక చింతనాధోరణులను తిరస్కరించడంలో సబాల్టర్న్ స్టడీస్ స్కూల్ లోని తన సహచరుల కంటే చాలా కచ్చితమైన, స్పష్టమైన వైఖరిని ఆయన తీసుకున్నారు. వ్యక్తి జీవితంలోను, సమాజ గమనంలోను ఆర్థిక శక్తులు నిర్వహించే పాత్రకు పోస్ట్ మోడర్నిజం, పోస్ట్ కలోనియలిజం తక్కువ ప్రాధాన్యమివ్వడాన్ని సుమిత్ సర్కార్ ఆమోదించలేకపోయారు. సంఘ్ పరివార్ హిందుత్వ భావజాలాన్ని ఆయన నిర్ద్వంద్వంగా తిరస్కరించారు. గతించిన యుగాల చరిత్రపై సంఘ్ తప్పుడు అవగాహనలు, వర్తమానంలో ప్రజాస్వామ్యానికి, బహుళత్వవాదానికి వాటి వల్ల ఎదురవుతున్న విషమ పర్యవసానాల కారణంగానే సంఘ్ పరివార్ ఔదలదాల్చిన మతపరమైన మెజారిటేరియనిజంను సుమిత్ సర్కార్ అమితంగా గర్హించారు. మార్క్సిజంతో సుమిత్ సర్కార్ సంబంధం మరింత సంక్లిష్టమైనది. మార్క్సిస్టు చింతనలోని ఆర్థిక నిర్ణయవాదంతో ఆయన పూర్తిగా ఏకీభవించలేదు. భారతదేశంలో సామాజిక అసమానతలకు కులం, జెండర్ మూల స్తంభాలని, వర్గానికి ఉన్న ప్రాధాన్యమే ఆ రెండిటికీ ఉన్నదని ఆయన గుర్తించారు. సుమిత్ సర్కార్ తన సహచర చరిత్రకారులను దృష్టిలో ఉంచుకుని రాసిన పరిశోధనా పత్రాలలో గానీ, సామాన్య పాఠకులను దృష్టిలో ఉంచుకుని రాసిన వ్యాసాలలో గానీ మార్క్సిస్టు సిద్ధాంత పరిభాష ఉండదు. నాకు తెలిసినంతవరకు ఆయన ఏ కమ్యూనిస్టు పార్టీలోనూ ఎప్పుడూ సభ్యుడిగా లేరు.

సుమిత్ సర్కార్ మొదటి పుస్తకం 'ది స్వదేశీ మూవ్‌మెంట్ ఇన్ బెంగాల్ (1903--1908) 1973లో ప్రచురితమయింది. బెంగాల్ విభజనకు ప్రతిస్పందనగా ప్రజ్వరిల్లిన ఈ స్వదేశీ ఉద్యమం యావద్భారతావనిలో రగిల్చిన అపూర్వ సామాజిక, రాజకీయ చైతన్యాన్ని ప్రతిభావంతంగా వివరించడంతో పాటు ఆ ఉద్యమ వైఫల్యాలను కూడా ఆయన నిశితంగా విశ్లేషించారు. 1997లో ప్రచురితమైన సుమిత్ సర్కార్ మరో పుస్తకం 'రైటింగ్ సోషల్ హిస్టరీ'లో బెంగాలీలకు ఆరాధ్యులు అయిన రామకృష్ణ పరమహంస, ఈశ్వరచంద్ర విద్యాసాగర్‌పై వ్యాసాలతో పాటు రాజకీయ భావజాలాల్లో కులం నిర్వహిస్తున్న పాత్ర, తాను అభిమానించే, లేదంటే ఆమోదించలేని చరిత్ర రచనా సంప్రదాయాలపై నిశిత విమర్శలతో కూడిన వ్యాసాలున్నాయి. ప్రస్తావిత రెండు పుస్తకాలూ మళ్లీ మళ్లీ చదవవలసిన పుస్తకాలే, సందేహం లేదు. అయితే సుమిత్ సర్కార్ రచనలలో అత్యంత ప్రసిద్ధమైనది 'మోడరన్ ఇండియా: 1885--1947.' మన స్వాతంత్ర్యోద్యమంపై సమగ్రమైన, ప్రామాణికమైన రచన అది. వలసపాలన చివరి దశాబ్దాల్లో ఘటనలు, పరిణామాలు, సామూహిక జాతీయవాదం ఆవిర్భావాన్ని సుమిత్ సర్కార్ అనితరసాధ్యంగా వివరించారు. 'మోడరన్ ఇండియా' రాయడంలో తన రెండు ఉద్దేశ్యాలను ఆ పుస్తకం ముందుమాటలో ఆయన ఇలా పేర్కొన్నారు: 'మొదటిది--రాజకీయ, సామాజిక, ఆర్థిక చరిత్రలోని ప్రత్యేక సమస్యలపై ఇటీవలి కాలంలో వెలువడిన అనేక పరిశోధనా గ్రంథాలను, ఇంకా వెలికితీసిన అపార సమాచారాన్ని ఒక చోట చేర్చడం; రెండవది-- నాయకుల కార్యకలాపాలు, ఆదర్శాలు లేదా వర్గ పోరాట వ్యూహాలకే జాతీయవాద చరిత్ర రచన ఇస్తున్న ప్రాధాన్యానికి ప్రత్యామ్నాయంగా.. కింది స్థాయి నుంచి (అంటే సామాన్య ప్రజల కోణం నుంచి) చరిత్రను రచించే అవకాశాలను పరిశీలించడం'. ఈ రెండు ఉద్దేశ్యాలు సంపూర్ణంగా నెరవేరాయి. స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న ఉపఖండంలోని అన్ని ప్రాంతాలకు ఆయన సమప్రాధాన్యమిచ్చారు. మరీ ముఖ్యమైన విషయమేమిటంటే భారత జాతీయ కాంగ్రెస్ నిర్వహించిన పోరాటాలు ఉద్యమాలకే కాకుండా, పరాయి పాలకులపై ఆదివాసీల, రైతుల తిరుగుబాట్లకు కూడా సమంజసమైన ప్రాధాన్యాన్ని సుమిత్ సర్కార్ ఇచ్చారు. హిందూ--ముస్లింల మధ్య విభేదాలు ఊపిరిపోసుకున్న తీరుతెన్నులు, దేశ విభజన విషాద ఘటనలను ఆయన గొప్ప నైపుణ్యంతో, కచ్చితత్వంతో వివరించారు. ఈ విశిష్టతల కారణంగానే, ప్రచురితమైన 43 సంవత్సరాల అనంతరం కూడా సుమిత్ సర్కార్ విరచితమైన 'మోడరన్ ఇండియా' భారత స్వాతంత్ర్యోద్యమ చరిత్రపై అత్యుత్తమ ఏక సంపుటి పుస్తకంగా వెలుగొందుతోంది. 'మోడరన్ ఇండియా'లో కులంపై సుమిత్ సర్కార్ చూపిన శ్రద్ధ మార్క్సిజంపై ఆయన సంప్రదాయ విరుద్ధ వైఖరులను స్పష్టం చేస్తోంది. అంతకంటే ముఖ్యంగా మహాత్మాగాంధీ చారిత్రక ప్రాధాన్యంపై ఆయన భావాలు, అభిప్రాయాలు వారసత్వంగా సంక్రమించిన మనో వైఖరులను ఆయన ఎంతగా విడనాడారో కూడా స్పష్టం చేస్తాయి. మహాత్మాగాంధీ అహింసాత్మక పోరాటం విప్లవ కార్యాచరణ నుంచి ప్రజలను దూరం చేసే కపట వ్యూహమని మార్క్సిస్టు సిద్ధాంతకర్తలు రజనీ పామీదత్, మానవేంద్రనాథ్ రాయ్ అభిప్రాయపడ్డారు. అలాగే మత సామరస్యానికి మహాత్ముడు ఇచ్చిన ప్రాధాన్యం వర్గ పోరాటాల నుంచి జన బాహుళ్యాన్ని వేరు చేసే యుక్తి మాత్రమేనని కూడా ఆ ఇరువురు తీవ్రంగా విమర్శించారు. అయితే సుమిత్ సర్కార్ ఆ ఇరువురితో విభేదిస్తూ గాంధీ రాజకీయాలలో చాలా లోతైన నైతిక అంశాలు ఉన్నాయని అర్థం చేసుకున్నారు. గాంధీకి సంబంధించి అహింస, సత్యాగ్రహం అనేవి 'ఒక గాఢమైన అనుభూతితో రూపుదిద్దుకున్న విశిష్ట తాత్వికతలు అని, వాటిలో మౌలికత ఉన్నదని, అది గణనీయమైనదేకాక విస్మరించరానిద'ని ఆయన స్పష్టం చేశారు. గాంధీ గురించిన సత్యాన్ని సర్కార్ సరిగానే గుర్తించారు. 'సత్యాన్వేషణే మానవ జీవిత లక్ష్యం' అని మహాత్ముడు అన్నారు. ఆయన ఇంకా ఇలా స్పష్టంగా చెప్పారు: 'అంతిమ సత్యాన్ని ఎవరూ పూర్తిగా తెలుసుకోలేరు. ఎవరికి వారు తమకు తోచిన పాక్షిక సత్యాన్ని ఇతరులపై హింస ద్వారా రుద్దడం పాపకార్యమే'. 1920ల తుదినాళ్ల పరిణామాలను చర్చిస్తూ గాంధీ గురించిన తన భిన్నాభిప్రాయాన్ని సుమిత్ సర్కార్ వ్యక్తం చేశారు. స్వాతంత్ర్యం సిద్ధించిన వేళ మతోన్మాదం పెచ్చరిల్లి, భయంకరమైన హత్యాకాండ చోటుచేసుకున్నప్పుడు హిందువులు- ముస్లింల మధ్య సామరస్యాన్ని నెలకొల్పేందుకు నౌఖాలీలో గాంధీ శాంతియాత్ర నిర్వహించారు. ఆ తరువాత ఢిల్లీ, కలకత్తాలో నిరాహార దీక్షలు చేశారు. ఈ పరిణామాలు 'మహాత్ముని అత్యుత్తమ ఘడియలు' అని సుమిత్ సర్కార్ అభివర్ణించారు. మోడరన్ ఇండియా చివరి అధ్యాయంలో ఆయన ఇలా రాశారు: 'మహాత్మాగాంధీ నిజమైన గొప్పతనం, విశిష్ట గుణాలు ఆయన జీవితం తుదినాళ్లలో స్పష్టంగా కనిపించాయి'. ప్రపంచం ముక్తకంఠంతో ఒప్పుకున్న సత్యమిది. కొత్తగా వెలుగులోకి వచ్చిన ప్రాథమిక చారిత్రక సమాచారం ఆధారంగా, అవసరమైతే తన అభిప్రాయాలను మార్చుకోవడానికి సుమిత్ సర్కార్ వెనుకాడేవారు కాదు. ఆయన గొప్ప వచన రచయిత. పదాలను గొప్ప నైపుణ్యంతో ఉపయోగించేవారు. తన భావాలను సూటిగా, స్పష్టంగా చెప్పేవారు. లయబద్ధమైన వాక్యాలను సృష్టించడంలో ఆయనకు ఆయనే సాటి. ఈ కారణంగానే ఆయన పుస్తకాలు విద్వత్ లోకాన్ని దాటి సామాన్య పాఠకులకు ప్రీతిపాత్రమయ్యాయి. సుమిత్ సర్కార్ స్ఫూర్తిదాయక అధ్యాపకుడు కూడా. ఆయన బోధనా విధానం గాంధేయ పద్ధతిలోను, ప్రజాస్వామ్యయుతంగాను ఉండేదని జర్నలిస్ట్ రావిశ్ కుమార్ ప్రశంసించారు. తన విద్యార్థుల నుంచి తాను ఎంతో నేర్చుకున్నానని సుమిత్ అఙ్ణ కరించారు. స్త్రీవాద చరిత్రకారిణి అయిన సుమిత్ సతీమణి తనికా సర్కార్ ప్రభావం కూడా ఆయన రచనలలో స్పష్టంగా కనిపిస్తుంది. తాను అభిమానించే చరిత్రకారుడు ఇ.పి.థాంప్సన్. చరిత్ర రచనలో పథ నిర్దేశం చేసిన థాంప్సన్ పుస్తకాల గురించి, ఇంకా అనేక రాజకీయ, సామాజిక అంశాలపైన ఆయనతో జరిపిన చర్చలు తన మనస్సుపై ప్రగాఢ ముద్ర వేశాయని సుమిత్ తరచూ చెప్పేవారు. సామాజిక, మానవీయ శాస్త్రాలలో మౌలిక పరిశోధనలకు ఢిల్లీ విశ్వవిద్యాలయాన్ని సుప్రసిద్ధం చేసిన ప్రవాస బెంగాలీ మేధావులలో సుమిత్ సర్కార్ ఒకరు. కలకత్తాకే వారు పరిమితమైవుంటే బహుశా భారతీయ ఉన్నత విద్యా జగత్తు కీర్తికాంతులు అంత ఉజ్వలంగా ఉండేవికావేమో?! ఈ సత్యం ఢిల్లీ విశ్వవిద్యాలయానికి చెందిన తమిళ్, మహారాష్ట్రియన్, కన్నడిగ, ఉత్కళ, బిహారీ, పంజాబీ విద్వద్వరేణ్యులకు కూడా పూర్తిగా వర్తిస్తుంది. సుమిత్ సర్కార్ మరణంతో ఢిల్లీ విశ్వవిద్యాలయం చరిత్రలో ఒక ఉజ్వల అధ్యాయం ముగిసింది.

# కామ్రేడ్ సుధాకర్ రెడ్డి చిత్రపటానికి పూలు వేసి నివాళులర్పించిన. సిపిఐ.

**వలిగొండ ఆగస్టు 22** :యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రంలో కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి ప్రథమ వర్ధంతి సందర్భంగా భారత కమ్యూనిస్ట్ పార్టీ- సిపిఐ వలిగొండ మండల సమితి ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి శ్రద్ధాంజలి గటించడం జరిగింది. ఈ కార్యక్రమానికి సల్వద్రి రవీందర్ అధ్యక్షత వహించగా మండల కార్యదర్శి సలిగంజి వీరాస్వామి మాట్లాడుతూ కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి విద్యార్థి దశ నుండి రాజకీయాలు అలవర్చుకొని దేశ రాష్ట్ర రాజకీయాలలో కీలక భూమిక




పోషించారు. బడుగు బలహీన వర్గాల ఆశజ్యోతిగా ఉమ్మడి నల్లగొండ జిల్లా పార్లమెంట్ సభ్యులు గా ఈ ప్రాంత త్రాగు సాగు, నీరు కై కేంద్రం దృష్టికి తీసుకెళ్లి సమస్య ను పరిష్కరించే దిశగా అగ్రగామి పాత్ర పోషించారు. యూపీఏ 1 గవర్నమెంట్ లో ఉపాధి హామీ చట్టాన్ని, సమాచార చట్టం, అటవీ హక్కుల చట్టం మరియు గృహహింస లాంటి అనేక చట్టాలు తీసుకురావడం లో ప్రధాన పాత్ర పోషించారని వారన్నారు. ఈ కార్యక్రమం లో మండల సహాయ కార్యదర్శి ఎల్లంకి మహేష్, రైతు సంగం నాయకులు ఎలగందుల అంజయ్య, తెలంగాణ ఉద్యమకారుల సంఘం నాయకులు శీలం స్వామి, సిపిఐ మండల సమితి నాయకులు బాలాగోని సత్యనారాయణ, పోలెపాక యాదయ్య, నరిగె యాదయ్య, సుద్దాల సాయి కుమార్, బోడిగే సుదర్శన్, మచ్చ లక్ష్మి నారాయణ, తాలుక యాదగిరి ,సలిగంజి మచ్చ గిరి,ఎడవల్లి వేణు,యాదమ్మ, అనిత, తదితరులు పాల్గొన్నారు.

# పలుగురాళ్ల తండాలో నూతన పాఠశాల భవనానికి శంకుస్థాపన

## మున్సిపల్ చైర్మెన్ నందారం ప్రశాంత్

**కొడంగల్, ఆగస్టు,22**:కొడంగల్ మండలం పలుగురాళ్ల తండాలో నూతన పాఠశాల భవనం నిర్మాణానికి శనివారం కొడంగల్ మున్సిపల్ చైర్మన్ నందారం ప్రశాంత్ చేతుల మీదుగా శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో పలుగురాళ్ల తండా సర్పంచ్ మోతిలాల్, హస్నాబాద్ సర్పంచ్ భీములు గారు, పర్సాపూర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీశైలం, గ్రామ



ఉపసర్పంచ్, వార్డు మెంబర్లు, ప్రభుత్వ అధికారులు, గ్రామ పెద్దలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ నందారం ప్రశాంత్ మాట్లాడుతూ ఇన్నేళ్ల ఇతర ప్రభుత్వ పాలనలో ప్రజలకు ఏవొక్క వసతులు అందనివి మన ప్రభుత్వంలో ప్రతి ఒక్క వసతులను అందజేస్తున్న ముఖ్యమంత్రి వర్యులు ఏ రేవంత్ రెడ్డి గారికి కృతజ్ఞతలు తెలుపుతూ నూతన పాఠశాల భవనం నిర్మాణంతో విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం, అవసరమైన మౌలిక వసతులు అందుబాటులోకి రానున్నాయని తెలిపారు.

# నూతన క్రీడా అధికారులకు ఘన సన్మానం

- క్రీడారంగంలో యాదాద్రి భువనగిరి జిల్లాను అగ్రస్థానంలో నిలిపేందుకు కృషి : అధికారులు

**ఆలేరు, ఆగస్టు 22**:: యాదాద్రి భువనగిరి జిల్లా నూతన జిల్లా క్రీడల అభివృద్ధి అధికారిగా బాధ్యతలు చేపట్టిన కె ధనంజేయులు, 'యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీ' జిల్లా నూతన నోడల్ అధికారిగా నియమితులైన పొన్నగాని కృష్ణమూర్తి గౌడ్ లను ఎస్ఎఫ్ఐ మాజీ జిల్లా సహాయ కార్యదర్శి చెన్న రాజేశ్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి కె ధనంజేయులు మాట్లాడుతూ జిల్లాలోని క్రీడాకారులు, విద్యార్థులను క్రీడల పరంగా అన్ని విధాలుగా ప్రోత్సహించేందుకు ప్రత్యేక చర్యలు చేపడతామని తెలిపారు. క్రీడాకారులకు మెరుగైన అవకాశాలు కల్పిస్తూ వారి ప్రతిభను వెలికితీసేందుకు కృషి చేస్తామన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లాను క్రీడా రంగంలో రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలిపేందుకు సమష్టిగా పనిచేస్తామని పేర్కొన్నారు. నూతన నోడల్ అధికారి పొన్నగాని కృష్ణమూర్తి గౌడ్ మాట్లాడుతూ జిల్లాలో క్రీడలు, శారీరక విద్యకు మరింత ప్రాధాన్యత కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. ముఖ్యంగా యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందిస్తూ విద్యార్థులు క్రీడల వైపు ఆసక్తి చూపేలా ప్రోత్సహిస్తామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి వారికి తగిన అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా చెన్న రాజేశ్ మాట్లాడుతూ నూతన అధికారుల నేతృత్వంలో యాదాద్రి భువనగిరి జిల్లాలో క్రీడారంగం మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. జిల్లాలోని క్రీడాకారులు, విద్యార్థులకు మెరుగైన శిక్షణ, అవకాశాలు అందించడంతో పాటు ప్రతిభావంతులను రాష్ట్ర, జాతీయ




స్థాయిలో రాణించేలా తీర్చిదిద్దేందుకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. కార్యక్రమంలో పలువురు క్రీడాభిమానులు, విద్యార్థులు, యువజన ప్రతినిధులు పాల్గొని నూతన అధికారులకు శుభాకాంక్షలు తెలిపారు.

# నూతన సీఐ చంద్రశేఖర్ రెడ్డి గారికి BSP నాయకుల సన్మానం




**కొడంగల్ న్సిపల్,ఆగస్టు,22:**

కొడంగల్ నూతన సర్కిల్ ఇన్స్పెక్టర్ (సీఐ) గా బాధ్యతలు స్వీకరించిన చంద్రశేఖర్ రెడ్డి గారికి బహుజన్ సమాజ్ పార్టీ నాయకులు శనివారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా కొడంగల్ నియోజకవర్గంలో శాంతి భద్రతలు పరిరక్షించడంలో, ప్రజలకు న్యాయం చేయడంలో మీ పాత్ర కీలకమని, పోలీసు శాఖకు BSP పార్టీ తరఫున పూర్తి సహకారం ఉంటుందని వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో కొడంగల్ అసెంబ్లీ ఇంచార్జ్ యు. రమేష్ బాబు, అసెంబ్లీ అధ్యక్షులు శ్రీనివాస్, అసెంబ్లీ కార్యదర్శి కేశవులు, అసెంబ్లీ ఉపాధ్యక్షులు ఎం. వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

# రెవెన్యూ, గృహ నిర్మాణ కార్యక్రమాలపై మంత్రి సమీక్ష

**నిజామాబాద్, ఆగస్టు 22**::సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం ప్రధాన సమావేశ మందిరంలో శనివారం నిజామాబాద్, కామారెడ్డి ఉమ్మడి జిల్లాలకు సంబంధించిన రెవెన్యూ అంశాలు, గృహ నిర్మాణ కార్యక్రమాల ప్రగతిపై మంత్రి సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. రెవెన్యూ, హౌసింగ్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్, సర్వే శాఖల అధికారులతో శాఖల వారీగా పురోగతిని సమీక్షించారు. సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పోచారం శ్రీనివాసరెడ్డి, రెవెన్యూ ప్రిన్సిపల్ సెక్రటరీ లోకేష్ కుమార్, స్పెషల్ సెక్రటరీ రాజీవ్ గాంధీ హనుమంతు, గృహ నిర్మాణ సంస్థ ఎండీ గౌతమ్, నిజామాబాద్, కామారెడ్డి జిల్లా కలెక్టర్లు భవేష్ మిశ్రా, ఆశిష్ సాంగ్వాన్‌తో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.




# మాతృత్వపు మధుర జ్ఞాపకాల వేడుక..

- గర్భిణీలకు సామూహిక శ్రీమంతం
- పౌష్టికాహారం, ప్రశాంతమైన ఆలోచనలు తల్లీబిడ్డల ఆరోగ్యానికి ఎంతో అవసరం – డాక్టర్ అనితా రెడ్డి
- మాతృత్వం ఓ మధుర వరం..తల్లీబిడ్డల ఆరోగ్యమే లక్ష్యం

**హనుమకొండ, ఆగస్టు 22** :: గర్భిణీ మహిళల కోసం నిర్వహించిన సామూహిక శ్రీమంతం కార్యక్రమంలో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందని అనురాగ్ సొసైటీ చైర్మన్, కాకతీయ



విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యులు, సీనియర్ సిటిజన్ ట్రైబ్యునల్ బెంచ్ మెంబర్ డాక్టర్ కరుకాల అనితా రెడ్డి అన్నారు. లార్డు స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అయ్యగారు వేదాంత కృష్ణమూర్తి–కవిత దంపతుల సహకారంతో భీమారం బొడ్రాయి సమీపంలోని అంగన్వాడీ కేంద్రంలో గర్భిణీ మహిళలకు సామూహిక శ్రీమంతం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ అనితా రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణీ మహిళలు పౌష్టికాహారం తీసుకోవడంతో పాటు, ప్రసవం వరకు వైద్యుల సూచనలు పాటించాలని తెలిపారు. అంగన్వాడీ టీచర్లు అందించే సలహాలు, సూచనలను కూడా క్రమం తప్పకుండా పాటించాలని సూచించారు. గర్భధారణ సమయంలో ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా, సానుకూల ఆలోచనలతో ఉండటం తల్లీబిడ్డల ఆరోగ్యానికి ఎంతో మంచిదని అన్నారు. కార్యక్రమంలో భాగంగా అంగన్వాడీ కేంద్ర పరిధిలోని ఐదుగురు గర్భిణీ మహిళలను పూలు, పండ్లు, స్వీట్లు, వస్త్రాలతో సత్కరించి ఆశీర్వదించారు. మహిళల ఆరోగ్యం, మాతా–శిశు సంక్షేమం కోసం ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని డాక్టర్ అనితా రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో లార్డు స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు డాక్టర్ నారగాని నరేశ్ గౌడ్, హనుమకొండ ట్రై సిటీ లయన్స్ క్లబ్ కార్యదర్శి మెరుగు రవీందర్ గౌడ్, మహిళా శిశు సంక్షేమ శాఖ సీడీపీఓ పి. స్వరూప, సూపర్‌వైజర్ ఎస్. కల్పన, అంగన్వాడీ టీచర్ సంఘాల కిరీటి తదితరులు పాల్గొన్నారు.

# యూత్ ఫర్ సేవా సేవలు అభినందనీయం

## తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర కార్యదర్శి కే రవీందర్ గౌడ్




**బొంరస్ పేట మండలం, ఆగస్టు,22:**

యూత్ ఫర్ సేవ సహకారంతో చెట్టుపల్లి తండా యందు కేజీబీవీలో విద్యార్థినులకు తాగునీటి సౌకర్యార్థం ఆర్వో ప్లాంటును ఏర్పాటుచేసి శనివారం ప్రారంభించడం జరిగింది ఈ సందర్భంగా తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర కార్యదర్శి కే రవీందర్ గౌడ్ మాట్లాడుతూ,, గ్రామీణ ప్రాంతంలో చదువుతున్న విద్యార్థులకు మంచినీరు అందించినందుకు గాను యూత్ ఫర్ సేవా సభ్యులు సతీష్ రంగంపేట మరియు పుండరీకాక్ష అదే విధంగా సర్వీస్ ఫోర్స్ ప్రతినిధులు సంతోష్ రెడ్డి జైపాల్ మరియు ఆదిల్ గౌతములకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈరోజు 330 మంది విద్యార్థులు హాస్టల్ లో ఉండి చదువుతున్న విద్యార్థులకు ఎస్ ఓ రాధికా మేడం కోరిక మేరకు ఈ ప్లాంట్ ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు 330 మందికి ఆంగ్ల డిక్షనరీలను మరియు 55 మందికి మంచినీటి స్టీల్ బాటిల్స్ అందించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు విద్యార్థినులు పాల్గొన్నారు.

# మత్స్యగిరిగుట్టకు బస్సు సర్వీసు ఏర్పాటు



**వలిగొండ ఆగస్టు 22** :యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం వేములకొండ మత్స్యగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి నిత్యం వచ్చే భక్తుల సౌకర్యం కొరకు దిల్ సుఖ్ నగర్ నుండి చౌటుప్పల్ మీదుగా బస్ సర్వీసును ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ తుమ్మల శ్రీనివాస్ వెంకటాపురం సర్పంచ్ కర్ణకంటి కలమ్మ యాదయ్య వేములకొండ సర్పంచ్ ఏర్పుల వెంకటేశం ఆలయ ధర్మకర్తలు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పులిపలుపుల రాములు మండల కో ఆప్షన్ మాజీ మెంబర్ ఎస్కే రసూల్ కసిరబోయిన లింగయ్య నరసింహ ఎలగందుల కృష్ణమూర్తి కొత్త వెంకటేశం అరూరు గ్రామ ప్రజలు నాయకులు యువకులు తదితరులు పాల్గొన్నారు.

# స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ చేసిన..

## గ్రంథాలయ చెర్మెన్ వార్ల విజయకుమార్,మున్సిపల్ చైర్మెన్ నాగులపల్లి నరేందర్



**కోస్గి మున్సిపల్, ఆగస్టు,22**:కోస్గి:తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పౌరసరఫరాల దుకాణాల రేషన్ కార్డులను కొత్తగా స్మార్ట్ రేషన్ కార్డులను జారీ చేసింది.శనివారం కోస్గి మున్సిపల్ పరిధిలోని 3వ చౌకధరల దుకాణంలో లబ్ధిదారులకు కార్డులను జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వార్ల విజయకుమార్,మున్సిపల్ చైర్మన్ నాగులపల్లి నరేందర్ లు అందించారు.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ వినియోగదారులకు అందుబాటులో ఉండేవిధంగా రేషన్ కార్డుల స్థానములో కొత్తగా స్మార్ట్ రేషన్ కార్డులు తీసుకువచ్చిందని అన్నారు.కోస్గి మున్సిపల్ లోని 16 వార్డులో నూతన స్మార్ట్ కార్డుల పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో తూము భీంరెడ్డి, మాస్టర్ శ్రీనివాస్, యెనుగుండ్ల గాయత్రి, బాలేష్, భానునాయక్, సోమశేఖర్, ఫిరోజ్, ఆర్ ఐ సుభాష్ రెడ్డి, రేషన్ డీలర్ చికినే అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

# హెచ్ ఐవీ/ఎయిడ్స్ రహిత సమాజమే లక్ష్యం: కలెక్టర్ రాజర్షి షా



**ఆదిలాబాద్, ఆగస్టు 22**::హెచ్ఐవీ /ఎయిడ్స్ నివారణకు విస్తృత అవగాహన, ముందస్తు పరీక్షలు, సకాలంలో చికిత్స అత్యంత కీలకమని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. 'ఇంటెన్సిఫైడ్ ఐఈసీ క్యాంపెయిన్–2026'లో భాగంగా ఇందిరా ప్రియదర్శిని స్టేడియం వద్ద నిర్వహించిన బైక్ ర్యాలీని శనివారం ఆయన ప్రారంభించారు. ఆగస్టు 12 నుంచి అక్టోబర్ 12 వరకు జిల్లా వ్యాప్తంగా 'ఎయిడ్స్ సురక్ష మాస్ క్యాంపెయిన్' నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అన్ని పీహెచ్‌సీల్లో హెచ్ఐవీ స్క్రీనింగ్ చేపట్టాలని, ముఖ్యంగా గర్భిణులు, క్షయ అనుమానితులకు తప్పనిసరిగా పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. పాజిటివ్‌గా నిర్ధారణైన వారి వివరాలను గోప్యంగా ఉంచి ఏఆర్‌టీ కేంద్రాల ద్వారా ఉచిత చికిత్స అందించాలని సూచించారు. ప్రజలు 1097 హెల్ప్‌లైన్, క్యూఆర్ కోడ్ సేవలను వినియోగించుకోవాలని కోరారు.

## యాలాల ఎంపిడిఓను మర్యాదపూర్వకంగా కలిసిన బిఆర్ఎస్ నాయకులు



**యాలాల మండలం, ఆగస్టు,22:** యాలాల మండల అభివృద్ధి, సంక్షేమ పథకాలపై చర్చ.దేవనూర్ బిఆర్ఎస్ యువనాయకులు కిరణ్ ,మల్లేశం.యాలాల మండల ఎంపిడిఓ శ్రీనిజని శనివారం మర్యాద పూర్వకంగా కలవడం జరిగింది. ఈ సందర్భంగా మండలంలోని పలు అభివృద్ధి పనులు మరియు ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరుపై చర్చించడం జరిగింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,,మండలంలోని గ్రామాలలో పెండింగ్ లో ఉన్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని ఎంపిడిఓని కోరడం జరిగింది. ప్రజా సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ కృషి చేస్తామని తెలిపారు.దేవనూర్ బిఆర్ఎస్ పార్టీ యువనాయకులు కిరణ్ కుమార్,మల్లేశం, నర్సిములు తదితరులు ఉన్నారు.

## అంబేద్కర్ పై కల్పిత రాతలు రాస్తే చరిత్ర క్షమించదు.

### సంగిశెట్టి క్రిస్టఫర్, ఫ్రీడమ్ ఫైటర్, సామాజిక కార్యకర్త.

**వలిగొండ, ఆగస్టు 22 :** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్‌పై అవగాహన లేకుండా, కల్పిత విషయాలతో రచనలు చేయాలని చూస్తే చరిత్ర క్షమించదని, ప్రజలు కూడా క్షమించరని ఫ్రీడమ్ ఫైటర్, సామాజిక కార్యకర్త సంగిశెట్టి క్రిస్టఫర్ అన్నారు. మీడియాతో మాట్లాడుతూ దేశంలోని పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం, కల్పిత రాతలు రాయడం సరికాదన్నారు. అంబేద్కర్ మహనీయుడి చరిత్రను వక్రీకరించే ప్రయత్నాలను ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తారని తెలిపారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చేసిన సేవలు, రాజ్యాంగ నిర్మాణంలో ఆయన పోషించిన కీలక పాత్రను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. చరిత్రను వక్రీకరించే ప్రయత్నాలు చేస్తే అవి కాలగర్భంలో కలిసిపోవడం ఖాయమని క్రిస్టఫర్ అన్నారు.

## కేంద్ర ప్రభుత్వం బీసీలను విస్మరిస్తే జాతీయ స్థాయిలో నిరసనలు చేపడతాం.

### నవంబర్ నెలలో పార్లమెంటుని ముట్టడిస్తాం.

### రాష్ట్ర బీసీ సంఘం అధ్యక్షులు జాజుల శ్రీనివాస్.




**వలిగొండ ఆగస్టు 22 :**యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రంలో ప్రెస్ క్లబ్ [illegible] అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ పాల్గొని వలిగొండ మండలం బిసి సంఘం అధ్యక్షులు సాయిని యాదగిరి సమక్షంలో ప్రెస్ మీట్ నిర్వహించి మీడియా ద్వారా మాట్లాడినారు. సెప్టెంబర్ నెల24న బీసీ సంఘాల ఆధ్వర్యంలో, బిసి కులాల జనగణన చేపట్టాలని జాతీయ స్థాయిలో శాంతి యుతంగా నిరసనలు, సెప్టెంబర్ 25న హైదరాబాదులో బీసీ సంఘాల సమక్షంలో ప్లీనరీ సమావేశాలు, నవంబరు నెలలో జాతీయస్థాయిలో బీసీ సంఘాల సమక్షంలో జాతీయ అధ్యక్షులు, రాష్ట్ర అధ్యక్షుల ఆధ్వర్యంలో పార్లమెంటు ముట్టడి కార్యక్రమం నిర్వహిస్తామని మీడియా ద్వారా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్,యువజన సంఘం జిల్లా అధ్యక్షులు వరికుప్పల మధు, వలిగొండ పట్టణం యువజన సంఘం అధ్యక్షులు నానంచర్ల రమేష్, విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షులు పాటి కొండ విక్రమ్, యువజన సంఘం జాతీయ ఉపాధ్యక్షులు నరేష్ ప్రజాపతి, గూడూరు భాస్కర్, పాల్గొన్నారు.కేంద్ర ప్రభుత్వం బీసీలను విస్మరిస్తే జాతీయ స్థాయిలో నిరసనలు చేపడతాం.

## ఎరువుల కోసం రైతులు ఆందోళన చెందవద్దు: కలెక్టర్ ప్రతిమా సింగ్



**మెదక్, ఆగస్టు 22):** జిల్లాలో రైతులకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉన్నాయని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో 3,340 మెట్రిక్ టన్నుల ఎరువులు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని శనివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఖరీఫ్-2025లో ఆగస్టు వరకు 20,758 మెట్రిక్ టన్నుల యూరియా రైతులకు సరఫరా చేయగా, ఖరీఫ్-2026లో ఇప్పటివరకు 19,045 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేసినట్లు తెలిపారు. మండలాల్లో ప్రతిరోజూ 1,000 నుంచి 1,500 బ్యాగుల వరకు అందుబాటులో ఉంచుతున్నామని పేర్కొన్నారు. ఆగస్టు 7 నుంచి అమల్లోకి వచ్చిన FSS (Framework for Fertilizer Sale) యాప్ ద్వారా ఎరువుల బుకింగ్ చేపడుతున్నామని తెలిపారు. అందుబాటులో ఉన్న ఎరువుల కంటే అధికంగా బుకింగ్ చేయడం, కొందరు రైతులు అవసరానికి మించి కొనుగోలు చేయడం వల్ల యాప్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు. సమస్యల పరిష్కారానికి కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్‌కు నివేదిక పంపినట్లు తెలిపారు. రైతులకు సౌకర్యంగా ఉండేలా యాప్‌ను డివిజన్‌ల వారీగా ఎరువుల పంపిణీకి అనుగుణంగా తీర్చిదిద్దుతున్నామని, అవసరమైతే రైతులు ఇతర మండలాల్లోనూ ఎరువులు కొనుగోలు చేసేందుకు అవకాశం ఉందని చెప్పారు. రైతులు అవసరమైన మేరకే ఎరువులను బుక్ చేసుకొని, వ్యవసాయ శాఖ సూచనలను పాటించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

# వైద్యం చేసే చేతులే న్యాయం కోసం రోడ్డెక్కాయి...

- ఆయుష్ విద్యార్థుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలి – గంట రవికుమార్
- పదేళ్లుగా అదే స్టైపెండ్.. పెరిగిన ఖర్చులు కనిపించవా?
- ఆయుష్ విద్యార్థుల పోరాటానికి బీజేపీ అండ.. న్యాయం జరిగే వరకు ఉద్యమం



**వరంగల్, ఆగస్టు 22 ::** ఆయుష్ వైద్య విద్యార్థులపై కాంగ్రెస్ ప్రభుత్వం చూపుతున్న వివక్షను వెంటనే విడనాడాలని, వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ డిమాండ్ చేశారు. ప్రభుత్వంలోని మంత్రులు, ఎమ్మెల్యేలు వ్యక్తిగత రాజకీయాలు, పదవుల పంపకాలపై చూపుతున్న శ్రద్ధను విద్యార్థుల సమస్యల పరిష్కారంపై చూపకపోవడం సిగ్గుచేటని ఆయన విమర్శించారు. వరంగల్‌లోని అనంతలక్ష్మి ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాల హౌస్ సర్జన్లు, పీజీ వైద్య విద్యార్థులు తెలంగాణ ఆయుష్ జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరవధిక ధర్నా 19వ రోజుకు చేరుకుంది. శనివారం కళాశాల ప్రాంగణంలోని నిరసన శిబిరాన్ని గంట రవికుమార్ సందర్శించి విద్యార్థులకు సంఘీభావం తెలిపారు. ఆయుష్ విద్యార్థుల పోరాటానికి బీజేపీ పూర్తి మద్దతు ఉంటుందని, న్యాయం జరిగే వరకు అండగా నిలుస్తామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అల్లోపతి వైద్యులతో సమానంగా విధులు నిర్వహిస్తున్న ఆయుష్ వైద్య విద్యార్థుల పట్ల ప్రభుత్వం వివక్ష చూపడం దారుణమన్నారు. అల్లోపతి హౌస్ సర్జన్లకు నెలకు రూ.29,972 స్టైపెండ్ చెల్లిస్తుండగా, ఆయుష్ హౌస్ సర్జన్లకు కేవలం రూ.13,754 మాత్రమే చెల్లించడం అన్యాయమని మండిపడ్డారు. ప్రభుత్వం జారీ చేసిన జీవో 77 ప్రకారం ఆయుష్ విద్యార్థులకు నెలకు రూ.30 వేల స్టైపెండ్ ఇవ్వాల్సి ఉన్నప్పటికీ దానిని అమలు చేయకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. 2016లో నిర్ణయించిన స్టైపెండ్‌ను పదేళ్లుగా మార్చకపోవడం బాధాకరమని, పెరిగిన జీవన వ్యయాలకు అనుగుణంగా తక్షణమే స్టైపెండ్‌ను పెంచాలని డిమాండ్ చేశారు. సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న స్టైపెండ్ బకాయిలను కూడా వెంటనే విడుదల చేయాలని కోరారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రతిపక్ష నేతగా ఉన్న సమయంలో ఆయుష్ విద్యార్థుల స్టైపెండ్ పెంపు కోసం అసెంబ్లీలో మాట్లాడారని, అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీలను పట్టించుకోకపోవడం విచారకరమని గంట రవికుమార్ విమర్శించారు. ఆయుష్ విద్యార్థులను రోడ్లపైకి తీసుకువచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందని ఆయన అన్నారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించకుండా నిర్లక్ష్యం చేస్తే బీజేపీ ఆధ్వర్యంలో మరింత ఉధృతంగా పోరాటం చేస్తామని హెచ్చరించారు. అల్లోపతి వైద్యులతో సమానంగా విధులు నిర్వహిస్తున్న ఆయుష్ విద్యార్థులకు న్యాయం చేయడంతో పాటు జీవో 77ను అమలు చేసి తగిన స్టైపెండ్ చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శులు బాకం హరిశంకర్, బన్న ప్రభాకర్, జిల్లా ఉపాధ్యక్షులు గడల కుమార్, బైరి నాగరాజు, ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకులు బైరి మురళీకృష్ణ, బైరి శ్యాంసుందర్, ఎరుకల రఘునారెడ్డి, మీడియా కన్వీనర్ అంకాల జనార్ధన్, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు మదాసు రాజు, బీజేవైఎం జిల్లా అధ్యక్షులు ఎర్రగొల్ల భరత్ వీర్, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎలగందుల శ్రవణ్, మండల అధ్యక్షులు మహమ్మద్ రఫీ, జిల్లా నాయకులు తాళ్లపల్లి శ్రీనివాస్, జన్ను ప్రభాకర్, ఇనుముల అరుణ్ కుమార్, మండల నాయకులు వైట్ల గణేష్, తమ్మిశెట్టి క్రాంతి కుమార్, సుంచు కేశవ్, పోశాల సతీష్, సుర శ్రీనివాస్, బీజేవైఎం నాయకులు ఆడేపు రవిరామ్, వినయ్, మున్నా తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు పారదర్శకమైన, జవాబుదారీతనంతో కూడిన పోలీస్ సేవలు అందించాలి:

- జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS
- కష్టపడి బాగా పని చేయాలి: ఎస్పీ
- ప్రతి ఒక్కరు సాంకేతిక పరిజ్ఞానం కలిగి ఉండాలి.
- వార్షిక తనిఖీలో భాగంగా నారాయణపేట రూరల్ పోలీస్ స్టేషన్ తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ.



**నారాయణపేట, ఆగస్టు,22:** నారాయణపేట: వార్షిక తనిఖీల్లో భాగంగా నారాయణపేట రూరల్ పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS శనివారం సమగ్రంగా తనిఖీ చేశారు.ముందుగా పోలీస్ సిబ్బంది పరేడ్‌ను నిర్వహించి వారి టర్న్‌అవుట్‌ను ఎస్పీ పరిశీలించారు.అనంతరం స్టేషన్ ఆవరణలో పరిశుభ్రతను పాటించాలని, ప్రహరీ చుట్టూ మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించాలని సూచించారు. పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదు చేసేందుకు వచ్చే ప్రతి వ్యక్తికి రిసెప్షన్ వద్ద తగిన విధంగా స్పందించి, ఫిర్యాదులను తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో నమోదు చేయడంతో పాటు ఫిర్యాదుదారులకు రసీదు అందించాలని ఆదేశించారు. స్టేషన్‌లోని రికార్డుల నిర్వహణ, మాల్ఖానా, ఆయుధాగారం, వివిధ విభాగాల పనితీరు, సిబ్బంది టర్న్‌అవుట్, క్రమశిక్షణ, యూనిఫాం నిర్వహణ తదితర అంశాలను ఎస్పీ క్షుణ్ణంగా పరిశీలించారు. పోలీస్ అధికారులు, సిబ్బందితో ముఖాముఖిగా మాట్లాడి వారి విధి నిర్వహణ, పనితీరు, సంక్షేమానికి సంబంధించిన అంశాలను తెలుసుకున్నారు.అనంతరం పోలీస్ స్టేషన్‌లోని సీసీటీవీ కెమెరాల పనితీరును పరిశీలించి, సీసీటీవీ వ్యవస్థను సమర్థవంతంగా వినియోగిస్తూ నేరాల నియంత్రణతో పాటు ప్రజల భద్రతను మరింత బలోపేతం చేయాలని సూచించారు. రానున్న పండుగలను దృష్టిలో ఉంచుకుని, నేరాల నియంత్రణ కొరకు VPO's ప్రతి గ్రామంలో పర్యటిస్తూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసే విధంగా ప్రజలకు అవగాహన కల్పించి కచ్చితంగా కనీసం 04 కెమెరాల ఏర్పాటు చేసుకునే విధంగా చూడాలని తెలిపారు.ఈ సందర్భంగా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS మాట్లాడుతూ... ప్రజలకు పారదర్శకమైన, సమర్థవంతమైన, జవాబుదారీతనంతో కూడిన పోలీస్ సేవలు అందించడం ప్రతి పోలీస్ అధికారి బాధ్యత అని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ, విజిబుల్ పోలీసింగ్, నిఘా పెట్రోలింగ్, కమ్యూనిటీ పోలీసింగ్‌కు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.మారుతున్న కాలానికి అనుగుణంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగించాలని, ముఖ్యంగా CCTNS 2.0, e-Sakshya, డిజిటల్ ఫోరెన్సిక్స్, సైబర్ దర్యాప్తు, సోషల్ మీడియా మానిటరింగ్ వంటి అంశాల్లో ప్రతి పోలీస్ అధికారి, సిబ్బంది తమ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. పెండింగ్ కేసులను సకాలంలో పరిష్కరించడంతో పాటు నేరస్తుల కంటే ఒక అడుగు ముందుండేలా సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించాలని ఆదేశించారు.డ్రగ్స్, గంజాయి, సైబర్ నేరాలు, ట్రాఫిక్ నియంత్రణ, రౌడీషీటర్లు, హిస్టరీషీటర్లపై నిరంతర నిఘా కొనసాగించాలని సూచించారు. మహిళలు, చిన్నారులు, వృద్ధుల భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యలను వేగంగా పరిష్కరించేలా సేవలందించాలని ఆదేశించారు.పర్యావరణ పరిరక్షణలో భాగంగా రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎస్పీ డాక్టర్ వినీత్ IPS మొక్కలు నాటారు.ఈ కార్యక్రమంలో DCRB డీఎస్పీ మహేష్, సీఐ శివశంకర్,ఎస్సై సతీష్ రెడ్డి, SB ఎస్సై భాగ్యలక్ష్మి రెడ్డి, CCS ఎస్సై విజయ్ భాస్కర్,ఎస్సై-2 మన్యం, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సురవరం సుధాకర్‌రెడ్డి ప్రథమ వర్ధంతి

### సీపీఐ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులు




**ఆలేరు, ఆగస్టు 22::** సీపీఐ ఆలేరు మండల కార్యాలయంలో శనివారం సీపీఐ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ప్రముఖ కమ్యూనిస్టు నాయకుడు కామ్రేడ్ సురవరం సుధాకర్‌రెడ్డి ప్రథమ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చెక్క వెంకటేష్ సురవరం సుధాకర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సురవరం సుధాకర్‌రెడ్డి కమ్యూనిస్టు ఉద్యమానికి చేసిన సేవలను స్మరించుకున్నారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ కార్మికులు, రైతులు, పేదలు, బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు కార్యకర్తలు, నాయకులు ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి చౌడబోయిన కనకయ్య, సీపీఐ సీనియర్ నాయకులు పేరపు రాములు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చౌడబోయిన పరుశురాములు, సీపీఐ మండల కార్యవర్గ సభ్యులు కందుల, ఏఐటీయూసీ మండల కో కన్వీనర్ గిరబోయిన స్వామి, భారత మహిళా సమాఖ్య జిల్లా సహాయ కార్యదర్శి మాధురి జానమ్మ, నాయకులు నర్సింహులు, స్వామి, రాజు, జాంగీర్‌బీ, హబీబ్ తదితరులు పాల్గొని సురవరం సుధాకర్‌రెడ్డికి నివాళులర్పించారు.

# ఎండిపోతున్న పంట పొలాలను కాపాడాలి

### సిర్పంగి స్వామి సిపిఎం మండల కార్యదర్శి.



**వలిగొండ ఆగస్టు 22 :**యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ బస్వాపురం ప్రాజెక్టులో ప్రస్తుతం నిల్వ ఉన్న నీటిని వదిలి బునాది గాని చెరువు ద్వారా వలిగొండ మండలం లో ఎండిపోతున్న పంట పొలాలను రక్షించాలని సిపిఎం మండల కార్యదర్శి సిర్పంగి స్వామి, మండల కార్యదర్శి వర్గ సభ్యులు మెరుగు వెంకటేశం,కందడి సత్తిరెడ్డి లు డిమాండ్ చేశారు. మండల పరిధిలోని కేర్చుపల్లి,మొగిలి పాక,తుర్కపల్లి గ్రామాల్లో ఆగస్టు 29,30,31 తేదీల్లో నిర్వహించనున్న సిపిఎం పాదయాత్ర కరపత్రాలను ఆవిష్క రించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బస్వాపురం ప్రాజెక్టులో నిల్వ ఉన్న నీరు విడుదల చేయడం ద్వారా భువనగిరి,వలిగొండ మండలాల తో పాటు ఆ త్మకూరు, మోత్కూర్, అ డ్డగూడూర్ మండలాలకు చెందిన పంట పొలాలకు నీరు అందుతుందని వెంటనే నీటిని విడుదల చేసి బునాదిగాని కాలువ ద్వారా రైతాంగానికి అందించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే వర్షాభావ పరిస్థితి ఏర్పడడంతో పాటు వేలాది రూపాయల ఖర్చులతో పంట పొలాలను వేసుకున్న రైతులకు భూగర్భ జలాల కొరతతో నీరందక పంట పొలాలు ఎండిపోతున్నాయని వెంటనే ప్రభుత్వం స్థానిక భువనగిరి ఆలేరు ఎమ్మెల్యేలు స్పందించి నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు ఈనెల 29,30,31 తేదీల్లో భువనగిరి నుండి హైదరాబాద్ ఇందిరా పార్క్ వరకు జరుగు పాదయాత్ర, మహాధర్నాలో రైతాంగం పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు మొగిలి పాక గోపాల్, దయ్యాల మల్లేశం, పలుసం స్వామి,జక్క రాఘవరెడ్డి, కందగట్ల సాయి రెడ్డి, సల్ల ఐలయ్య, తుమ్మల సంజీవరెడ్డి,లోడే మల్లేశం,తుమ్మల నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ లోక్ అదాలత్ విజయవంతానికి సమన్వయ సమావేశం



**రామన్నపేట ఆగస్టు 22** :యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట సీనియర్ సివిల్ జడ్జి కోర్టు హాలులో జాతీయ లోక్ అదాలత్ నిర్వహణకు సంబంధించి సమన్వయ సమావేశం నిర్వహించారు. 2026 సెప్టెంబర్ 12వ తేదీ శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్న నేపథ్యంలో, అధిక సంఖ్యలో కేసులను రాజీ మార్గంలో పరిష్కరించి, కక్షిదారులకు త్వరితగతిన న్యాయం అందించాలనే ఉద్దేశంతో ఈ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి జి. సబిత, సీనియర్ సివిల్ జడ్జి–కమ్–చైర్మన్, మండల న్యాయ సేవా కమిటీ, రామన్నపేట అధ్యక్షత వహించారు. సమావేశంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్. శిరీష, అదనపు జూనియర్ సివిల్ జడ్జి వి. రత్నకుమారి, సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ జడ్జి డి. సత్యయ్య పాల్గొన్నారు. జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ పడదగిన కేసులను గుర్తించి, సంబంధిత పక్షాలతో సమన్వయం చేసుకొని వీలైనన్ని ఎక్కువ కేసులను స్నేహపూర్వకంగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సమావేశంలో చర్చించారు. లోక్ అదాలత్ ద్వారా కేసుల పరిష్కారం వల్ల సమయం, వ్యయం ఆదా కావడంతో పాటు కక్షిదారులకు త్వరితగతిన న్యాయం లభిస్తుందని అధికారులు పేర్కొన్నారు. ఈ సమావేశానికి రామన్నపేట సబ్–ఇన్‌స్పెక్టర్, మోత్కూర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌తో పాటు కోర్టు కానిస్టేబుళ్లు హాజరయ్యారు. జాతీయ లోక్ అదాలత్ విజయవంతంగా నిర్వహించేందుకు న్యాయశాఖ, పోలీసు శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని, కేసుల పరిష్కారానికి అవసరమైన సహకారం అందించాలని సమావేశంలో సూచించారు. జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేసి, ఎక్కువ సంఖ్యలో కేసులను రాజీ ద్వారా పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు, న్యాయవాదులు మరియు కక్షిదారులు సహకరించాలని మండల న్యాయ సేవా కమిటీ, రామన్నపేట కోరింది.

# రాజీ మార్గం ద్వారా లోక్ అదాలత్ కేసుల పరిష్కారం

- **సెప్టెంబర్ 12 జాతీయ లోక్ అదాలత్ ను విజయవంతం చేయాలి**
- **జిల్లా ప్రధాన న్యాయమూర్తి బోయ శ్రీనివాసులు**






**నారాయణపేట, ఆగస్టు,22:** రాజీమార్గం ద్వారా కేసులను త్వరితగతిన పరిష్కరించేందుకు లోక్ అదాలత్ ఎంతో సమర్థవంతమైన వేదిక అని జిల్లా ప్రధాన న్యాయమూర్తి బోయ శ్రీనివాసులు అన్నారు. నారాయణపేట జిల్లా న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన కోఆర్డినేషన్ మరియు పోలీస్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ 12న నిర్వహించనున్న మూడో జాతీయ లోక్ అదాలత్ను విజయవంతం చేసేందుకు అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కక్షిదారులు లోక్ అదాలత్ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా విస్తృత అవగాహన కల్పించాలని ఆదేశించారు. జూన్ 20న నిర్వహించిన జాతీయ లోక్‌ఆదాలత్లో రాజీమార్గం ద్వారా మొత్తం 5,300 కేసులను పరిష్కరించి,నారాయణపేట జిల్లా రాష్ట్రవ్యాప్తంగా 18వ ర్యాంకు సాధించిందని తెలిపారు. ఈ విజయానికి కృషి చేసిన న్యాయమూర్తులు, పోలీసు అధికారులు మరియు సంబంధిత సిబ్బందిని అభినందించారు. సెప్టెంబర్ 12న జరిగే జాతీయ లోక్ అదాలత్ లో క్రిమినల్ కాంపౌండబుల్ కేసులు, సివిల్ కేసులు, నెగోషియబుల్ ఇన్స్ట్రుమెంట్స్ (ఎన్ఐ) యాక్ట్ కేసులు, ఎగ్జిక్యూషన్ పిటిషన్స్ (ఈపీ) కేసులు, సైబర్ నేరాల కేసులు, నాన్–బెయిలబుల్ వారెంట్ ఖైదీలకు సంబంధించిన కేసుల పరిష్కారానికి (ఎన్టీడబ్ల్యూ) కేసులను అధిక సంఖ్యలో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఆదేశించారు.అలాగే డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల పరిష్కార ప్రక్రియను యధావిధిగా కొనసాగించాలని తెలిపారు.

ఈ సమావేశంలో డీఎల్ఎస్ఏ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి వింధ్యనాయక్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి బి. సాయి మనోజ్, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కే. అవినాష్ , డీఈఈ రాములు,డి.శ్రీనివాసులు ఆర్డీఓ ఆఫీస్ సిబ్బంది, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# పాముకాటుకు గురైన విద్యార్థి కుటుంబానికి రెడ్‌క్రాస్ సొసైటీ ఆర్థిక సహాయం



**నారాయణపేట, ఆగస్టు,22:** నారాయణపేట మండలం ఎక్లాస్‌పూర్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థి 06-07-2026న పాముకాటుకు గురై మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో నిరుపేద కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలని జిల్లా కలెక్టర్, జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ అధ్యక్షురాలు సి.హెచ్. ప్రియాంక, ఐఏఎస్ ఆదేశాల మేరకు జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేశారు. విద్యార్థి కుటుంబంలోని జీవించి ఉన్న ఇద్దరు సోదరులైన 5వ తరగతి, 2వ తరగతి చదువుతున్న చిన్నారుల పేరిట ఎస్‌బీఐలో ఒక్కొక్కరికి రూ.50,000 చొప్పున రెండు ఫిక్స్‌డ్ డిపాజిట్ బాండ్లను ఏర్పాటు చేశారు. ఈ బాండ్లను విద్యార్థుల తల్లిదండ్రులు పిచ్చిగుంట్ల గురునాథ్ దంపతులకు శనివారం జిల్లా కలెక్టరేట్ లో కలెక్టర్ అందజేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సి.హెచ్. ప్రియాంక మాట్లాడుతూ, బాధిత కుటుంబానికి అండగా నిలిచి ఆర్థిక సహాయం అందించిన జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులను అభినందించారు. ఆపదలో ఉన్న కుటుంబాలకు మానవతా దృక్పథంతో సహాయ సహకారాలు అందించడంలో రెడ్‌క్రాస్ సొసైటీ ముందుండాలని సూచించారు.అనంతరం జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యత్వ నమోదు, జిల్లా బాడీ ఎన్నికల నిర్వహణ తదితర అంశాలపై సమావేశంలో సమీక్షించారు.ఈ కార్యక్రమంలో జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ కొట్టం సుదర్శన్ రెడ్డి, వైస్ చైర్మన్ సరఫ్ నాగరాజ్, కోశాధికారి డాక్టర్ మదన్‌మోహన్ రెడ్డి, స్టేట్ మేనేజింగ్ కమిటీ సభ్యులు ఆత్మారం ఎడ్కే, ప్యాట్రన్ శ్రీ హరినారాయణ భట్టాడ్, YRC/JRC కోఆర్డినేటర్లు జొన్నల సుభాష్, నందుపాటిల్, సభ్యులు శ్రీనివాస్ లాహోటి, యూసుఫ్ తాజ్ తదితరులు పాల్గొన్నారు.

# నీటి కుంటలతో భూగర్భ జలాల అభివృద్ధి: కలెక్టర్ దివాకర టీఎస్

**ఖమ్మం/కూసుమంచి, ఆగస్టు 22::** రైతుల పొలాల్లో నిర్మిస్తున్న నీటి కుంటలు (ఫారం పాండ్లు) వర్షపు నీటి సంరక్షణతో పాటు భూగర్భ జలమట్టం పెంపునకు ఎంతో దోహదపడతాయని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అన్నారు.

శనివారం కూసుమంచి మండల కేంద్రానికి చెందిన రైతు అర్వపల్లి వెంకటేశ్వర్లు పొలంలో నిర్మిస్తున్న నీటి కుంటను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నీటి కుంటల ద్వారా వర్షపు నీరు భూమిలోకి ఇంకి సమీపంలోని బోర్లు, బావుల్లో జలమట్టం పెరుగుతుందని, భవిష్యత్తులో మత్స్య సంపద అభివృద్ధికీ అవకాశం ఉంటుందని తెలిపారు.

రైతులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని నీటి సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. పనులను నాణ్యతతో చేపట్టి రైతులకు ప్రయోజనం కలిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సైదులు, సర్పంచ్ కొండ కృష్ణవేణి, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# పిల్లల హక్కుల పరిరక్షణలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

**గౌరవ పి.డి.జే. లాల్ సింగ్ శ్రీనివాస నాయక్.**




**వికారాబాద్, ఆగస్టు,22:** పిల్లల హక్కులను పరిరక్షించడం, వారికి సురక్షితమైన వాతావరణం కల్పించడం, అవసరమైన సమయంలో న్యాయ సహాయం మరియు రక్షణ అందించడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని వికారాబాద్ జిల్లా గౌరవ ప్రధాన న్యాయమూర్తి (PDJ) మరియు జిల్లా న్యాయ సేవా సంస్థ (DLSA) చైర్మన్ లాల్ సింగ్ శ్రీనివాస నాయక్ అన్నారు.NALSA Child Friendly Legal Services for Children Scheme, 2024లో భాగంగా వికారాబాద్ జిల్లా న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం వికారాబాద్‌లో చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్లుగా నామినేట్ చేయబడిన ఉపాధ్యాయులకు ఒకరోజు సెన్సిటైజేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గౌరవ పి.డి.జే. లాల్సింగ్ శ్రీనివాస నాయక్, అతిథిగా జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా,ఐపిఎస్ ఇతర అధికారులు హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా పి.డి.జే. మాట్లాడుతూ, ప్రతి చిన్నారికి ఉచిత న్యాయ సహాయం, రక్షణ, కౌన్సెలింగ్, పునరావాసం మరియు న్యాయం బాలల అనుకూల విధానంలో అందేలా చూడటమే Child Friendly Legal Services for Children Scheme ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు. పిల్లలు న్యాయ వ్యవస్థను చూసి భయపడకుండా, తమ సమస్యలను స్వేచ్ఛగా వెల్లడించే విధంగా వారికి భరోసా కల్పించాలని సూచించారు.పాఠశాలల్లో పిల్లలపై జరిగే వేధింపులు, బాల కార్మిక వ్యవస్థ, బాల్య వివాహాలు, లైంగిక దాడులు, సైబర్ నేరాలు తదితర సమస్యలను ఉపాధ్యాయులు ముందుగానే గుర్తించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని ఆయన సూచించారు. పిల్లల హక్కుల పరిరక్షణ కోసం పోలీస్, న్యాయ సేవా సంస్థ, విద్య, సంక్షేమ, కార్మిక శాఖలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు.వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, IPS మాట్లాడుతూ, పిల్లల భద్రత విషయంలో ఉపాధ్యాయులు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. బాలలపై జరిగే నేరాలు, బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ, డ్రగ్స్, సైబర్ నేరాలు తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఏదైనా సమస్యను గుర్తించిన వెంటనే పోలీస్ మరియు సంబంధిత చైల్డ్ ప్రొటెక్షన్ అధికారులకు సమాచారం అందించాలని తెలిపారు.పై కార్యక్రమంలో అదనపు జిల్లా మరియు సెషన్స్ జడ్జి పి. ప్రదీప్ నాయక్, జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి ఏ. రాధిక, సీనియర్ సివిల్ జడ్జి ఎం. వెంకటేశ్వర్లు, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఆర్. శాంతిలత, అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎస్. వైష్ణవి, జిల్లా సంక్షేమ అధికారి కె. కాంతారావు, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ వల్యా నాయక్, జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.డి. అబ్దుల్ ఘని, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి ఎస్. శ్రీకాంత్ , నామినేటెడ్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్లు (ఉపాధ్యాయులు), DLSA సిబ్బంది, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

# తహసీల్దార్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ భవనాలకు మంత్రి పొంగులేటి శంకుస్థాపన



**నిజామాబాద్, ఆగస్టు 22:(** నిజామాబాద్ జిల్లాలో వివిధ మండలాలకు మంజూరైన నూతన తహసీల్దార్ కార్యాలయ భవనాలతో పాటు నిజామాబాద్ రూరల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ భవన నిర్మాణాలకు రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శనివారం శంకుస్థాపన చేశారు.అలాగే గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. కార్యక్రమాల్లో ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, ఎమ్మెల్యేలు భూపతి రెడ్డి, ధన్పాల్ సూర్యనారాయణ, రెవెన్యూ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ లోకేష్ కుమార్, స్పెషల్ సెక్రటరీ రాజీవ్ గాంధీ హనుమంతు, హౌసింగ్ ఎండీ గౌతమ్, కలెక్టర్ భవేష్ మిశ్రా తదితరులు పాల్గొన్నారు.

# జీవో 97ను రద్దు చేయాలి

- **పాలిటెక్నిక్ విద్యార్థుల ఆందోళనలకు సంపూర్ణ మద్దతు**
- **ఏరన్ పల్లి శ్రీనివాస్ తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక వికారాబాద్ జిల్లా అధ్యక్షులు**
- **పాలిటెక్నిక్ విద్యను గతంలో మాదిరిగానే టెక్నికల్ ఎడ్యుకేషన్ పరిధిలో కొనసాగించాలి**
- **పాలిటెక్నిక్ విద్య పేద,మధ్య తరగతి విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలకు మార్గం**



**కొడంగల్ మున్సిపల్(మం) ఆగస్టు,22:** తెలంగాణలో పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్తును అయోమయంలో కి నెట్టేలా ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 97ను ఎలాంటి అలసత్వం లేకుండా రద్దు చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులు ఎర్రన్ పల్లి శ్రీనివాస్ అన్నారు. పాలిటెక్నిక్ కళాశాలలను గతంలో మాదిరిగానే టెక్నికల్ ఎడ్యుకేషన్ పరిధిలోనే కొనసాగించాలని కోరారు. పాలిటెక్నిక్ విద్య పేద, మధ్యతరగతి విద్యార్థులకు సాంకేతిక విద్యతోపాటు ఉన్నత విద్య,ఉద్యోగ అవకాశాలకు బలమైన మార్గమని అన్నారు.విద్యార్థులు,తల్లిదండ్రులు అధ్యాపకులు,విద్యారంగా నిపుణులతో చర్చలు జరుపుకుండా ప్రభుత్వం ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకోవడం సరైనది కాదన్నారు.విద్యాశాఖ బాధ్యతల నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి విద్యార్థుల ఆందోళనలను గుర్తించి జీవో నెంబర్ 97 ను ఉపసంహరించు కోవలన్నారు.

# డీ-అడిక్షన్ కేంద్రాల ఏర్పాటుకు స్వచ్ఛంద సంస్థల నుంచి దరఖాస్తులు



**పెద్దపల్లి, ఆగస్టు 22:)** :జిల్లాలో 2026–27 ఆర్థిక సంవత్సరానికి జాతీయ మాదకద్రవ్య డిమాండ్ తగ్గింపు కార్యాచరణ పథకం కింద డీ–అడిక్షన్ కేంద్రాల ఏర్పాటు, నిర్వహణకు అర్హత కలిగిన స్వచ్ఛంద సంస్థల నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. మాదకద్రవ్యాల వినియోగ నియంత్రణతో పాటు బాధితులకు చికిత్స, పునరావాసం, అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు ఆసక్తిగల అర్హత కలిగిన సంస్థలు కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖకు చెందిన ఈ–అనుదాన్ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు పెద్దపల్లి జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయాన్ని లేదా 9440852495 నంబర్‌ను సంప్రదించాలని కలెక్టర్ తెలిపారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే 'పల్లె పల్లెకు పొన్నం అన్న' లక్ష్యం

## మంత్రి పొన్నం ప్రభాకర్

**సిద్దిపేట, ఆగస్టు 22:,:** హుస్నాబాద్ నియోజకవర్గంలోని గ్రామాల్లో ప్రజా సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకుని పరిష్కరించడమే 'పల్లె పల్లెకు పొన్నం అన్న – పల్లె పల్లెలో ప్రజా పాలన' కార్యక్రమం లక్ష్యమని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.

అక్కన్నపేట మండలం పెద్ద తండాలో రూ.2.05 కోట్లతో నిర్మించనున్న బీటీ రోడ్డుకు మంత్రి శంకుస్థాపన చేసి, రూ.20 లక్షలతో నిర్మించిన అంతర్గత సీసీ రోడ్లను ప్రారంభించారు. గ్రామంలో ఇప్పటివరకు సుమారు రూ.3.50 కోట్ల అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించి, వాటి పరిష్కారానికి అధికారులను ఆదేశించారు. జలసిరి కింద ఇంటింటా ఇంకుడు గుంతల నిర్మాణానికి రూ.6,500, పంట కుంటలకు రూ.1.30 లక్షల వరకు సహాయం అందిస్తున్నట్లు చెప్పారు. రైతులు ఆయిల్‌పామ్ సాగుపై దృష్టి పెట్టాలని సూచించారు. గౌరవెల్లి ప్రాజెక్టును పూర్తి చేసి ప్రతి గ్రామానికి సాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ నెల 31 వరకు అర్హులు పెన్షన్లకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అనంతరం మోత్కులపల్లి, మంచినీళ్ల తాండ, కేశవాపూర్, గొల్లపల్లి, మల్లంపల్లి, చౌటపల్లి గ్రామాల్లోనూ మంత్రి పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు.

## ప్యానెల్ ఇన్ స్పెక్షన్ వన్ డే ఓరియంటేషన్ కార్యక్రమం



**వికారాబాద్, ఆగస్టు,22:**వికారాబాద్ జిల్లా విద్యాశాఖ అధికారి అబ్దుల్ గని ఆధ్వర్యంలో జిల్లా స్థాయి ప్యానెల్ ఇన్‌స్పెక్షన్ సభ్యులు, డీఆర్‌పీలకు వన్‌డే ఓరియంటేషన్ ప్యానెల్ ఇన్‌స్పెక్షన్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం జిల్లా ఉన్నత పాఠశాల బాయ్స్, వికారాబాద్లో జరిగింది. శిక్షణలో ప్యానెల్ ఇన్‌స్పెక్షన్‌కు సంబంధించిన వివిధ అంశాలపై సమగ్రంగా చర్చించారు. పాఠశాలల సందర్శన సందర్భంగా పరిశీలించాల్సిన అంశాలు, విద్యా ప్రమాణాలు, విద్యార్థుల అభ్యసన స్థాయి, బోధనా ప్రక్రియ, పాఠశాల నిర్వహణ తదితర అంశాలపై సభ్యులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఏ ఎం ఓ రామ్ మస్త ప్యానెల్ ఇన్‌స్పెక్షన్ సభ్యులు, డిఆర్పీలు గౌరారం గోపాల్ నడిమింటి మల్లేష్ జీవన్ కుమార్ ప్రభాకర్ దీపక్ మురారి నరసింహారెడ్డి, శంకర్ పవన్ కుమార్ పాల్గొని పలు అంశాలపై చర్చించారు. ప్యానెల్ ఇన్‌స్పెక్షన్ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించి, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల మెరుగుదలకు కృషి చేయాలని సూచించారు.

## విద్యార్థుల భవిష్యత్తు కోసం 100 మంది విద్యా వాలంటీర్లు



**మహబూబ్‌నగర్, ఆగస్టు 22:** :విద్యార్థుల విద్యా ప్రమాణాలను మెరుగుపరిచి, వారి భవిష్యత్తును తీర్చిదిద్దేందుకు 'శతశాతం' కార్యక్రమంలో భాగంగా విద్యా వాలంటీర్ల వ్యవస్థను విస్తరిస్తున్నట్లు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. తొలుత 35 మంది వాలంటీర్లతో చేపట్టిన ప్రయోగం మంచి ఫలితాలు ఇవ్వడంతో ప్రస్తుతం 100 మందితో కార్యక్రమాన్ని విస్తరించినట్లు చెప్పారు. విద్యా వాలంటీర్లు విద్యార్థుల హాజరు, చదువు, హోంవర్క్, ప్రవర్తన, సమస్యలను నిరంతరం గమనిస్తూ ఉపాధ్యాయులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. 3డీ యానిమేషన్, డిజిటల్ లెర్నింగ్, డిజిటల్ బోర్డుల వంటి ఆధునిక పద్ధతులతో విద్యార్థుల్లో చదువుపై ఆసక్తి పెంచుతున్నామని పేర్కొన్నారు. మహబూబ్‌నగర్‌లో అమలు చేస్తున్న ఈ విధానాన్ని దేశానికి ఆదర్శంగా నిలపడమే లక్ష్యమన్నారు. జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా మాట్లాడుతూ 'శతశాతం' విద్యా వాలంటీర్ల కార్యక్రమం అద్భుతమైన ప్రయత్నమని ప్రశంసించారు. గ్రామస్థాయి నుంచి విద్యాభివృద్ధికి ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని పేర్కొన్నారు.

## జీవో నెంబర్ 97ను రద్దు చేయాలి.

### బీఆర్ఎస్వి ఆధ్వర్యంలో భారీ నిరసన.



**కోస్గి మున్సిపల్, ఆగస్టు,22:**
పాలిటెక్నిక్ కళాశాలను శక్తి లో విలీనం చేయకుండా తక్షణమే నిలిపివేయాలని బీఆర్ఎస్ వి ఆధ్వర్యంలో పాలిటెక్నిక్ కళాశాల ఎదుట నిరసన వ్యక్తం చేశారు.దౌల్తాబాద్ మండల మాజీ జడ్పీటీసీ కోట్ల మహిపాల్, బీఆర్ఎస్ వి నారాయణ పేట జిల్లా అధ్యక్షులు కోరం శివరాజ్ రెడ్డి,కోస్గి బిఆర్ఎస్ ఇంచార్జ్ టి వెంకట్ నర్సింలు మాట్లాడుతూ,రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన శక్తి పథకం జీవో 97ను వెంటనే రద్దు చేయాలని అన్నారు.స్కిల్ యూనివర్సిటీ పేరుతో మోసం చేస్తూ పాలిటెక్నిక్ విద్యాకు తీవ్రమైన అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు.భవిష్యత్తులో పాలిటెక్నిక్ ఎడ్యుకేషన్ విద్యార్థులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని అన్నారు.ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ విద్యార్థులు ఇంజనీర్లు అయ్యే అవకాశాన్ని కాలరాస్తున్నారని ప్రభుత్వం పై మండిపడ్డారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కోనేరు సాయప్ప, బెజ్జు నర్సింలు,శ్రీనివాస్, పకిరప్ప, చెనప్ప, కొలు నరేష్ ,వినయ్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## "వికారాబాద్ రక్షణ నేత్రం" కార్యక్రమంలో భాగంగా

**వికారాబాద్, ఆగస్టు,22:**గ్రామీణ ప్రాంతాల్లో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, ప్రజలకు మరింత మెరుగైన పోలీస్ సేవలు అందించాలనే లక్ష్యంతో వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, ఐపీఎస్ వినూత్న ఆలోచనతో అమలు చేస్తున్న "వికారాబాద్ రక్షణ నేత్రం" కార్యక్రమంలో భాగంగా నవాబ్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఏర్పాటు చేసిన 110 సీసీటీవీ కెమెరాలను జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, ఐపీఎస్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. నవాబ్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని యావపూర్ గ్రామంలో 24, నవాబ్‌పేట్‌లో 16, గొల్లగూడలో 12, పులుమామిడి గ్రామంలో 14, కొజ్జావనం పల్లిలో 16, ముబారక్‌పూర్‌లో 28 మొత్తం 110 సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసి పోలీస్ స్టేషన్‌కు అనుసంధానం చేశారు. దీంతో ఆయా గ్రామాల్లోని ప్రధాన ప్రాంతాలు, రహదారులు, కూడళ్లలో జరుగుతున్న కార్యకలాపాలను పోలీస్ స్టేషన్ నుంచే నిరంతరం పర్యవేక్షించే అవకాశం ఏర్పడింది.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ "వికారాబాద్ రక్షణ నేత్రం" కార్యక్రమం ద్వారా జిల్లాలోని గ్రామాలు, పట్టణాల్లో సీసీటీవీ నిఘా వ్యవస్థను మరింత విస్తరించి, సాంకేతిక పరిజ్ఞానాన్ని పోలీసింగ్‌లో సమర్థవంతంగా వినియోగిస్తున్నామని తెలిపారు. సీసీటీవీ కెమెరాలు నేరాలను అరికట్టడంలోనే కాకుండా, నేరం జరిగిన అనంతరం నిందితులను గుర్తించడం, వారి కదలికలను పసిగట్టడం, నేర పరిశోధనలో కీలక ఆధారాలను సేకరించడంలో ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు.గ్రామాల్లో ఏర్పాటు చేసిన సీసీటీవీ కెమెరాల ద్వారా శాంతిభద్రతల పర్యవేక్షణ, అనుమానాస్పద వ్యక్తులు మరియు వాహనాల కదలికల గుర్తింపు, పోలీసులకు మరింత సహకారం అందుతుందని ఎస్పీ తెలిపారు.

## ప్రత్యామ్నాయ రబీ పంటల వైపు రైతులను ప్రోత్సహించాలి

**జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ**



**వికారాబాద్, ఆగస్టు,22:**వికారాబాద్ జిల్లా కలెక్టర్ మరియు జిల్లా వ్యవసాయ అధికారి ఆధ్వర్యంలో జిల్లాలోని వ్యవసాయ శాఖ ADAs, MAOs తో ఈరోజు సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో పంటల సాగు పరిస్థితి, పప్పుధాన్యాల విత్తనాల పంపిణీ, డిజిటల్ క్రాప్ సర్వే మరియు వనమహోత్సవం కార్యక్రమాల పురోగతిపై సమీక్ష నిర్వహించారు.

**1 వరి సాగు విస్తీర్ణాన్ని తగ్గించేందుకు చర్యలు:**

జిల్లాలో ప్రస్తుతం సాగు చేసిన వరి విస్తీర్ణాన్ని సమీక్షించి, ఇకపై వరి సాగు విస్తీర్ణం పెరగకుండా రైతులకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటికే వరి సాగుకు ఉద్దేశించిన మిగిలిన భూములను ముందస్తు రబీ పంటలు, ముఖ్యంగా కుసుమ, పప్పు దినుసులు మరియు వేరుశెనగ వంటి పంటల సాగు వైపు మళ్లించేలా రైతులకు సూచనలు, సాంకేతిక మార్గదర్శకాలు అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధుల సహకారం తీసుకుని గ్రామస్థాయిలో విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు.

**2 మిషన్ ఆత్మనిర్భర్ – పప్పుధాన్యాల విత్తనాల పంపిణీ:**

ఆత్మనిర్భర్ భారత్ మిషన్ 2026 కింద జిల్లాకు అందుబాటులో ఉంచిన కంది, మినుము మరియు పెసర విత్తనాలను ముందస్తు రబీ సాగుకు ఆగస్టు 24 మరియు 25 తేదీలలో యుద్ధ ప్రాతిపదికన రైతులకు పంపిణీ చేసి, ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్దేశిత లక్ష్యాలను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

**3 డిజిటల్ క్రాప్ సర్వే:**

జిల్లాలోని అన్ని రెవెన్యూ గ్రామాలకు సంబంధించి ప్రైవేట్ సర్వేయర్లను ఆగస్టు 24, 2026 నాటికి గుర్తించి నియమించే ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.డిజిటల్ క్రాప్ సర్వేను నిర్ణీత గడువులో, సమర్థవంతంగా పూర్తి చేసేందుకు క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

**4 వనమహోత్సవం కార్యక్రమం:**

వనమహోత్సవం కార్యక్రమంలో నిర్దేశించిన లక్ష్యాలను సాధించేందుకు ఎంపిడిఓలు మరియు డిఆర్డీఓ లతో సమన్వయం చేసుకుని అవసరమైన మొక్కలను సమయానికి సమకూర్చి, వాటిని నిర్ణీత ప్రదేశాల్లో నాటడం ద్వారా లక్ష్యాలను సాధించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

**5 నకిలీ DAP, ఎరువులు మరియు విత్తనాల నియంత్రణ:**

మండల స్థాయిలో ఏర్పాటు చేసిన టాస్క్‌ఫోర్స్ బృందాల ద్వారా నకిలీ డిఏపి, నకిలీ ఎరువులు మరియు నకిలీ విత్తనాల అక్రమ విక్రయాలు, నిల్వలపై నిరంతరం తనిఖీలు నిర్వహించాలని ఎంఏఓ లను ఆదేశించారు. ఈ విషయంలో అప్రమత్తంగా వ్యవహరిస్తూ, అనుమానాస్పద నిల్వలు లేదా అక్రమ విక్రయాలు గుర్తించిన వెంటనే చట్టపరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. తనిఖీలను సమర్థవంతంగా నిర్వహించేందుకు పోలీస్, రెవెన్యూ మరియు ఎంపిడిఓ శాఖల అధికారులతో సమన్వయం చేసుకుని, నకిలీ డీఏపీ, ఎరువులు మరియు విత్తనాల సరఫరా, విక్రయాలను అరికట్టేందుకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ ప్రభుత్వ కార్యక్రమాల లక్ష్యాలను నిర్ణీత గడువులో సాధించేలా చర్యలు తీసుకోవాలని సమావేశంలో స్పష్టం చేశారు.

## కొత్తపల్లిలో డెంగ్యూ కలకలం

- **ముమ్మరంగా ఇంటింటా ఫీవర్ సర్వే**
- **ప్రజలు అందుబాటులో ఉండి సహకరించాలి: హెల్త్ సూపర్‌వైజర్ దయానంద్**



**కోటగిరి, ఆగష్టు 22 :** :- మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామంలో డెంగ్యూ కేసు నమోదు కావడం స్థానికంగా కలకలం రేపింది. ఇటీవల హైదరాబాద్ నుంచి కొత్తపల్లి గ్రామానికి వచ్చిన ఒక బాలుడికి తీవ్రమైన జ్వరం రావడంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం నిజామాబాద్‌లోని ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షలు నిర్వహించగా బాలుడికి డెంగ్యూ పాజిటివ్‌గా ధ్రువీకరణ అయ్యింది. ఈ ఘటనతో తీవ్రంగా అప్రమత్తమైన వైద్య ఆరోగ్య శాఖ శనివారం గ్రామంలో ఇంటింటా ప్రత్యేక సర్వే ప్రారంభించింది. డెంగ్యూ సహా ఇతర సీజనల్ వ్యాధులు ప్రబలకుండా హెల్త్ సూపర్‌వైజర్ దయానంద్ ఆధ్వర్యంలో ఆరోగ్య సిబ్బంది బృందాలుగా ఏర్పడి ప్రతి ఇంటినీ సందర్శిస్తున్నారు. ఈ సందర్భంగా హెల్త్ సూపర్‌వైజర్ దయానంద్ మాట్లాడుతూ, వర్షాకాలంలో ప్రబలే సీజనల్ వ్యాధుల నుండి ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకుంటూ తమను తాము కాపాడుకోవాలని సూచించారు. గ్రామంలో డెంగ్యూ కేసు వెలుగుచూడటంతో అత్యవసరంగా ఈ సర్వే చేపడుతున్నామని, ఆరోగ్య సిబ్బంది ఇళ్లకు వచ్చినప్పుడు ప్రజలు అందుబాటులో ఉండి పూర్తి సమాచారం అందించి సహకరించాలని ఆదేశించారు. సర్వేలో భాగంగా సిబ్బంది జ్వరం, ఒళ్లు నొప్పులతో బాధపడుతున్న వారిని గుర్తించి వెంటనే రక్త పరీక్షలు నిర్వహిస్తున్నారు. అలాగే పరిసరాల్లో నీరు నిల్వ ఉండే పాత టైర్లు, కొబ్బరి బొబ్బలు, పూల తొట్టెలను పరిశీలించి దోమల లార్వాను అంతమొందించేందుకు మందులు పిచికారీ చేస్తున్నారు. ఇళ్ల చుట్టూ నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, కాచి చల్లార్చిన నీటినే తాగాలని, రాత్రి వేళల్లో దోమతెరలు ఉపయోగించి సీజనల్ వ్యాధుల నుండి కాపాడుకోవాలని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ఎవరికైనా జ్వరం లేదా ఇతర అనారోగ్య లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే సమీప ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని కోరారు. ఈ సర్వే కార్యక్రమంలో ఏఎన్ఎమ్‌లు, ఆశా కార్యకర్తలు మరియు పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆర్మీ విశ్రాంత ఉద్యోగి గంగాధర్ కు ఘన సన్మానం



**పోతంగల్,ఆగష్టు 22,:** :- దేశ రక్షణలో సుదీర్ఘకాలం సేవలందించి విధులనుంచి పదవీ విరమణ పొందిన ఇండియన్ ఆర్మీ ఉద్యోగి గొడుగు గంగాధర్‌కు స్వగ్రామమైన పోతంగల్ మండలం హంగార్గాలో శనివారం ఘన సన్మానం జరిగింది. స్థానిక ప్రాథమిక ఉన్నత పాఠశాల ఆవరణలో సర్పంచ్ నీరడి ఉదయ్‌భాస్కర్, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో ఈ సన్మాన కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు.ఈ సందర్భంగా గంగాధర్ – దైవశాల దంపతులను శాలువాలు, పూలమాలలతో సత్కరించి, జ్ఞాపికను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఆర్మీలో విధులు నిర్వర్తిస్తున్న సమయంలోనూ గ్రామాభివృద్ధికి, పలు కార్యక్రమాలకు గంగాధర్ అందించిన సహకారాన్ని గ్రామస్థులు కొనియాడారు. సన్మాన మహోత్సవంలో భాగంగా గంగాధర్ తన ఉదారతను చాటుకుంటూ తాను చదువుకున్న పాఠశాల విద్యార్థులకు ఉచితంగా దుస్తులను పంపిణీ చేశారు. పిల్లలను సైన్యంలో చేర్పించేందుకు తల్లిదండ్రులు వెనుకాడుతున్న రోజుల్లో, గంగాధర్ తల్లి చూపిన ధైర్యం, ప్రోత్సాహం ఎందరికో ఆదర్శమని సభలో పలువురు గుర్తుచేసుకున్నారు. గంగాధర్ చిన్ననాటి మిత్రులు ఆయనను ఆప్యాయంగా పలుకరించి, హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గోపాల్, మాజీ ఏఎంసీ చైర్మన్ నీరడి గంగాధర్, గ్రామ పెద్దలు వీరుగౌండ, పంజా గోవింద్, ఈర్వంత్, గొడుగు సుభాష్, ఆర్మీ విశ్రాంత ఉద్యోగులు విశ్వంభర్ పటేల్, జంగం సంజీవ్ కుమార్, పాఠశాల హెచ్ఎం శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యాయ బృందం, బాల్యమిత్రుడు గంధపు చిరుత దత్తు, కుటుంబ సభ్యులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## జేఎన్‌పీటీ నుంచి వడోదరాకు తొలి డబుల్-స్టాక్ లాంగ్-హాల్ కంటైనర్ రైలు

**ముంబై, ఆగస్టు 22**
: భారత రైల్వే సరుకు రవాణా రంగంలో మరో కీలక మైలురాయిని సాధించింది. జేఎన్‌పీటీ (ముంబై) నుంచి వడోదరా డివిజన్‌లోని వార్నామా కాంకార్ జీసీటీ టెర్మినల్‌కు తొలిసారిగా డబుల్–స్టాక్ లాంగ్–హాల్ కంటైనర్ రైలును విజయవంతంగా నడిపింది. ఆగస్టు 21న రాత్రి 7 గంటలకు జేఎన్‌పీటీ నుంచి బయలుదేరిన ఈ రైలు సుమారు 422 కిలోమీటర్లు ప్రయాణించింది. రెండు డబుల్–స్టాక్ రేక్‌లను కలిపి ఏర్పాటు చేసిన ఈ లాంగ్–హాల్ రైలులో మొత్తం 360 TEUs కంటైనర్లు, 3,922 టన్నుల సరుకు రవాణా చేశారు. ఒక్కో రేక్‌లో 45+1 కంటైనర్ల చొప్పున ఏర్పాటు చేశారు. ఒకే రైలులో భారీ సంఖ్యలో కంటైనర్లను తరలించడం వల్ల పోర్టులు, టెర్మినళ్లలో రద్దీ తగ్గడంతో పాటు రోలింగ్ స్టాక్ అవసరం తగ్గుతుంది. రూట్ సామర్థ్యం మెరుగ్గా వినియోగించుకోవడం, సరుకు రవాణా సమయం, వ్యయాన్ని తగ్గించడం వంటి ప్రయోజనాలు కలుగుతాయని రైల్వే తెలిపింది. విద్యుత్‌తో నడిచే ఈ రైలు ద్వారా పెద్ద సంఖ్యలో ట్రక్కుల ద్వారా తరలించాల్సిన సరుకును ఒకేసారి రవాణా చేయవచ్చు. పర్యావరణహిత సరుకు రవాణాకు దోహదపడుతుందని భారత రైల్వే పేర్కొంది.

## నీటి కుంటలతో భూగర్భ జలాల అభివృద్ధి: కలెక్టర్ దివాకర టీఎస్



**ఖమ్మం/కూసుమంచి, ఆగస్టు 22::**రైతుల పొలాల్లో నిర్మిస్తున్న నీటి కుంటలు (ఫారం పాండ్లు) వర్షపు నీటి సంరక్షణతో పాటు భూగర్భ జలమట్టం పెంపునకు ఎంతో దోహదపడతాయని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అన్నారు.

శనివారం కూసుమంచి మండల కేంద్రానికి చెందిన రైతు అర్వపల్లి వెంకటేశ్వర్లు పొలంలో నిర్మిస్తున్న నీటి కుంటను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నీటి కుంటల ద్వారా వర్షపు నీరు భూమిలోకి ఇంకి సమీపంలోని బోర్లు, బావుల్లో జలమట్టం పెరుగుతుందని, భవిష్యత్తులో మత్స్య సంపద అభివృద్ధికీ అవకాశం ఉంటుందని తెలిపారు. రైతులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని నీటి సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. పనులను నాణ్యతతో చేపట్టి రైతులకు ప్రయోజనం కలిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సైదులు, సర్పంచ్ కొండ కృష్ణవేణి, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# జానపద కళలే మన జాతి సంపద..

- ఓరుగల్లు కళా వైభవాన్ని కాపాడుకుందాం...
- అంతరించిపోతున్న కళలకు ఊపిరిపోసి భావితరాలకు అందించాలి – ఈగ మల్లేశం
- ఓరుగల్లు సాంస్కృతిక వైభవాన్ని భావితరాలకు అందించాలి



**హన్మకొండ, ఆగస్టు 22 ::** ఓరుగల్లు వీరత్వానికి, అద్భుతమైన జానపద కళలకు పురిటిగడ్డగా, సాంస్కృతిక వైభవానికి పుట్టినిల్లుగా నిలిచిందని ఉభయ తెలుగు రాష్ట్రాల కళాకారుల సంక్షేమ మండలి అధ్యక్షులు, కేంద్ర ఖాదీ మరియు చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం అన్నారు. హన్మకొండ పబ్లిక్ గార్డెన్‌లోని నేరెళ్ల వేణుమాధవ్ కళా ప్రాంగణంలో తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ, జేబీ కల్చరల్ ఆర్ట్ సొసైటీ (వరంగల్) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "ఓరుగల్లు జానపదాల స్వరాల ఝల్లు–కాకతీయ సకల కళల జాతర" ఉత్సవాలను ఆయన ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈగ మల్లేశం మాట్లాడుతూ ఓరుగల్లు గడ్డ ఘనమైన కళలకు, అద్భుతమైన సంస్కృతికి నిలయమని అన్నారు. తెలంగాణ జానపద కళలు, కాకతీయుల కళా వైభవం కేవలం వినోదం కోసం మాత్రమే కాదని, అవి మన జాతి సంపద అని పేర్కొన్నారు. అంతరించిపోతున్న జానపద కళలను, కాకతీయుల వైభవాన్ని పరిరక్షించి భావితరాలకు భద్రంగా అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. తెలంగాణ జానపద వైభవాన్ని చాటిచెప్పేలా కళాకారులు ప్రదర్శిస్తున్న నైపుణ్యం అభినందనీయమని, ఇలాంటి సాంస్కృతిక ఉత్సవాలు ఓరుగల్లు ఘనకీర్తిని ప్రపంచానికి మరోసారి చాటిచెబుతాయని తెలిపారు. నేటి యువతలో కొందరు చెడు సావాసాలకు బానిసలై క్షణికావేశంలో తమ భవిష్యత్తును అంధకారంలోకి నెట్టుకుంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మన ఇతిహాసాలు, కళలు, సంప్రదాయాలు, సంస్కారం యువతకు మంచి మార్గాన్ని చూపించడంలో ఎంతో దోహదపడతాయని అన్నారు. తల్లిదండ్రులు పురాణాలు, చరిత్ర, ప్రాచీన కళలు, సంస్కృతికి సంబంధించిన విషయాలను భావితరాలకు అందించేలా ముఖ్యపాత్ర పోషించాలని సూచించారు. స్వాతంత్ర్యం వచ్చి 80 సంవత్సరాలు గడిచినా తెలంగాణలో ఇప్పటికీ లిపి లేని కళారూపాలు 103 రకాలు ఉన్నాయని, వాటిపై ఆధారపడి అనేక మంది కళాకారులు తమ జీవనాన్ని కొనసాగిస్తున్నారని ఈగ మల్లేశం తెలిపారు. కళలనే జీవనాధారంగా చేసుకున్న కళాకారులను ఆదుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే ప్రత్యేక చర్యలు చేపట్టి ఆర్థికంగా, సామాజికంగా చేయూతనందించాలని ఆయన డిమాండ్ చేశారు. జేబీ కల్చరల్ ఆర్ట్ సొసైటీ ఆధ్వర్యంలో జడల శివ నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమానికి జనగాం రాము వ్యాఖ్యాతగా వ్యవహరించారు. కార్యక్రమంలో డా. హరిప్రియ హరినాథ్, శంకర్ సారంగపాణి శిష్యులు, సింగర్ శ్యామ్, ప్రసాద్, సురేందర్, ఇమ్మానుయేల్, మున్నా, తోట రవి, రంగనాథ్, చంద్రశేఖర్, బుజంగారావు, శిభ, చ. రోజారాణి, బిక్షపతి, శ్రీకాంత్, మురళి మధు, కాజీపేట ప్రభాకర్, చిరంజీవి, ప్రవీణ్, మామిండ్ల లక్ష్మణ్, కరిముల సంపత్ రావు, సంపత్ యాదవ్, రవీందర్ రెడ్డి, జూలూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. వివిధ జిల్లాల నుంచి జానపద, ఒగ్గు, చిందు, యక్షగానం, భగవతుల, శాస్త్రీయ కళాకారులు హాజరై తమ కళా ప్రదర్శనలతో అలరించారు.

# రూపా రెడ్డి మేడమ్ హత్యకు నిరసనగా గర్జించిన శ్రీ వేద

**కోటగిరిలో భారీ ర్యాలీ, మానవహారం**

**కోటగిరి, ఆగష్టు 22 :**




నల్గొండ జిల్లా నాగార్జున పాఠశాల ప్రిన్సిపాల్ రూపా రెడ్డి దారుణ హత్యను నిరసిస్తూ కోటగిరి మండల కేంద్రంలో శ్రీ వేద పాఠశాల ఆధ్వర్యంలో భారీ ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఈ ఘాతుకానికి పాల్పడిన నిందితులను తక్షణమే కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించి ధర్నాకు దిగారు.ఈ సందర్భంగా కోటగిరి మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద శ్రీ వేద విద్యార్థులు భారీ మానవహారం నిర్వహించారు. "జోహార్ రూపా రెడ్డి మేడమ్ జోహార్" అంటూ విద్యార్థులు, ఉపాధ్యాయులు చేసిన నినాదాలతో కోటగిరి పుర వీధులు హోరెత్తాయి.అనంతరం ఉపాధ్యాయ బృందం మాట్లాడుతూ.. సమాజంలో నిరంతరం శ్రమిస్తున్న ఉపాధ్యాయులకు సరైన రక్షణ కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. విధి నిర్వహణలో ఉన్న టీచర్లపై ఇటువంటి దాడులు జరగడం దారుణమని, విద్యావ్యవస్థకు భద్రత కల్పించకపోతే భవిష్యత్తు ప్రమాదంలో పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. రూపా రెడ్డి కుటుంబానికి న్యాయం జరిగే వరకు తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు.ఈ నిరసన కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ తెల్ల అక్షర ఉపాధ్యాయ బృందం సాయి పవన్ సాయినాథ్ నాగరాజు రాము రమేష్ భీమ్రావు నఫీజ్ చంద్రకళ సంగీత పూజ సుప్రియ గంగాసాగరి ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# పీఎం శ్రీ పాఠశాలల్లో ఉత్తమ ఫలితాలు సాధించేలా సమగ్ర కార్యాచరణ చేపట్టాలి

- నెలవారీగా పాఠశాలల ఉత్తమ కార్యక్రమాల ప్రదర్శన..
- విద్యార్థుల భద్రత, సైబర్ సేఫ్టీ, ఆర్థిక అక్షరాస్యతపై ప్రత్యేక దృష్టి.
- పదిలో 100 శాతం ఉత్తీర్ణతే లక్ష్యం.
- జిల్లా కలెక్టర్ సీ. హెచ్ ప్రియాంక.

**నారాయణపేట, ఆగస్టు,22:** పీఎం శ్రీ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపరచడంతో పాటు విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి వినూత్న కార్యక్రమాలను నిరంతరం చేపట్టాలని జిల్లా విద్యాశాఖ అధికారులను, పాఠశాలల ప్రధానోపాధ్యాయులను జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆదేశించారు.ప్రతి పాఠశాల ప్రతి నెల తాము చేపట్టిన ఉత్తమ కార్యక్రమాలు, వాటి ద్వారా సాధించిన ఫలితాలు, విద్యార్థుల్లో వచ్చిన మార్పులు, తదుపరి నెలలో చేపట్టనున్న కార్యక్రమాలతో కూడిన ప్రెజెంటేషన్‌ను సిద్ధం చేసుకోవాలని సూచించారు. నెలవారీ సమీక్ష సమావేశాల్లో ప్రతి పాఠశాల నుంచి ప్రతినిధులు తమ కార్యక్రమాలను ఇతర పాఠశాలలతో పంచుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు.

శనివారం జిల్లా కలెక్టరేట్ లోని వీసీ హాల్ లో జిల్లాలోని 19 పీఎం శ్రీ పాఠశాలల హెచ్ ఎం లతో జిల్లా విద్యా శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పాఠశాలల్లో బాలికలకు సేఫ్ టచ్–అన్‌సేఫ్ టచ్పై వచ్చే వారంలోనే ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు. అవసరమైతే సంబంధిత రంగంలో నిపుణులను పాఠశాలకు ఆహ్వానించి విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో ప్రదర్శనాత్మకంగా అవగాహన కల్పించాలన్నారు. విద్యార్థులను తరగతుల వారీగా సమూహాలుగా విభజించి, వారికి అవసరమైన భద్రతా అంశాలపై స్పష్టమైన అవగాహన కల్పించాలని తెలిపారు.విద్యార్థుల్లో చిన్న వయస్సు నుంచే పొదుపు అలవాటును పెంపొందించేందుకు పిగ్గీ బ్యాంక్ కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు. డబ్బు విలువ, పొదుపు, ఆర్థిక నిర్వహణ వంటి అంశాలపై విద్యార్థులకు ప్రాథమిక అవగాహన కల్పించాలని తెలిపారు.తదుపరి సమీక్షలో ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు ఏం బోధించారు, వారు ఎంతవరకు అర్థం చేసుకున్నారు, వారి ప్రవర్తనలో ఎలాంటి మార్పు వచ్చింది, ఇకపై ఏం చేయబోతున్నారు అనే అంశాలను ప్రెజెంటేషన్‌లో చూపించాలని సూచించారు.

**చట్ట విజ్ఞానం, సైబర్ సేఫ్టీపై అవగాహన**

అక్టోబర్–నవంబర్ నెలల్లో చట్ట విజ్ఞానం, సైబర్ సేఫ్టీ, స్వీయ రక్షణ కార్యక్రమాలను ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలని సూచించారు.స్థానిక పోలీస్ శాఖ, సైబర్ వింగ్ అధికారులతో సమన్వయం చేసుకుని విద్యార్థులకు సైబర్ నేరాలు, ఆన్‌లైన్ భద్రత, సంబంధిత చట్టాలు, బాలల హక్కులు తదితర అంశాలపై అవగాహన కల్పించాలని తెలిపారు. అవసరమైన చోట స్థానిక ఎస్ఐలు, సైబర్ నిపుణులను పాఠశాలలకు ఆహ్వానించి ప్రత్యక్ష అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

**నిధులను సద్వినియోగం చేయాలి**

పీఎం శ్రీ పాఠశాలలకు ప్రభుత్వం విడుదల చేస్తున్న వివిధ గ్రాంట్లను అత్యంత జవాబుదారీతనం, పారదర్శకతతో, విద్యార్థుల ప్రయోజనాలకు అనుగుణంగా సద్వినియోగం చేయాలని సూచించారు.గ్రీనరీ, పాఠశాలల సుందరీకరణ, క్లబ్బుల ఏర్పాటు, విద్యార్థుల కార్యకలాపాలు, లైబ్రరీ, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ తదితర కార్యక్రమాలకు అందుబాటులో ఉన్న నిధులను సక్రమంగా వినియోగించాలన్నారు. నిధులు ఖర్చు చేయడం మాత్రమే కాకుండా, వాటి ద్వారా పాఠశాలలో ఎలాంటి కార్యక్రమాలు చేపట్టారు, విద్యార్థులకు ఎలాంటి ప్రయోజనం కలిగింది, ఎలాంటి ఫలితాలు సాధించారు అనే విషయాలను ప్రతి నెల నివేదికలో పొందుపరచాలని సూచించారు.



**10వ తరగతిలో వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యం**

పీఎం శ్రీ పాఠశాలలు ఈ విద్యా సంవత్సరంలో 10వ తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు. ఈ విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని స్పష్టం చేశారు.విద్యార్థుల సామర్థ్యాన్ని బేస్‌లైన్ సర్వే ఆధారంగా గుర్తించి, వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక రిమీడియల్ తరగతులు నిర్వహించాలని తెలిపారు. ప్రతి విద్యార్థి స్థాయిని గుర్తించి విద్యార్థి వారీగా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. విజువల్ లెర్నింగ్, ఎస్ ఎల్ ఎంలు, ప్రయోగాత్మక బోధన వంటి ఆధునిక పద్ధతులను ఉపయోగించి విద్యార్థులకు పాఠ్యాంశాలను సులభంగా అర్థమయ్యేలా బోధించాలని సూచించారు. ప్రతిభావంతులైన విద్యార్థులను కూడా గుర్తించి వారి సామర్థ్యాన్ని మరింత పెంచేలా ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలన్నారు.

**ప్రతి కార్యక్రమానికి డాక్యుమెంటేషన్ తప్పనిసరి**

పాఠశాలల్లో చేపట్టే ప్రతి కార్యక్రమానికి సంబంధించిన ఫొటోలు, హాజరు వివరాలు, రిజిస్టర్లు, ఫిర్యాదు పట్టికలు, సమావేశాల వివరాలు, కార్యక్రమ నివేదికలు వంటి డాక్యుమెంటేషన్‌ను సక్రమంగా నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ప్రతి నెల పాఠశాల స్థాయి నుంచి మండల/జిల్లా స్థాయికి నివేదికలు సమర్పించేలా వ్యవస్థను ఏర్పాటు చేయాలని తెలిపారు. ఆయా పాఠశాలల్లో అమలు చేస్తున్న వినూత్న కార్యక్రమాలు విజయవంతమైతే వాటిని ఇతర పాఠశాలలకు కూడా విస్తరించే అవకాశం ఉంటుందని తెలిపారు. అందువల్ల ప్రతి పాఠశాల తన కార్యక్రమాలను ఒకదానితో ఒకటి పోటీగా కాకుండా ఉత్తమ పద్ధతులను పరస్పరం పంచుకునే విధంగా పనిచేయాలని సూచించారు.ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న నిధులను సద్వినియోగం చేసి పీఎం శ్రీ పాఠశాలలు జిల్లాలో ఆదర్శ పాఠశాలలుగా నిలిచేలా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేయాలని కోరారు.

**తదుపరి సమావేశానికి కార్యాచరణ నివేదిక**

తదుపరి సమీక్ష సమావేశంలో ఈ నెలలో చేపట్టిన కార్యక్రమాలు, సాధించిన ఫలితాలు, ఎదురైన సమస్యలు, పెండింగ్ అంశాలు, తదుపరి నెలలో చేపట్టనున్న కార్యక్రమాలపై స్పష్టమైన ప్రెజెంటేషన్ ఇవ్వాలని సూచించారు.అలాగే అవసరమైన చోట విద్యాశాఖతో పాటు ఇతర ప్రభుత్వ శాఖల సహకారం తీసుకునేందుకు ప్రతిపాదనలు సమర్పించాలని తెలిపారు.

పీఎం శ్రీ పాఠశాలలు విద్యా ప్రమాణాలతో పాటు విద్యార్థుల భద్రత, నైపుణ్యాలు,ఆత్మవిశ్వాసం, ఆర్థిక అవగాహన, సాంకేతిక పరిజ్ఞానం వంటి అన్ని రంగాల్లో విద్యార్థులను తీర్చిదిద్దే ఆదర్శ విద్యాసంస్థలుగా అభివృద్ధి చెందేలా ప్రతి ఒక్కరూ బాధ్యతతో పనిచేయాలని ఆమె సూచించారు. ఈ సమావేశంలో జిల్లా విద్యా శాఖ అధికారి గోవింద రాజులు, ఏ ఎం వో విద్యా సాగర్, గురుకుల పాఠశాలలు/కళాశాలల జిల్లా సమన్వయకర్త నాగ మణిమాల, ఎంఈవో లు, ఆయా పాఠశాలల హెచ్ ఎం లు పాల్గొన్నారు.

# వరంగల్ వెస్ట్ లో కాంగ్రెస్ పార్టీకి కొత్త డివిజన్ అధ్యక్షులు

- 26 జీడబ్ల్యూఎంసీ డివిజన్లకు నియామకాలు.. టీపీసీసీ ఆమోదం
- ఉత్తర్వులు డీసీసీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రాంరెడ్డి



**హన్మకొండ, ఆగస్టు 22, ::** నియోజకవర్గ పరిధిలోని 26 జీడబ్ల్యూఎంసీ డివిజన్లకు కాంగ్రెస్ పార్టీ నూతన డివిజన్ అధ్యక్షులను నియమించింది. ఈ నియామక ప్రతిపాదనలకు టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ఆమోదం తెలపగా, హనుమకొండ డీసీసీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి అధికారికంగా ఉత్తర్వులు జారీ చేశారు. నూతన నియామకాలు తక్షణమే అమల్లోకి వస్తాయని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. డివిజన్ స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు, క్షేత్రస్థాయిలో సంస్థాగత నిర్మాణాన్ని పటిష్టం చేయడానికి నూతన అధ్యక్షులు అంకితభావంతో పనిచేయాలని పార్టీ నాయకత్వం ఆకాంక్షించింది. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి, వాటి పరిష్కారానికి కృషి చేస్తూ పార్టీని ప్రజలకు మరింత చేరువ చేయాలని సూచించింది. ఈ సందర్భంగా నూతనంగా నియమితులైన డివిజన్ అధ్యక్షులకు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి హృదయపూర్వక అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. నూతనంగా నియమితులైన వారిలో డివిజన్ 4కు బాషబోయిన శ్రీధర్ యాదవ్, 5కు సోమ కరుణ శ్రీ, 6కు మహమ్మద్ ఆజం, 7కు పోలు లక్ష్మీనారాయణ, 8కు సీతా శ్యామ్, 9కు భీమా వినయ్, 10కు మహమ్మద్ ఫిరోజ్ ఖాన్, 11కు ఎండీ. సమద్, 29కు బొమ్మ సురేష్, 30కు రాజ్ కుమార్, 31కు సత్తు రమేష్, 47కు దొంగల కుమార్, 48కు చందు, 49కు నాగపురి కరణ్, 50కు బషీర్, 51కు కరీం, 52కు తడుక సుమన్, 53కు ఎర్ర మహేందర్, 54కు సుమన్, 57కు అశోక్ రెడ్డి, 58కు తాళ్లపెల్లి సుధాకర్, 59కు దీపక్ రెడ్డి, 60కు బుస్స నవీన్, 61కు అర్కవత్ లక్ష్మణ్ నాయక్, 62కు పాలడుగుల ఆంజనేయులు, 63కు విజయశ్రీ రజాలి నియమితులయ్యారు. నూతన అధ్యక్షుల నాయకత్వంలో ఆయా డివిజన్లలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతమై, ప్రజలతో పార్టీ అనుబంధం మరింత పెరుగుతుందని నాయకత్వం ఆశాభావం వ్యక్తం చేసింది.

# అర్హులైన ప్రతీ కుటుంబానికి స్మార్ట్ రేషన్ కార్డు

- పేదల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం... ఎమ్మెల్యే 'రేవూరి'
- ఏ పేద కుటుంబం సంక్షేమానికి దూరం కాకూడదు.. అర్హులందరికీ స్మార్ట్ రేషన్ కార్డులు



**పరకాల, ఆగస్టు 22 ::** అర్హత కలిగిన ప్రతి పేద కుటుంబానికి స్మార్ట్ రేషన్ కార్డు అందించడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి తెలిపారు. పేదల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని, అర్హత ఉన్న ఏ ఒక్క కుటుంబం కూడా ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దూరం కాకుండా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. శనివారం గీసుకొండ మండలం ఉకల్ క్రాస్‌లోని ఎస్ఎస్ గార్డెన్‌లో గీసుకొండ, సంగెం మండలాలతో పాటు 15, 16, 17వ డివిజన్ల పరిధిలోని పేద కుటుంబాల లబ్ధిదారులకు నూతన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అర్హత ఉన్నప్పటికీ అనేక మంది పేద కుటుంబాలకు రేషన్ కార్డులు అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని పేర్కొన్నారు. ప్రస్తుతం గీసుకొండ మండలానికి 11,648, సంగెం మండలానికి 16,752, 15వ డివిజన్‌కు 6,202, 16వ డివిజన్‌కు 2,164, 17వ డివిజన్‌కు 4,339 నూతన స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందేలా ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. రేషన్ కార్డు కేవలం ఒక గుర్తింపు కార్డు మాత్రమే కాదని, పేద కుటుంబాలకు ప్రభుత్వం అందించే అనేక సంక్షేమ పథకాలకు ఇది కీలక ఆధారమని ఎమ్మెల్యే వివరించారు. అర్హత ఉన్న ఏ ఒక్క కుటుంబం కూడా ప్రభుత్వ సంక్షేమానికి దూరం కాకుండా చర్యలు తీసుకుంటామని, అర్హులైన ప్రతి కుటుంబానికి స్మార్ట్ రేషన్ కార్డు అందేలా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. పేదల జీవితాల్లో భరోసా నింపుతూ, వారికి అండగా నిలవడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే రేవూరి స్పష్టం చేశారు.

# మల్లంపల్లి అభివృద్ధికి రూ.21 కోట్ల రోడ్డు పనులు

**సిద్దిపేట, ఆగస్టు 22::**హుస్నాబాద్ నియోజకవర్గం అక్కన్నపేట మండలం మల్లంపల్లిలో రూ.21 కోట్లతో కట్కూరు ఎక్స్‌రోడ్డు–గొల్లపల్లి–మల్లంపల్లి–మోత్కులపల్లి రహదారి అభివృద్ధి పనులు త్వరలో ప్రారంభమవుతాయని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. టెండర్ ప్రక్రియ ఇప్పటికే పూర్తయిందన్నారు. 'పల్లె పల్లెకు పొన్నం అన్న–పల్లె పల్లెలో ప్రజా పాలన' కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి, ప్రజల సమక్షంలో గ్రామ అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై అధికారులతో సమీక్షించారు. రూ.65 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లు, కాంపౌండ్ వాల్‌ను ప్రారంభించి, వన మహోత్సవంలో భాగంగా ఈత మొక్కలు నాటారు. గ్రామంలో పెన్షన్లు, రైతు భరోసా, రైతు రుణమాఫీ, గృహజ్యోతి, మహాలక్ష్మి గ్యాస్ సబ్సిడీ, ఇందిరమ్మ ఇళ్లు, సన్నబియ్యం పంపిణీ తదితర సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని తెలిపారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జలసిరి కింద ఇంటింటా ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని, రైతులు ఆరుతడి పంటలు, ఆయిల్‌పామ్ సాగుపై దృష్టి పెట్టాలని సూచించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి స్టీల్ బ్యాంకులను ప్రోత్సహించాలని కోరారు. గ్రామాల సమగ్ర అభివృద్ధితో పాటు అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందించడమే ప్రజా పాలన ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు.

చురకలు





## ముడతలు,వలయాలు ఇలా తొలగిద్దాం



వయసు పెరిగేకొద్దీ ముఖంపై ముడతలు, కండ్ల కింద వలయాలు అందాన్ని దూరం చేస్తాయి. ఈ ముడతలు,వలయాలను గోరు వెచ్చని నీళ్లు తరిమికొడతాయి. వెడల్పాటి గిన్నెలో గోరువెచ్చని నీళ్లు పోసి..అందులో 20 సెకండ్ల పాటు ముఖాన్ని ఉంచండి. శ్వాస తీసుకోవడం ఇబ్బంది అయితే, పదేసి సెకండ్ల చొప్పున రెండు, మూడుసార్లు ముఖం అంతా మునిగేలా తలను నీళ్లలో ఉంచాలి. తర్వాత మెత్తటి వస్త్రంతో ముఖాన్ని తుడుచుకోవాలి.గోరువెచ్చని నీళ్లతో ముఖం కడగడం వల్ల చర్మం తాజాగా మారి ముడతలు తగ్గుముఖం పడతాయి. మొటిమలు,మచ్చలు కూడాతగ్గతాయి. రక్తప్రసరణ మెరుగై చర్మం మెరుస్తుంది. గోరువెచ్చని నీళ్లు చర్మంపై ఉండే మృతకణాలను తొలగిస్తాయి. దుమ్ము, ధూళి, మేకప్ వల్ల మూసుకుపోయిన స్వేదరంధ్రాలను తెరుస్తాయి. ఫలితంగా చర్మానికి మంచి నిగారింపు వస్తుంది



## 'ఏడుపూ మంచిదే..!

ఏడుపుకు మనిషికి అవినావ సంబంధం ఉంటుంది. పుట్టినప్పటి నుంచి చనిపోయేవరకు మనిషికి కన్నీళ్లు తోడుగా ఉంటాయి. కష్టాలు, కన్నీళ్లు కామన్ గా వస్తూ ఉంటాయి. బాగా సంతోషం కలిగినా కన్నీళ్లే వస్తాయి... విపరీతమైన బాధలోనూ దు:ఖం పొంగివస్తుంది. అయితే కన్నీరంతా దు:ఖమేమీ కాదు. ఉల్లిపాయలు కోసేటప్పుడు కూడా కన్నీళ్లు వస్తాయి.. అలా అని ఏడుస్తున్నట్లు దాని అర్థం కాదు కదా.

అయితే కొన్ని సందర్భాలలో ఇంట్లో ఎవరైనా ఏడుస్తుంటే ఏడువు ఏం నష్టం లేదు అని అంటుండటం మనం వింటుంటాం. పెద్దలు ఆ మాట ఊరికే అనలేదండోయ్. ఏడుపు వల్ల చాలా ప్రయోజనాలే ఉన్నాయండి. అందుకే ఎంత ఏడిస్తే అంత మంచిది అని అంటుంటారు మన పెద్దలు. సహజంగా ఏడుపు వచ్చే స్తేనే ఏడుపు వల్ల లభించే ప్రయోజనాలను పొందగలుగుతాము. ఏడుపు వల్ల చాలా ప్రయోజనాలు ఉన్నాయి కాబట్టే ఇటీవల కొంతకాలంగా లాఫింగ్ క్లబ్ ల మాదిరిగా క్రయింగ్ క్లబ్ లు కూడా వచ్చేస్తున్నాయి. అయితే అసలు ఏడుపు వల్ల ఏం ప్రయోజనాలు ఉంటాయో ఇప్పుడు చూడండి.

ఏడుపు వల్ల ప్రయోజనాలివే

ఏదైనా గాయం జరిగినప్పుడు నొప్పి తట్టుకోలేక గట్టిగా ఏడ్చేస్తుంటాం. ఇదీ ఒకందుకు మంచిదేనట. కన్నీళ్లలో ఒకరకమైన పెయిన్ కిల్లర్ ఉంటుందట. బాగా ఏడ్చిన తర్వాత నొప్పి తగ్గినట్లు అనిపించడానికి ఇదే కారణం.

ఏడుపు చర్మ ఆరోగ్యానికి చాలా మేలు చేస్తుందని మీకు తెలుసా? ఏడ్చే సమయంలో మొఖంలో రక్త ప్రసరణ పెరిగి చర్మానికి కొత్త నిగారింపు వస్తుంది. మనసారా ఏడ్చినప్పుడు మనసులోని చేదు జ్ఞాపకాలు మసకబారిపోతున్న ఫీలింగ్ వస్తుంది.

కన్నీళ్లతో పాటు కార్టిసాల్ అనే ఒత్తిడి హార్మోన్ కూడా బయటకి వెళ్లిపోతుంది. అందువల్ల బాగా ఏడ్చిన తర్వాత మనసు తేలికపడుతుంది.

ఏడ్చినప్పుడు కన్నీళ్లు వస్తాయి. కన్నీళ్లు మన కళ్లను పొడిబారనీయవు. బైక్ కు ఇంజిన్ ఆయిల్ ఎలా పనిచేస్తుందో కళ్లకు సహజసిద్ధమైన లూబ్రికెంట్స్ ఇవి. ఎక్కువగా సంతోషంగా ఉంటే మనసారా నవ్వుతాం. ఓ అంచనా ప్రకారం మనసారా నవ్వినప్పుడు 1.3 క్యాలరీలు కరిగిపోతాయి..మనసారా ఏడ్చినప్పుడు కూడా అంతే క్యాలరీలు కరిగిపోతాయంట.

# ధనియాలతో ఇన్ని లాభాలున్నాయా?



మనం ఇంట్లో ఉపయోగించే ఆహార దినుసులలో ధనియాలు ఒకటి. వంటల్లో ధనియాలకు ఉండే ప్రాముఖ్యత అంతా కాదు. ధనియాలు అనేక అనారోగ్య సమస్యలకు మంచి దివ్య ఔషధంలా పనిచేస్తాయి. మన శరీరానికి కావలసిన ఆరోగ్య ప్రయోజనాలను ధనియాలు ఇస్తాయి. ఇక ధనియాలు మనకు ఇచ్చే ఆరోగ్య ప్రయోజనాలను గురించి ప్రస్తుతం మనం తెలుసుకుందాం.

### మధుమేహం కంట్రోల్ చేసుకోవచ్చు..!




ధనియాలు మధుమేహాన్ని నివారించడానికి అద్భుతంగా పనిచేస్తాయి. మధుమేహం రాకుండా ధనియాలు కాపాడుతాయి. ధనియాలను ఆహారంలో భాగంగా చేసుకోవడం వల్ల మన శరీరంలో చెడు కొలెస్ట్రాల్ తగ్గుతుంది. కొలెస్ట్రాల్ ను నియంత్రించడానికి ధనియాల పొడిని ఒక గ్లాసు నీళ్లల్లో మరిగించి చల్లార్చి తీసుకుంటే ఎంతో బాగా పనిచేస్తుంది.

### లివర్ ఆరోగ్యం

ధనియాలు రోజు తీసుకోవడం వల్ల జుట్టు ఆరోగ్యంగా ఉంటుంది. జుట్టు రాలే సమస్య తగ్గుతుంది. ధనియాలు మన లివర్ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. మలబద్ధకాన్ని నివారిస్తాయి. అనేక చర్మ సమస్యలను తగ్గించడంలో ధనియాలు కీలకంగా పనిచేస్తాయి. గజ్జి, దురదలు, దద్దుర్లు, వాపులు వంటి వాటిని ధనియాలు తగ్గిస్తాయి.



### ధనియాలతో కొలెస్ట్రాల్ కు చెక్

అధిక బరువుతో బాధపడేవారు ధనియాల నీళ్లను తాగడం వల మంచి ప్రయోజనం ఉంటుంది. రకంలో కొలెసాల్ అధికంగా ఉంటే గుండె జబ్బులు వచ్చే ప్రమాదం ఉంటుంది. రక్తంలో కొలెస్ట్రాల్ ను తగ్గించడానికి ధనియాలు ఎంతో బాగా ఉపయోగపడతాయి. పీరియడ్స్ సమయంలో వచ్చే నొప్పిని తగ్గించడానికి కూడా ధనియాలు ఉపయోగపడతాయి.




### జీర్ణవ్యవస్థకు మేలు

ధనియాలు మన జీర్ణవ్యవస్థను కాపాడతాయి. ధనియాలు మన బరువు తగ్గడానికి ప్రధానంగా దోహదం చేస్తాయి. ధనియాలతో కలిగే ఆరోగ్య ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని అందుకు తగినట్టు మనం ఆహారంలో భాగం చేసుకోవాలి. ఆరోగ్యానికి ధనియాలు నిజంగా వరం అని చెప్పాలి.



### నార్మల్ పీరియడ్స్ కోసం..

రక్తస్రావం అధికంగా అవుతున్నవారు ధనియాల నీళ్లను మరిగించి తేనె లేదా పటిక బెల్లం కలుపుకుని తాగితే రక్తస్రావం తగ్గి పీరియడ్స్ నార్మల్ గా వచ్చే అవకాశం ఉంటుంది. ధనియాలు మన శరీరంలోని ఫ్రీ రాడికల్స్ ని ఎదుర్కోవడానికి ఎంతో బాగా ఉపయోగపడతాయి. మన శరీర ఆరోగ్యానికి మాత్రమే కాకుండా చర్మ సౌందర్యానికి



కూడా ధనియాలు ఉపయోగపడతాయి.



## నిద్రతోనే మానసిక ఆరోగ్యం



నిద్ర మన శరీరానికి, మానసిక ఆరోగ్యానికి ఎంతో కీలకమైంది. కాగా నిద్ర తగ్గినా, అస్సలు లేకపోయినా అనేక అనారోగ్య సమస్యలు వస్తాయి. సరైన నిద్ర అనేది శారీరక మానసిక సమస్యలను పరిష్కరిస్తుంది. మన ఆహారపు అలవాట్లు, నిద్ర మన శారీరక ఆరోగ్యాన్ని ఎలా ప్రభావితం చేస్తాయి.

అదే విధంగా మన మానసిక ఆరోగ్యం కూడా చాలా ఎక్కువగా ప్రభావితమవుతుంది. నిద్ర మన మానసిక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతుంది. ఒత్తిడి మరింతగా పెరిగి డిప్రెషన్ బారీన పడాల్సి వస్తుంది. దీని కారణంగా మానసిక సమస్యలు తలెత్తి జ్ఞాపక శక్తి తగ్గుతుందని మానసిక వైద్యనిపుణులు చెబుతున్నారు.

సుదీర్ఘకాలం నిద్ర లేకపోవడం వల్ల ఒత్తిడి, ఆందోళన పెరుగుతాయని సైకియాట్రిస్ట్ లు వెల్లడిస్తున్నారు. ఇది పలు సమస్యలకు తగిన పరిష్కారాలకు సరైన నిర్ణయం తీసుకోలేకపోవడంపై కూడా ప్రభావం చూపుతుంది. ఇది మానసిక ఆరోగ్యాన్ని దెబ్బ తీస్తుంది.

నిద్ర సరిపోకపోవడం వల్ల అనేక అనారోగ్య సమస్యలకు కారణం అవుతుంది. అటువంటి పరిస్థితులలో, మానసికంగా దృఢంగా ఉండటానికి, మానసిక స్థితి నియంత్రణకు ప్రతిరోజూ ఏడు నుంచి ఎనిమిది గంటల నిద్ర అవసరం అని మానసిక వైద్యనిపుణులు చెబుతున్నారు.

ఇది మెదడు పనితీరుకు మద్దతు ఇవ్వడం, రోజువారీ ఒత్తిడిని తొలగించడానికి ,మానసిక ప్రశాంతతను మెరుగుపరచడమేకాకుండా, మానసిక ఆరోగ్యాన్ని ప్రోత్సహిస్తుంది.

తద్వారా మానసికంగా హెల్తీగా ఉండొచ్చు. మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి తగినంత నిద్ర అవసరమని వైద్యులు చెబుతున్నారు. మనం నిద్రపోతున్నప్పుడు, మన మెదడుకు జ్ఞాపకాలను నిల్వచేసుకోవడానికి, భావోద్వేగాలను ప్రాసెస్ చేయడానికి కోలుకోవడానికి అవకాశం ఉంటుంది.

నిద్ర లేకపోవడంఅనేది నిద్ర ఈ ప్రక్రియలకు అంతరాయం కలిగిస్తుంది. దీని కారణంగా దేని మీద శ్రద్ధ పెట్టలేరు.



### పాకిస్తాన్‌తో జరుగుతున్న టెస్టు సిరీస్‌ను

# ఇంగ్లాండ్ ఘనంగా ఆరంభించింది.




పాకిస్తాన్‌తో జరుగుతున్న టెస్టు సిరీస్‌ను ఇంగ్లాండ్ ఘనంగా ఆరంభించింది. లీడ్స్ వేదికగా జరిగిన తొలి టెస్టులో పాక్‌ను చిత్తు చిత్తుగా ఓడించింది. శుక్రవారం ఇన్నింగ్స్ 103 పరుగుల తేడాతో భారీ విజయాన్ని నమోదు చేసింది. తొలి టెస్టును ఇంగ్లాండ్ మూడు రోజుల్లోనే ముగించడం విశేషం. ఈ మ్యాచ్‌లో మొదటి రోజు నుంచి ఇంగ్లాండ్ ఆధిపత్యం ప్రదర్శించింది. తొలి ఇన్నింగ్స్‌లో పాక్‌ను 171 పరుగులకే ఆలౌట్ చేసింది. ఆ తర్వాత ఇంగ్లాండ్ బ్యాటింగ్‌కు దిగగా.. ఆ జట్టులో హ్యారీ బ్రూక్(91), జోర్డన్ కాక్స్(73), జో రూట్(66), డాన్ లారెన్స్(51) సత్తాచాటారు. ఓవర్‌నైట్ స్కోరు 366/8తో శుక్రవారం ఆట కొనసాగించిన ఇంగ్లాండ్ 409 పరుగుల వద్ద ఆలౌటైంది. దీంతో తొలి ఇన్నింగ్స్ 238 పరుగుల భారీ ఆధిక్యం సాధించింది. మూడో రోజు తొలి సెషన్‌లోనే రెండో ఇన్నింగ్స్‌ను ఆరంభించిన పాక్ మరోసారి చేతులెత్తేసింది. కేవలం 37.3 ఓవర్లపాటే బ్యాటింగ్ చేసి 135 పరుగులకే కుప్పకూలింది. ఆ జట్టులో ఏ ఒక్కరూ పోరాడలేదు. రిజ్వాన్(41) టాప్ స్కోరర్. అజాన్ అవైస్(9), ఇమామ్ ఉల్ హక్(0), షాన్ మసూద్(29), అబ్దుల్లా షఫీక్(15), సౌద్ షకీల్(14), సల్మాన్ అఘా(4).. ఇలా ఆ జట్టు బ్యాటింగ్ లైనప్ తేలిపోయింది. పాక్ బ్యాటర్లు ఇంగ్లాండ్ బౌలింగ్‌ను ఎదుర్కోలేక పెవిలియన్‌కు క్యూకట్టారు. ఇంగ్లాండ్ బౌలర్లలో ఓలి రాబిన్సన్, జోఫ్రా ఆర్చర్, జోష్ టంగ్ చెరో 3 వికెట్లు పడగొట్టి పాక్ పతనాన్ని శాసించారు. దీంతో మరో రెండు రోజుల ఆట ఉండగానే ఇంగ్లాండ్ భారీ విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో ఇంగ్లాండ్ పేసర్లే 20 వికెట్లు తీయడం గమనార్హం. 2001లో పాక్‌తో జరిగిన టెస్టులో కూడా పేసర్లే మొత్తం వికెట్లు తీశారు. తాజా విక్టరీతో మూడు టెస్టుల సిరీస్‌లో ఇంగ్లాండ్ 10తో ఆధిక్యంలోకి వెళ్లింది. ఈ నెల 27 నుంచి రెండో టెస్టు ప్రారంభంకానుంది.



# నెదర్లాండ్స్ చేతిలో భారత్ ఓటమి..

**పురుషుల హాకీ ప్రపంచకప్-2026లో అమ్‌స్టెల్వీన్ వేదికగా నెదర్లాండ్స్‌తో జరిగిన సెకెండ్ రౌండ్ మ్యాచ్‌లో 3-1 తేడాతో భారత్ ఓటమి పాలైంది. దీంతో భారత జట్టు సెమీస్ అవకాశాలు మరింత సంక్లిష్టంగా మారాయి. ఈ కీలక మ్యాచ్‌లో హర్మన్‌ప్రీత్ సేన తేలిపోయింది.**

**ఫస్ట్ హాఫ్‌ల ఇరు జట్ల మధ్య పోరు హోరాహోరీగా సాగింది. భారత డిఫెన్స్ డచ్ జట్టు ఎటాక్‌ను సమర్థవంతంగా అడ్డుకుంది. దీంతో మొదటి రౌండ్ ముగిసే సరికి ఇరు జట్లు కూడా తమ గోల్ ఖాతాను తెరవలేకపోయాయి. అయితే సెకెండ్ హాఫ్‌లో అయితే నెదర్లాండ్స్ చెలరేగిపోయింది. మ్యాచ్ మూడో క్వార్టర్‌లో డ్యూకో టెల్గెన్‌క్యాంప్ అద్భుతమైన గోల్‌తో డచ్ జట్టును 1-0 ఆధిక్యంలోకి తీసుకెళ్లాడు. నాలుగో కార్వరేట్‌లో థిజ్స్ వాన్ డామ్ మరో గోల్ సాధించి నెదర్లాండ్స్ ఆధిక్యాన్ని పెంచాడు. ఆ తర్వాత భారత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ పెనాల్టీ కార్నర్‌ను పవర్ ఫుల్ డ్రాగ్ ఫ్లిక్‌తో గోల్‌గా భారత ఖాతాను తెరిచాడు. కానీ ఆ తర్వాత మరో గోల్‌ను భారత్ సాధించలేకపోయింది. ఇక చివరగా జ్స్ వాన్ డామ్ మరో గోల్ కొట్టి 3-1 తేడాతో నెదర్లాండ్స్ విజయాన్ని ఖాయం చేశాడు. ఈ విజయంతో డచ్ సెమీస్‌కు అర్హత సాధించింది.**

**ఇక భారత్ సెమీస్‌కు అర్హత సాధించాలంటే అద్భుతాలు జరిగాలి. టీమిండియా తమ చివరి మ్యాచ్‌లో అర్జెంటీనాపై భారీ విజయం సాధించడమే కాకుండా, ఇతర జట్ల మ్యాచ్ ఫలితాలుపై కూడా ఆధారపడాల్సి ఉంటుంది.**



# శ్రీలంక జట్టులోకి కొత్త బ్యాటర్

భారత్‌శ్రీలంక మధ్య రెండో టెస్టు ఆదివారం నుంచి కొలంబోలోని సింహాళీస్ స్పోర్ట్స్ క్లబ్ (SSC) మైదానం వేదికగా ప్రారంభం కానుంది. తొలి మ్యాచ్‌లో గెలిచి మంచి జోష్‌లో ఉన్న భారత్.. అదే జోరును కొలంబోలోనూ కొనసాగించాలని ఉవ్విళ్లూరుతోంది. మరోవైపు గాలే టెస్టులో ఘోర ఓటమి చవిచూసిన శ్రీలంక తిరిగి పుంజుకోవాలన్న పట్టుదలతో ఉంది. ఈ క్రమంలో ప్రీమ్యాచ్ ప్రెస్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడిన లంక కెప్టెన్ ధనంజయ డి సిల్వా కీలక వ్యాఖ్యలు చేశాడు. రెండో టెస్టులో భారత్‌ను అడ్డుకునేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని సిల్వా తెలిపాడు.

"బ్యాటింగ్‌లో భారీ స్కోర్ సాధించి, అనంతరం ప్రత్యర్థి వికెట్ల తీయడమే మా ప్రధాన వ్యూహం. గాలే టెస్టులో భారత్ కూడా ఇదే చేసింది. తొలి రెండు రోజులూ బ్యాటింగ్ చేసి టీమిండియా 460 పరుగులు సాధించింది. ఈ మ్యాచ్‌లో మేము కూబా బ్యాటింగ్ పరంగా మెరుగ్గా రాణించి, ప్రత్యర్థి జట్టు 20 వికెట్లు తీసేందుకు ప్రయత్నిస్తాం.

తొలి మ్యాచ్‌లో ఓడిపోవడం నిరాశపరిచినా.. కొలంబోలో మాత్రం తొలి రోజు నుంచే పట్టు సాధించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకున్నాం. సీనియర్ ఆటగాళ్లు జట్టులో లేనప్పటికి, యంగ్ టాలెంట్ రూపంలో మాకు చాలా అవకాశాలు ఉన్నాయి. ఇద్దరు సీమర్లు, ఇద్దరు స్పిన్నర్లతో బరిలోకి దిగుతున్నాం.

ఈ మ్యాచ్ ద్వారా కామిల్ మిషార టెస్టుల్లో అరంగేట్రం చేయనున్నాడు. గతకొంత కాలంగా అతడు అద్భుతంగా రాణిస్తున్నాడు. ఇటీవల టీ20ల్లో సెంచరీ కూడా చేశాడు. అలాగే లెఫ్ట్ ఆర్మ్ పేసర్ విష్వ ఫెర్నాండోను జట్టులోకి తీసుకునే ఆలోచనలో ఉన్నామని" డిసిల్వా పేర్కొన్నాడు.

# అండర్20 ప్రపంచ రెజ్లింగ్.. సత్తా చాటిన భారత మహిళలు

అండర్20 ప్రపంచ రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్‌లో భారత మహిళా రెజ్లర్లు పతకాలతో అదరగొడుతున్నారు. ఈ టోర్నీలో భారత్ ఖాతాలో మరో మూడు పతకాలు చేరాయి. 68 కేజీల విభాగం స్వర్ణ పతక పోరులో చైనాకు చెందిన చెన్‌లింగ్ సాంగ్ చేతిలో 12 స్వల్ప తేడాతో పోరాడి ఓడిన మాన్సి లాథర్ రజత పతకంతో సరిపెట్టుకుంది. 57 కేజీల విభాగంలో తన్వీ మగ్దుమ్ 104 పాయింట్ల తేడాతో అగ్నియా (కెనడా)పై గెలుపొందగా.. 59 కేజీల విభాగంలో కోమల్ 52తో ఎడా బాలాజ్ (హంగేరీ)ని చిత్తుచేసి కాంస్య పతకాలను దక్కించుకున్నారు.

**స్వర్ణం నెగ్గిన కాజల్..**

అంతకుముందు శుక్రవారం జరిగిన 76 కేజీల విభాగం ఫైనల్లో 18 ఏళ్ల కాజల్ దోచాక్ 70తో చైనాకు చెందిన జింగ్రూ సన్‌ను చిత్తుచేసి స్వర్ణ పతకం గెలుచుకుని ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచింది. అలాగే, తను శర్మ (72 కేజీలు), సవిత (62 కేజీలు) ఫైనల్స్ లో జపాన్ రెజ్లర్ల చేతిలో ఓడిపోయి రజత పతకాలకు పరిమితమయ్యారు. టోర్నీ చివరి దశకు చేరుకోగా.. తదుపరి పురుషుల ఫ్రీస్టైల్ 57, 65, 79, 92 కేజీల విభాగాల్లో భారత రెజ్లర్లు పోటీపడనున్నారు.



# మిచెల్ స్టార్క్ 'సిక్సర్'.. 64 పరుగులకే కుప్పకూలిన బంగ్లాదేశ్

ఆస్ట్రేలియాపై తొలి టెస్టులో సంచలన విజయం సాధించిన బంగ్లాదేశ్‌కు (AUS vs BAN) రెండో టెస్టులో పెనుసవాల్ ఎదురైంది. మాక్నాయ్ మైదానంలో జరుగుతోన్న రెండో టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో బంగ్లాదేశ్ 64 పరుగులకే కుప్పకూలింది. తొలి ఆరుగురు బ్యాటర్లు సింగిల్ డిజిట్‌కే పరిమితం కాగా.. అందులో నలుగురు డకౌట్ కావడం గమనార్హం. బంగ్లా ఆఖరి బ్యాటర్ షోరిఫుల్ ఇస్లామ్ (14*) టాప్ స్కోరర్. అతడితోపాటు మెహిదీ హసన్ (11), హసన్ మహ్మూద్ (10), తౌజుల్ ఇస్లామ్ (11*) మాత్రమే రెండంకెల స్కోరు చేశారు. చివరి వికెట్‌కు తౌజుల్ షోరిఫుల్ 25 పరుగుల భాగస్వామ్యమే ఈ ఇన్నింగ్స్‌లో అత్యధికం. ఆసీస్ బౌలర్లలో మిచెల్ స్టార్క్ 6, కమిన్స్ 3, జోష్ హేజిల్‌వుడ్ ఒక వికెట్ తీశారు.

**నిప్పులు చెరిగిన స్టార్క్**

తొలి టెస్టులో ఓటమితో తీవ్ర స్థాయిలో విమర్శలు ఎదుర్కొన్న ఆసీస్ టాస్ నెగ్గి ఫీల్డింగ్ ఎంచుకుంది. స్టార్ పేసర్ మిచెల్ స్టార్క్ (Starc) నిప్పులు చెరిగే బౌలింగ్‌తో బంగ్లాను బెంబేలెత్తించాడు. బంగ్లా కోల్పోయిన మొదటి నాలుగు వికెట్లను స్టార్క్ పడగొట్టాడు. తొలి బంతికే ఓపెనర్ షద్మాన్ (0)ను ఔట్ చేసిన స్టార్క్.. మరో ఓపెనర్ తన్జిద్ (0)ను కూడా డకౌట్ చేశాడు. మోమినల్ హక్ (9) కాస్త పోరాడినా అది సరిపోలేదు. స్టార్క్ బౌలింగ్‌లోనే వికెట్ సమర్పించుకున్నాడు. బంగ్లా కెప్టెన్ షాంటో (0)ను స్టార్క్ వికెట్ల ముందు దొరకబుచ్చుకున్నాడు. సీనియర్ ప్లేయర్ ముస్తాఫికర్ రహీమ్ (5) కమిన్స్ బౌలింగ్‌లో బౌల్డ్ కాగా.. లిటన్ దాస్ (5)ను స్టార్క్ ఎల్బీ చేశాడు. దీంతో 21 పరుగులకే 6 వికెట్లను కోల్పోయింది. కేవలం తాను వేసిన తొలి 22 బంతుల్లోనే ఫైఫర్ తీసి స్టార్క్ అదరగొట్టాడు.

**ఆ నలుగురే..**

కనీసం 30 పరుగులైనా చేస్తుందా? లేదా? అనే పరిస్థితుల్లో ఉన్న బంగ్లాను (AUS vs BAN) మెహిదీ హసన్, షోరిఫుల్ తౌజుల్ భాగస్వామ్యాలు కాపాడాయి. మెహిదీ హసన్ కలిసి ఏడో వికెట్‌కు తొమ్మిది ఓవర్లలో 15 పరుగులు జోడించారు. వీరితోపాటు తస్కిన్ (1) కూడా వెంటవెంటనే పెవిలియన్‌కు చేరడంతో 40రన్స్ కూడా కష్టమేనని అంతా భావించారు. అనూహ్యంగా షోరిఫుల్, తౌజుల్ ఆఖర్లో బౌండరీలతో విరుచుకుపడ్డారు. వీరిద్దరూ ఐదు ఫోర్లు కొట్టడంతో బంగ్లా స్కోరు 64 పరుగులకు చేరుకుంది.

# చరిత్ర సృష్టించిన క్రిస్టియానో రొనాల్డో



**ఫుట్‌బాల్ దిగ్గజం క్రిస్టియానో రొనాల్డో మరో అరుదైన రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. సౌదీ ప్రో లీగ్‌లో భాగంగా అల్ రియాద్‌తో జరిగిన మ్యాచ్‌లో (అల్ నస్ర్ తరపున) గోల్ చేయడంతో వరుసగా 25 సీజన్లలో గోల్ చేసిన తొలి ఫుట్‌బాలర్‌గా చరిత్ర సృష్టించాడు. రొనాల్డో 2002-03 సీజన్ నుంచి ఇప్పటివరకు ప్రతి సీజన్‌లో కనీసం ఒక గోల్ చేశాడు. రొనాల్డోకు ముందు ఈ రికార్డు స్వీడన్ దిగ్గజం జ్లాటన్ ఇబ్రహిమోవిచ్ పేరిట ఉండేది. ఇబ్రహిమోవిచ్ 1999-2000 నుంచి 2022-23 వరకు వరుసగా 24 సీజన్లలో గోల్ చేయగా.. తాజాగా రొనాల్డో ఆ రికార్డును బద్దలు కొట్టాడు.**

**మరో 23 గోల్స్ దూరంలో..! అల్ రియాద్‌పై సాధించిన గోల్ రొనాల్డో కెరీర్‌లో 977వ అధికారిక గోల్. దీంతో చారిత్రాత్మక 1,000 గోల్స్ మైలురాయికి అతను కేవలం 23 గోల్స్ దూరంలో ఉన్నాడు.**

**రొనాల్డో సాధించిన గోల్స్:* రియల్ మాడ్రిడ్: 450* మాంచెస్టర్ యునైటెడ్: 145* జువెంటస్: 101* స్పోర్టింగ్: 5* అల్ నస్ర్: 130* పోర్చుగల్ (జాతీయ జట్టు): 146**

**మొత్తం: 977 గోల్స్**

చురకలు



# అసలైన అందం ఆత్మవిశ్వాసమే: త్రిప్తి డిమ్రి

తన నటన, అందంతో ఓవర్ నైట్ స్టార్‌గా మారిన త్రిప్తి డిమ్రి వరుస అవకాశాలు అందుకుంటున్నారు. 'యానిమల్' చిత్రంతో ఇండస్ట్రీకి వచ్చి తనదైన సత్తాచాటిన ఆమె తెలుగు, హిందీ ఇండస్ట్రీల్లో సినిమాలు చేస్తున్నారు. గత ఏడాది 'ధడక్2' సినిమాతో విమర్శకుల ప్రశంసలు పొందిన ఈ భామ.. తెలుగులో ఓ భారీ ప్రాజెక్ట్ చేయబోతున్నారు. పాన్ ఇండియా స్టార్ ప్రభాస్, సందీప్ రెడ్డి వంగా కాంబోలో రాబోతున్న 'స్పిరిట్'లో త్రిప్తి డిమ్రి హీరోయిన్‌గా చాన్స్ దక్కించుకున్నారు. ప్రస్తుతం షూటింగ్‌లో పాల్గొంటున్న ఆమె.. తాజాగా, ఓ ఇంటర్వ్యూలో పాల్గొని ఆసక్తికర కామెంట్స్ చేశారు. కాన్ఫిడెన్స్, గ్లామర్, ఆకర్షణ.. ఈ మూడింటిలో మీరు దేనికి ఎక్కువగా ప్రాధాన్యం ఇస్తారని యాంకర్ అడగ్గా.. త్రిప్తి ఏమాత్రం తడబడకుండా ఆత్మవిశ్వాసమే అసలైన అందం అని చెప్పారు. తన దృష్టిలో కాన్ఫిడెన్స్ అనేది బయట నుంచి ఎక్కడి నుంచో తెచ్చుకునేది కాదని ఆమె అన్నారు.

ఒక్కసారి మనపై మనకు పూర్తి నమ్మకం ఏర్పడితే మిగిలినవన్నీ దానంతట అవే మనల్ని అనుసరిస్తాయని తెలిపారు. వయసు పెరిగే కొద్దీ అందం, ఆకర్షణపై తన ఆలోచనా విధానం పూర్తిగా మారిపోయిందని త్రిప్తి వెల్లడించారు. చిన్నతనంలో కేవలం శారీరక రూపం, పైకి కనిపించే అందం మాత్రమే ముఖ్యమనుకునేదాన్నని, కానీ ఇప్పుడు తన ఆలోచన పూర్తిగా మారిందని చెప్పారు. నిజమైన ఆకర్షణ అంటే మనపై మనకున్న నమ్మకం, స్వయం గౌరవం, సొంతంగా ఆలోచించి నిర్ణయాలు తీసుకునే శక్తి కలిగి ఉండటమేనని ఆమె చెప్పుకొచ్చారు. నలుగురిలోకి వెళ్లేముందు తనని తాను ప్రశాంతంగా ఉంచుకోవడానికి ప్రాధాన్యం ఇస్తానని పేర్కొన్నారు.



# ఆరోజు అన్నయ్య దూరమవుతాడేమోనని ఏడ్చాను: పవన్ కల్యాణ్

చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ భావోద్వేగ పోస్టు పంచుకున్నారు. పలు ఆసక్తికర విషయాలను ఆయన గుర్తుచేసుకున్నారు. "కాలేజీ చదువు కోసం అన్నయ్య ఇంటికి దూరంగా ఉన్నారు. వేసవి సెలవులకు ఆయన ఇంటికి రావడం మాకు ఒక పండగలా ఉండేది. తిరిగి కాలేజీకి వెళ్లేటప్పుడు ఎంతో బాధపడేవాళ్లం. ఆయన మళ్లీ సెలవులకు వచ్చే వరకు ఇంట్లో ఆ సందడి ఉండేది కాదు. నేను స్కూల్లో చదివే రోజుల్లో అన్నయ్య పక్కన నడవడం కూడా నాకు గర్వంగా ఉండేది. ప్రపంచంలోనే గొప్ప వ్యక్తి పక్కన నడుస్తున్నానని భావించే వాడిని. ఆయన హీరో కాకముందే నాకు హీరో. నేను ఆయనకు అభిమానిని. షూటింగ్‌ల కోసం ఇతర దేశాలు వెళ్లినప్పుడు ఎన్నో బహుమతులు తెచ్చేవాడు. ఎప్పుడూ మా సంతోషాన్నే కోరుకుంటాడు"

"అన్నయ్యకు పెళ్లి అయినప్పుడు ఎక్కడ మాకు దూరమవుతారేమోనని భయపడి ఒక గదిలో నిశ్శబ్దంగా ఏడ్చాను. అప్పుడు ఆయన వదినను నా దగ్గరకు తీసుకువచ్చి.. 'రా.. ఈరోజు నీకు ఒక పెద్ద మనిషిని పరిచయం చేస్తాను' అన్నారు. నేను ఎందుకు ఏడుస్తున్నానో చూసి వాళ్లిద్దరూ నవ్వుకున్నారు. అప్పటి నుంచి వాళ్లిద్దరూ నాపై చూపిస్తున్న ప్రేమను చెప్పడానికి నాకు పదాలు సరిపోవు. అన్నయ్య ఎన్నోసార్లు షూటింగ్‌లలో గాయపడ్డాడు. చెన్నై వేడి, ఉక్కపోతలో 18 గంటల కష్టపడి పనిచేసి.. అర్ధరాత్రి నిలబడటానికి కూడా ఓపిక లేని స్థితిలో ఇంటికి వచ్చేవాడు. ఆయన కష్టంపై ఆధారపడి బతుకుతున్నందుకు అప్పుడు చాలా బాధపడేవాడిని. ఎప్పుడూ నన్ను ఒక్కమాట కూడా అనలేదు. నాకు ఆయన మాత్రమే హీరో" అంటూ చిరుకు విషెస్ చెప్పారు.

**కల్యాణ్ బాబూ.. నువ్వు నాక్కూడా స్ఫూర్తిగా నిలిచావు: మెగాస్టార్**

తన సోదరుడు పవన్ కల్యాణ్ పంచుకున్న భావాలపై చిరంజీవి భావోద్వేగంతో స్పందించారు. "ప్రియమైన కల్యాణ్ బాబూ.. నీ మాటలు మన జీవితంలోని అత్యంత విలువైన అధ్యాయాలను మరోసారి గుర్తుకు తెచ్చి భావోద్వేగానికి గురిచేశాయి. నువ్వు ప్రస్తావించిన నా ప్రేమ, త్యాగాలు వాస్తవానికి మీ అన్నయ్యగా అవి నా బాధ్యత, ఆప్యాయతలు. ఇప్పుడు ప్రజల కోసం నువ్వు చూపుతున్న అచంచల ధైర్యం, పట్టుదల, మన భారతదేశం పట్ల నీకున్న ప్రేమను చూస్తుంటే, నాకెంతో గర్వంగా ఉంది. కొన్ని లక్షల మందికి నువ్వో బలంగా, స్ఫూర్తిగా మారావు. నువ్వు నన్ను నీ హీరో అంటావు కానీ, నీ నిజాయతీ, పట్టుదల, నిస్వార్థమైన ప్రయాణం నన్ను కూడా ఎన్నో విధాలుగా స్ఫూర్తిపొందేలా చేశాయి. ఈ అందమైన జ్ఞాపకాల కానుకను ఇచ్చినందుకు ధన్యవాదాలు. కల్యాణ్ బాబూ, నీ ప్రేమ నా జీవితంలో లభించిన గొప్ప ఆశీర్వాదాల్లో ఒకటి. ఎప్పటికీ నిన్ను ప్రేమిస్తూనే ఉంటాను" అని చిరంజీవి స్పందించారు.



# మహిమా మక్వానా గ్లామరస్ లుక్స్ వైరల్!

మహిమా మక్వానా భారతదేశానికి చెందిన సినిమా, టెలివిజన్ నటి. 1999 ఆగస్టు 5న జన్మించిన ఆమె 'మిలే జబ్ హమ్ తుమ్', 'బాలికా వధు' వంటి సీరియల్స్‌తో బాలనటిగా టెలివిజన్ రంగంలోకి అడుగు పెట్టారు.

అనంతరం 'సప్నే సుహానే లడక్‌పాన్ కే'లో రచన పాత్ర ద్వారా మంచి గుర్తింపును సొంతం చేసుకున్నారు. ఆ తర్వాత మహిమా మక్వానా సినిమాల్లోనూ నటించారు. 2017లో వచ్చిన 'వెంకటాపురం' చిత్రంలో చైత్ర పాత్రలో కనిపించారు. 2019లో 'టేక్ 2' అనే షార్ట్ ఫిల్మ్‌లో నటించారు. 2021లో 'మోసగాళ్ళు' చిత్రంలో సోహా పాత్రలో, 'అంతిమ్: ది ఫైనల్ ట్రూత్'లో మందన 'మండ' చావడా పాత్రలో కనిపించారు. ప్రస్తుతం 'బాస్ కరో ఆంటీ', 'ప్రాజెక్ట్ లవ్' వంటి ప్రాజెక్టుల్లోనూ భాగమవుతున్నారు.

ఇక తాజాగా ఈ ముద్దుగుమ్మ తన ఇన్‌స్టాగ్రామ్‌లో కొన్ని ఫొటోలను పోస్ట్ చేసింది. ఇందులో టైట్ స్లీవ్‌లెస్ డ్రెస్‌లో హాట్ లుక్‌లో కనిపిస్తూ ఫొటోలకు స్టిల్స్ ఇచ్చింది. తన ఫ్రంట్, బ్యాక్ లుక్ హైలైట్ అయ్యేలా ఫొటోలకు పోజులిచ్చి ఆకట్టుకుంది. ఈ ఫొటోల్లో మహిమా తన కురులను అందంగా కొప్పులా చుట్టి, కొన్ని వెంట్రుకలు ముఖంపై పడేలా స్టైలిష్‌గా కనిపించింది. మొత్తంగా ఆమె గ్లామరస్ లుక్, స్కిన్ షోతో ఈ ఫొటోలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ప్రస్తుతం మహిమా మక్వానా తాజా ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారుతున్నాయి.

# 'డేవిడ్ రెడ్డి' షూటింగ్ అప్‌డేట్!

'డేవిడ్ రెడ్డి'గా ప్రేక్షకుల్ని పలకరించనున్నారు కథానాయకుడు మంచు మనోజ్. ఆయన టైటిల్ పాత్రలో నటిస్తున్న ఈ సినిమాని హనుమా రెడ్డి యక్కంటి తెరకెక్కిస్తున్నారు. భరత్ మోటుకూరి, వెంకట్ రెడ్డి నల్ల గంగుల నిర్మిస్తున్నారు. మరియా ర్యాబోషాప్కా కథానాయిక. ఈ చిత్రం ప్రస్తుతం రామోజీ ఫిల్మ్ సిటీలో శరవేగంగా చిత్రీకరణ చేసుకుంటోంది. దాదాపు నెల రోజులుగా సాగుతున్న ఈ షెడ్యూల్‌లో భాగంగా బాలీవుడ్ నటి సౌండస్ మౌఫకీర్‌పై ఓ ప్రత్యేక గీతాన్ని తెరకెక్కిస్తున్నారు. దీనికి శ్రష్ఠి వర్మ నృత్యరీతులు అందిస్తున్నారు. అలాగే మరోవైపు మనోజ్, సముద్రఖని, రమ్యకృష్ణలపై కీలక క్లైమాక్స్ ఫైట్‌ని చిత్రీకరిస్తున్నారు. ఈ పోరాట ఘట్టం చాలా కొత్తగా, ఆసక్తికరంగా ఉంటుందని.. దీనితో పాటు ప్రత్యేక గీతం సినిమాకి ఆకర్షణగా నిలుస్తుందని చిత్ర వర్గాలు ధీమా వ్యక్తం చేస్తున్నాయి. ఇది 18971920 మధ్య బ్రిటిష్ పాలనా కాలంలో జరిగే ఆసక్తికర కథతో రూపొందుతున్న సినిమా. ఇందులో మనోజ్ శక్తిమంతమైన యోధుడిలా.. సరికొత్త లుక్‌లో అలరించనున్నారు. ఈ చిత్రానికి సంగీతం: రవి బస్రూర్, ఫైట్స్: సుప్రీమ్ సుందర్, వింగ్ చున్ అంజి, కూర్పు: ఉజ్వల్ కులకర్ణి, ప్రొడక్షన్ డిజైన్: తాళ్లూరి కృష్ణ మోహన్, ఛాయాగ్రహణం: వేణు ఆచార్య.







# నయనతార 'హాయ్' సినిమా విశేషాలు

లేడీ సూపర్ స్టార్ నయనతార, యంగ్ హీరో కవిన్ జంటగా నటించిన రొమాంటిక్ కామెడీ చిత్రం 'హాయ్'. విష్ణు ఎడవన్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా షూటింగ్ పూర్తి చేసుకుని.. ఆగస్టు 28న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రాబోతోంది. ఈ సందర్భంగా ప్రమోషన్స్‌లో పాల్గొన్న నయనతార పలు ఆసక్తికరమైన విషయాలను పంచుకున్నారు. "'హాయ్' అనేది చాలా క్యూట్ అండ్ స్వీట్ లవ్ స్టోరీ. నా కెరీర్‌లో వచ్చిన బ్లాక్‌బస్టర్ సినిమా 'యారడి నీ మోహిని' (తెలుగులో వెంకటేష్, త్రిష నటించిన 'ఆడవారి మాటలకు అర్థాలే వేరులే' తమిళ రీమేక్) లాంటి ఒక మంచి ఫ్యామిలీ అండ్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌ను మనం చూసి చాలా కాలమైంది. ఈ 'హాయ్' చిత్రం కూడా దాదాపు అదే తరహా అనుభూతిని ఇస్తుంది. అయితే ఆ పాత సినిమా కంటే ఇది కాస్త మోడరన్‌గా, ఈనాటి కాలానికి తగ్గట్టుగా ఉంటుంది" అని తెలిపారు. కుటుంబ నేపథ్యం గురించి చెబుతూ.. "'యారడి నీ మోహిని' చిత్రంలో చాలా మంది నటీనటులతో కూడిన ఒక పెద్ద ఉమ్మడి కుటుంబం కనిపిస్తుంది. కానీ ఈ 'హాయ్' సినిమాలో మాత్రం చాలా సింపుల్, క్యూట్, అండ్ బడ్జెట్ ఫ్రెండ్లీ చిన్న కుటుంబం ఉంటుంది. కుటుంబ బంధాలు, ప్రేమ, వినోదం కలగలిపిన చిత్రం ఇది" అని నయన్ చెప్పుకొచ్చారు. కథలోని పాత్రల స్వభావం గురించి చెబుతూ.. ప్రేమ, పెళ్లి చూపుల్లో వరుసగా తిరస్కరణకు గురయ్యే ఒక సాధారణ యువకుడికి, సమాజపు పాత ఆలోచనలను పట్టించుకోని ఒక స్వతంత్ర భావాలున్న యువతికి మధ్య అనుకోకుండా పెళ్లి జరగడం, ఆ తర్వాత ఒక వైపే ఉన్న ప్రేమ బంధం నిజమైన ప్రేమగా ఎలా మారింది అనే పాయింట్ చాలా చక్కగా చూపించారని దర్శకుడిని నయనతార ప్రశంసించారు.

This newspaper is Owned and Published by **MOHAMMED IMRAN** from H.No. 5-2-109, Osmanpura, Jagitial, Telangana, 505327. Edited by **MOHAMMED IMRAN** and Printed by MAHEERA PRINTERS at H.No.5-2-110, Near Goremiya Chowrastha, Osmanpura, Jagitial Dist. Jagitial ,Telangana-505327. **RNI REGD NO. TELTEL/2006/16536**. Contact No.+91 9848999998, editor@churakalu.com